www.prajapakshAm.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

7th ANNIVERSARY 22nd October, 2025

సంపుటి 28, సంచిక: 132 | ఆదివారం | 02-11-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

‘కన్నడ’పై కేంద్రానికి నిర్లక్ష్యం 05

నవ బిహార్ నిర్మాణం : మహాఘట్‌బంధన్ సంకల్పం 06

అజారుద్దీన్ మంత్రి పదవితో కాంగ్రెస్ విజయం సాధిస్తుందా? 06



## బోరబండ చౌరస్తాకు పిజెఆర్ పేరు



- బిల్లా-రంగాలు ఆటోల్లో తిరుగుతున్నారు
- తాడూబొంగరం లేని బిజెపి జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి చేస్తదట
- పిజెఆర్ చనిపోతే ఏకగ్రీవానికి బిజెపి, బిఆర్ఎస్, ఎందుకు సహకరించలేదు?
- ఎమ్మెల్యేలు చనిపోతే ఎన్నికలు తీసుకొచ్చిందే కెసిఆర్
- బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లో కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శలు

ప్రజాపక్షం/హైదరాబాద్

కారు షెడ్డుకు పోయిందని, బిల్లా రంగాలు ఆటోల్లో తిరుగుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అజారుద్దీన్‌ను మంత్రి చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని అన్నారు. పిజెఆర్ చనిపోతే ఏకగ్రీవానికి బిజెపి, బిఆర్ఎస్ ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. ఈ దుష్ట సంస్కృతికి తెరలేపిందే బిఆర్ఎస్ కాదా అని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే చనిపోతే ఎన్నికలు తీసుకొచ్చిన కసాయే కెసిఆర్ అని విమర్శించారు. బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ రాజేయాలని చూస్తోందన్నారు. పదేళ్లు బిఆర్ఎస్ వ్యక్తి ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో ఆలోచించాలన్నారు. తాడు బొంగరం లేని బిజెపి ఇక్కడ అభివృద్ధి చేస్తామని అంటోందని ఎద్దేవా చేశారు. బోరబండలో అడిగినోళ్లందరికి రేషన్ కార్డులు ఇచ్చామని, ఆడబిడ్డలకు ఫ్రీ బస్సు ఇస్తే బిఆర్ఎస్‌కు కడుపు మండుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘జూబ్లీ హిల్స్ ప్రజలకు ఇచ్చిన హామీని సంపూర్ణం చేశాం. సమస్యల పరిష్కారంలో మాయమాటలు చేయడాన్ని ప్రజలు నమ్మరు. రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం వంటి పేదలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది’ అని సిఎం రేవంత్ రెడ్డి తరువాయి 2లో

## ఆలయంలో తొక్కిసలాట

శనివారం ఏకాదశి కావడం... భక్తులు పోటెత్తారు. దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు స్టీల్ గ్రిల్ ఊడిపోవడంతో ఒకరిపై ఒకరు పడి తొక్కిసలాట జరిగింది. ప్రమాద స్థలం వద్ద ఏడుగురు మృతి చెందగా... మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.



### 9 మంది దుర్మరణం



- ఆంధ్రప్రదేశ్ పలాస కాశీబుగ్గలో పెనువిషాదం
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- మోదీ, ముర్ము, చంద్రబాబు దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు పరిహారం

**పలాస:** ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో శనివారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆలయంలో తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది దుర్మరణం చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారాన్ని ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీలో చిన్న తిరుపతిగా ప్రచారమవుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి కార్తీక ఏకాదశి కావడంతో భక్తులు వేల సంఖ్యలో దర్శనానికి వచ్చారు. ఈ క్రమంలో ఆలయంపై మెట్లకు ఏర్పాటు చేసిన రెయిలింగ్ విరిగిపోవడంతో ఒక్కసారిగా భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో 9 మంది భక్తులు మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది మహిళలు ఉండగా, 13 ఏళ్ల బాలుడు ఉన్నాడు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాచారం తరువాయి 2లో

**మృతుల వివరాలు :** ఎడూరి చిన్నమ్మి (50), రాపాక విజయ (48), మురిపింటి నీలమ్మ (60), దువ్వు రాజేశ్వరి (60), చిన్ని యశోదమ్మ (56), రూప (వయసు వివరాలు అందుబాటులో లేవు), లొట్ల నిఖిల్ (13), డొక్కర అమ్మడమ్మ (వయసు వివరాలు అందుబాటులో లేవు), బోర బందావతి (62).




## క్రియేటివిటీ హబ్‌గా హైదరాబాద్

- తీర్చిదిద్దాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం
- విఎఫ్ఎక్స్, గేమింగ్ అభివృద్ధికి ’కో క్రియేటర్’గా ప్రభుత్వం
- ఫ్యూచర్స్ ఫండ్ ఇ-స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేద్దాం
- ‘ఇండియా జాయ్ 2025‘ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌ను కేవలం ‘ఐటి రాజధాని‘గా మాత్రమే కాదు, భారతదేశపు ‘క్రియేటివిటీ హబ్‘గానూ తీర్చిదిద్దాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విఎఫ్ఎక్స్ యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ (టివిఎజిఎ) సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్ సిటీలోని హెచ్ఐఐసిలో రెండు రోజుల పాటు ‘ఇండియా జాయ్ 2025‘ పేరిట నిర్వహించనున్న ‘ఇండియాస్ ప్రీమియర్ మీడియా అండ్ ఎంటర్‌టెయిన్‌మెంట్ కాంగ్రిగేషన్‘ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సాంకేతికత, సృజనాత్మకత కలిసే చోటుగా హైదరాబాద్ పిక్సెల్, కవిత్వం, అవకాశాల నగరంగా ప్రపంచానికి మార్గ నిర్దేశం చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్రియేటివ్ రంగానికి చేయుతనిచ్చేలా క్రియేటివ్ ఫ్యూచర్స్ ఫండ ఈస్పోర్టట్స్ అకాడమీ, మహిళా క్రియేటర్ల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ను ప్రభుత్వంతో కలిసి ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత దిగ్గజ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ గేమింగ్ పరిశ్రమ విలువ 20 శాతం సీఏజీఆర్ తో 2028 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. భారతదేశ మొత్తం విఎఫ్ఎక్స్ అవుట్ పుట్ లో మన వాటా సుమారు 25 శాతం ఉండటం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఓటిటి కంటెంట్ ప్రొడక్షన్ లో 35 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఇక్కడి ఎకో సిస్టంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇమేజ్ టవర్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ తరువాయి 2లో


## రైతుకు భరోసానివ్వాలి

- ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేల సాయం వెంటనే చెల్లించాలి
- బ్రిడ్జిల నిర్మాణం, చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి
- కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన



ప్రజాపక్షం/చిగురుమామిడి

ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా నేలమట్టమై దెబ్బతిన్న పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, కనీసం ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించి రైతులకు భరోసాగా ప్రభుత్వం నిలవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను, రోడ్లను, లో లెవెల్ బ్రిడ్జిలను సిపిఐ నాయకులతో కలిసి చాడ వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలు పడడం మూలంగా రైతుల పంటలకు అపారమైన నష్టం వాటిల్లిందని, కోతకొచ్చిన వరి పంటలు పూర్తిగా నేలమట్టం అయ్యాయని, వరి కోసి వడ్లు కుప్పలు చేసిన ఆరబోసిన రైతుల ధాన్యాలు పూర్తిగా తడిచిపోయి కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని రైతులు పంటలు పండిస్తే ప్రకృతి వైపరీత్యంతో తీవ్రమైన నష్టం వాటిల్లిందని, కోతకొచ్చిన వరి పంటలు నేలపాలు కావడంతో రైతుల కళ్లల్లో కన్నీళ్లు తప్ప ఏమీ లేవని తరువాయి 2లో




నేడు ‘ఎల్‌విఎం3-ఎం5’


## బాహుబలి రాకెట్ ప్రయోగం!

దేశ చరిత్రలో ఇదే తొలిసారి!!

**శ్రీహరికోట :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశంలోనే అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్ సిఎంఎస్–03 (జిశాట్–7ఆర్)ను నేడు ప్రయోగించనుంది. భారత నావికాదళం కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన ఈ మల్టీబ్యాండ్ మిలిటరీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. ఈ శాటిలైట్‌ను దేశంలోనే అత్యంత తరువాయి 2లో

## తుఫాన్ నష్టం నివేదికలు పంపండి

కలెక్టర్లకు సిఎస్ రామకృష్ణారావు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి సోమవారం లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఆయన శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తరువాయి 12లో


బిజెపి, బిఆర్ఎస్‌లది లోపాయికారి ఒప్పందం
టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
03

బిహార్‌లో ‘డబుల్ ఇంజిన్’ లేదు
ఎన్‌డిఎవి విభజన రాజకీయాలు : ప్రియాంక
05

ఓటరు జాబితాలో అక్రమాలు

## మహారాష్ట్ర విపక్షాల నిరసన ప్రదర్శన

సరిదిద్దిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్



**ముంబయి :** మహారాష్ట్రలో ఓటరు జాబితాలో అక్రమాలపై ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వచ్చి గళమెత్తాయి. అక్రమాలకు వ్యతిరేకంగా శనివారం కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి)లతో కూడిన మహా వికాస్ అఘాడి, మహారాష్ట్ర నవనిర్మాణ సేనతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాలు అధికార బిజెపికి సహాయపడుతున్నాయని ఆరోపించాయి. ఓటరు జాబితాలో పలుమార్లు పేర్లు ఉండడం, తప్పుడు ఓటర్లను తొలగించడం, చేర్పులు వంటి ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాలను పట్టించుకోలేదని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ లోపాలను సరిదిద్దిన తర్వాతే మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని డిమాండ్ చేశాయి. శనివారం మధ్యాహ్నం మహానగరం దక్షిణ ప్రాంతంలోని ఫ్యాషన్ స్ట్రీట్ నుండి ప్రారంభమైన ‘సత్యాచ మోర్చా’ (సత్యం కోసం మార్చ్) కిలోమీటరు దూరంలో ఉన్న బిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ముగిసింది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే, ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్, ఎంఎన్ఎస్ రాజ్ థాక్రే, కాంగ్రెస్ నాయకుడు బాలాసాహెబ్ థోరట్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ ముగింపు సందర్భంగా శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే మాట్లాడుతూ తన పేరు నకిలీ మొబైల్ నుండి ‘సాక్షం’ యాప్‌లో అప్‌లోడ్ చేయబడిందన్నారు. ఓటర్ల జాబితా నుండి తన తరువాయి 2లో



ఈ ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవం

## నవయుగానికి నాంది

**తీవ్ర పేదరికం నుంచి కేరళకు విముక్తి**

**ప్రత్యేక అసెంబ్లీలో సిఎం విజయన్ ప్రకటన**

**తిరువనంతపురం :** కేరళను తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం అసెంబ్లీలో ప్రకటించారు. కేరళ ఆవిర్భావ దినోత్సవం (పిరవి) సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శాసన సభ సమావేశాల్లో విజయన్ ఈ ప్రకటన చేశారు. ఈ సంవత్సరం రాష్ట్ర అవతరణ దినోత్సవం కేరళ ప్రజలకు ఒక నవయుగానికి ప్రారంభంలాంటిదని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రతిపక్షం ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ‘మోసం’గా అభివర్ణించింది. నిరసనగా సమావేశాన్ని బహిష్కరించింది. ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ప్రారంభం తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS



బంగ్లాదేశ్ చిత్తోర్‌గ్రామ్ ఓడరేవును ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వ ప్రయత్నాలను నిరసిస్తూ శనివారం సామూహిక సమ్మెకు దిగిన పోర్ట్ కార్మికులు. ఇక్కడ న్యూ మూరింగ్ కంటైనర్ టెర్మినల్ (ఎన్‌సిటి)ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న డిపి వరల్డ్ సంస్థకు అప్పగించాలని బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనుస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ఈ ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## వచ్చే ఏడాది షెన్‌జెన్‌లో 'ఎపెక్' సదస్సు

### చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్



**బీజింగ్/గ్యోంగ్జు:** చైనా వచ్చే ఏడాది నవంబర్‌లో ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఎపెక్) ఆర్థిక నాయకుల సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనున్నామని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ శనివారం ప్రకటించారు. 2026లో జరిగే ఆసియా, పసిఫిక్ రిమ్‌కు చెందిన 21 దేశాల నాయకుల సదస్సును షెన్‌జెన్ నగరంలో నిర్వహించనున్నట్లు ఆయన దక్షిణ కొరియాలోని గ్యోంగ్జులో ఈ ఏడాది సమావేశం ముగింపు సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. కాగా, గతంలో రెండు పార్యాయాలు ఎపెక్‌కు చైనా ఆతిథ్యమిచ్చింది. అక్కడ ఈ సదస్సు మూడోసారి జరుగుతుంది. కాగా, ఈ ఏడాది ఏపెక్ సదస్సు మొత్తంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జిన్‌పింగ్ సమావేశమే ప్రధానాంశంగా నిలిచింది. ట్రంప్ ఆ సమావేశం అనంతరం తక్షణమే అమెరికాకు వెళ్లిపోగా, జిన్‌పింగ్ మాత్రం సమావేశాలు ముగిసే వరకూ అక్కడే ఉన్నారు. ఈ సమావేశ సందర్భంగానే భేటీ అయిన ఇరువురు నేతలు, ప్రపంచంలోని అగ్ర రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య జరుగుతున్న టారిఫ్ యుద్ధాన్ని ముగించే విషయంపై ఒక అవగాహనకు వచ్చారు. జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, ఫెంటానిల్ సుంకాన్ని 20 శాతం నుండి 10 శాతానికి తగ్గిస్తానని, దీంతో చైనాపై మొత్తం సుంకం 57 శాతం నుండి 47 శాతానికి తగ్గుతుందని చెప్పిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారం, మొబైల్ ఫోన్ల నుండి ఫైటర్ జెట్‌ల తయారీకి అవసరమైన అరుదైన ఖనిజాలపై ఉన్న ఎగుమతి నియంత్రణలను చైనా తొలగించేందుకు అంగీకరించింది. అలాగే, అమెరికా సోయాబీన్స్ దిగుమతులను అనుమతించేందుకు సిద్ధమైంది. అమెరికా కూడా సెమీకండక్టర్ చిప్‌ల ఎగుమతులపై ఉన్న పరిమితులను ఎత్తివేయడానికి అంగీకరించింది. ట్రంప్ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో చైనాను సందర్శిస్తానని, అనంతరం జిన్‌పింగ్ అమెరికాను సందర్శిస్తారని తెలిపారు. అలాగే, ఆయన షెన్‌జెన్ ఏపెక్ సదస్సులో కూడా పాల్గొనవచ్చని సూచించారు. ఇలావుంటే, ఎపెక్ సదస్సు చివరి రోజున జిన్‌పింగ్ ప్రసంగిస్తూ, ఆసియా–పసిఫిక్ ప్రాంత ఆర్థిక వ్యవస్థలు పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని, కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని, కొత్త సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని అన్నారు. సుస్థిరమైన, అభిలక్షణీయమైన భవిష్యత్తును అంతా కలిసి సమష్టిగా నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఆసియా–పసిఫిక్ దేశాలు ఓపెన్ సోర్స్ టెక్నాలజీ సహకారాన్ని మరింతగా లోతుగా చేసుకోవాలని, పోటీతత్వభరితమైన ఓపెన్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సృష్టించాలని జిన్‌పింగ్ అన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) అభివృద్ధి మానవ సంక్షేమ దృష్ట్యా ఆరోగ్యకరంగా, సురక్షితంగా, సమానంగా సాగాలని, అభివృద్ధి చెందిన దేశాలు నిధులు, సాంకేతికత, సామర్థ్య నిర్మాణం వంటి రంగాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవసరమైన మద్దతును కొనసాగించాలని చెప్పారు.

గ్యోంగ్జులో ఎపెక్ సదస్సు విజయవంతంగా ముగిసింది. రెండు రోజుల ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వంటి హేమాహేమీలు హాజరయ్యారు. కీలక నిర్ణయాలు తీసుకున్నామని, పరస్పర సహకారం, ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చామని ఒక అధికారిక ప్రకటన వెలువడింది.సదస్సులో పాల్గొన్న దేశాల నేతలు, అధికారులకు కృతజ్ఞతలు ప్రకటించింది.

## టిఎస్ఎస్‌తో షెన్‌జౌ 21 అనుసంధానం

**జియూక్వాన్ (చైనా):** చైనా ప్రయోగించిన షెన్‌జౌ 21 విజయవంతంగా చైనాకు చెందిన తియాంజాంగ్ స్పేస్ స్టేషన్ (టిఎస్ఎస్)తో అనుసంధానమైంది. ఈ ప్రయోగం రికార్డు వేగంతో పూర్తయినట్టు అధికారిక ప్రకటన వెలువడింది. చైనా మాన్డ్ స్పేస్ ఏజెన్సీని అనుసరించి మొత్తం డాకింగ్ (కలయిక) ప్రక్రియకు సుమారు 3.5 గంటలు మాత్రమే పట్టింది. ఇది పూర్వ మిషన్ల కంటే మూడు గంటలు తక్కువ. షెన్‌జౌ 21 అంతరిక్ష నౌక చైనా వాయవ్య ప్రాంతంలోని జియూక్వాన్ ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన షెన్‌జౌ 21 ద్వారా ముగ్గురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోని తియాన్హే కోర్ మాడ్యూల్‌లో ప్రవేశించనున్నారు. ఈ సిబ్బందిలో పైలట్, మిషన్ కమాండర్ జాంగ్ లూ కూడా ఉన్నాడు. అతను రెండు సంవత్సరాల క్రితం షెన్‌జౌ 15 మిషన్‌లో కూడా పాల్గొన్నారు. ఇతర ఇద్దరు మొదటిసారిగా అంతరిక్ష యాత్ర చేస్తున్నారు. 32 ఏళ్ల ఇంజనీర్ వూ ఫే చైనాలో ఇప్పటివరకు స్పేస్ ఫ్లైట్‌లో పాల్గొన్న అత్యంత పిన్న వయస్కుడు. జాంగ్ హోంగ్‌జాంగ్ ఒక పేలోడ్ నిపుణుడు, వ్యోమగామి కావడానికి ముందు కొత్త శక్తి , కొత్త పదార్థాలపై పరిశోధకుడిగా పనిచేశారు. కాగా తమ బృందం తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌ను ఒక యుటోపియాగా మారుస్తామని, అందులో తాయిచీ వ్యాయామాలు చేయడం, తోటపని చేయడం, కవిత్వాన్ని ఆస్వాదించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వ్యోమగాములు వ్యాఖ్యానించారు. ఇలావుంటే, మొదటిసారిగా చైనా తన స్పేస్ స్టేషన్‌కి ఎలుకలను పంపిస్తోంది. వీటిలో రెండు మగవికాగా, రెండు ఆడవి. బరువు లేమి, పరిమిత ప్రదేశం వాటి ప్రవర్తనపై ఎలా ప్రభావం చూపుతాయో అధ్యయనం చేయనున్నారు.

## టాంజానియా అధ్యక్ష ఎన్నికలు ఏకపక్షం

### ● సామియా హసన్ ఘన విజయం ● అధికార పార్టీకి 98 శాతం ఓట్లు

**దొదోమా:** అధ్యక్ష ఎన్నికల వేళ టాంజానియా అట్టుడికిపోయింది. ఏకపక్షంగా జరిగిన ఎన్నికల ఫలితాలు ప్రకటించవద్దంటూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో హింస జరిగి దాదాపు 700 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అయితే శనివారం ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. సామియా సులుహు హసన్ చారిత్రక విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. ప్రధాన ప్రతిపక్ష నేతలు పోటీలో లేకుండా చేయడం, చిన్న పార్టీల అభ్యర్థులు మాత్రమే రేసులో ఉండటంతో 98 శాతం ఓట్లు హసన్‌కు పడ్డాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రతిపక్షాలు, హక్కుల సంఘాల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఇద్దరు ప్రతిపక్ష నాయకులను పోటీ చేయనివ్వకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 16 చిన్న పార్టీల అభ్యర్థులు మాత్రమే రేసులో ఉండటం, వారి నుంచి హసన్‌కు పోటీ లేకపోవడంతో ఈ ఎన్నికలు ఏకపక్షమయ్యాయి. దీంతో ప్రధాన నగరాల్లో ప్రజాందోళనలు మిన్నంటాయి. ఇదే క్రమంలో హింస జరిగింది. వందల మంది చనిపోయారని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. వాణిజ్య రాజధాని దార్ ఎస్ సలామ్‌లో 350 మంది, మ్వాజాలో 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు చాదేమా పార్టీ అధికార ప్రతినిధి జాన్ కిటోకా వెల్లడించారు. మిగతా ప్రాంతాల్లో సంభవించిన మరణాలు పరిగణనలోకి తీసుకుంటే మృతుల సంఖ్య 700కుపైగానే ఉంటుందని తెలిపారు. అయితే అధికారికంగా మృతుల సంఖ్యను అధికారులు ప్రకటించలేదు. కానీ 10 మంది చనిపోయినట్లు కొన్ని నివేదికలు వచ్చాయి. ప్రజాందోళనలు మిన్నంటిన నేపథ్యంలో పరిస్థితిని అదుపు చేసేందుకు టాంజానియా ప్రభుత్వం సైన్యాన్ని మోహరించింది. ఇంటర్నేట్ సేవలను నిలిపివేసింది. ఆందోళనల దృష్ట్యా యూనివర్సిటీల పున:ప్రారంభాన్ని నవంబరు 3వ తేదీ వరకు వాయిదా వేసింది. భద్రతా సిబ్బంది ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి, బయటకు వచ్చిన వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేస్తుండటంతో వాణిజ్య రాజధాని దార్ ఎస్ సలామ్ వీధులు శనివారం నిర్మానుష్యమయ్యాయి. హింసలో ఎంత మంది చనిపోయారో అధికారులు ప్రకటించలేదు కానీ ఐరాస మానవ హక్కుల కార్యాలయం ప్రకారం షిన్‌యాంగా, మొరొగొగో పట్టణాలతో పాటు దార్ ఎస్ సలామ్‌లో 10 మంది మరణించినట్లు తెలిసింది. టాంజానియా పరిస్థితిపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ సైతం తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. అన్ని వర్గాలు సంయమనం పాటించాలని సూచించారు. బ్రిటన్, కెనడా, నార్వే విదేశాంగ శాఖలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. భద్రతా దళాలు స్పందనతో ప్రాణ నష్టం జరిగిందని, అనేక మంది గాయపడ్డారని ప్రకటన పేర్కొంది. ఇదిలావుంటే, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం అవసరమంటూ ఎన్నికల సంస్కరణల కోసం పిలుపు ఇవ్వడంతో చాడెమా ప్రతిపక్ష సంఘం నాయకుడు తుండు లిస్టుపై అక్కడి ప్రభుత్వం దేశద్రోహిగా ముద్ర వేసింది. ఆయనను జైలుకు పంపింది. కొద్ది నెలలుగా ఆయన ఖైదులోనే ఉన్నారు. మరొక ప్రతిపక్ష నాయకుడు, యాక్ట్‌వజలెండో సంఘానికి చెందిన లుహాగా పినాను పోటీలో నిలవకుండా చేసింది. రాజకీయంగా మార్పును ఆశించిన ప్రతిపక్ష నాయకులను ఎన్నికలకు దూరంగా ఉంచింది. అధికార ఛామా ఛా మపిందుజి (సీసీఎం) పార్టీ నిరంకుశత్వాన్ని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి హక్కుల సంఘాలు ఆక్షేపించాయి. ఎన్నికలకు ముందు అపహరణలు, హత్యలు, అరెస్టులు జరిగినట్లు పేర్కొన్నాయి. 2019 నుంచి కనీసం 200 మంది ఆచూకీ లేకుండా పోయారని ఐరాస మానవ హక్కుల నిపుణుల బృందం జూన్‌లో పేర్కొంది. దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ లేదని, ఎక్స్ వంటి మాధ్యమాలపై నిషేధం ఉందని, టాంజానియా డిజిటల్ మాధ్యమం జమిఫోరమ్స్‌పై ఆంక్షలు ఉన్నాయని ఇంటర్నేషన్ క్రైసిస్ గ్రూప్ అధ్యయనంలో వెల్లడైంది. అసంతృప్తివాదులను బెదిరింపులు అరెస్టులతో ప్రభుత్వం అణచివేస్తున్నట్లు నివేదిక తెలిపింది. టాంజానియాలో ఏకపార్టీ పాలన సాగుతోంది. గత ప్రభుత్వాలు ప్రతిపక్షాలను ఎదుర్కొనేవి కానీ ప్రస్తుత హసన్ ప్రభుత్వం... ప్రజాస్వామిక ఉద్యమాలను ఎక్కడికక్కడ అణచివేస్తోంది.1961లో టాంజానియాకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సీసీఎం పార్టీ మాత్రమే అధికారంలో ఉంది.

## పిజెఆర్ పేరు (మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. 2014లో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఐదేళ్లు మహిళా మంత్రి లేదని, తాము అధికారంలోకి రాగానే ఇద్దరు మహిళలను మంత్రులను చేశామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మాగంటి గోపినాథ్ ఎప్పుడైనా అసెంబ్లీలో ప్రజా సమస్యలు ప్రస్తావించారా అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కావాలంటే నవీన్ యాదవ్‌ను గెలిపించాలన్నారు. నవీన్ యాదవ్ మీ మధ్యలో ఉండి సమస్యలను పరిష్కరిస్తాడన్నారు. ఇందిరమ్మ ఇండ్లను అందించడం, ప్రాంత అభివృద్ధి వంటి బాధ్యతలు అతనికి అప్పగించామన్నారు. మీరు అతనికి ఓట్లు ఇస్తే వందల కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు బోరబండ చౌరస్తాకు పిజెఆర్ పేరు పెట్టాలని కోరుతున్నారని, ఈ సూచనను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా మన్నిస్తోందని, భవిష్యత్తులో ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టుతామన్నారు. ఈ రోడ్‌షోలో టిపిసిసి అధ్యక్షుడు అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ క్రియేటివిటీ హబ్

(మొదటి పేజీ తరువాయి)

తదితరాల అందుబాటులోకి వస్తే ఈ ఎకో సిస్టం మరింత పటిష్టం అవుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇమేజ్ టవర్ ను వచ్చే ఏడాదిలో అందుబాటులోకి తెస్తామన్నారు. క్రియేటివిటీలో సానుభూతి, వైవిధ్యం, సస్టైనబులిటీ, భారతీయ గుర్తింపు ప్రతిబింబించేలా చొరవ తీసుకోవాలని యువ క్రియేటర్స్ కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నియంత్రించేదిగా కాకుండా 'కో క్రియేటర్' గా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, యువ కథానాయకుడు తేజ సజ్జా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్, టీవీఏజీప ప్రెసిడెంట్ రాజీవ్ చిలక, కార్యదర్శి మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విపక్షాల నిరసన ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

పేరును తొలగించడానికి కుట్ర జరిగినట్లు అనుమానంగా ఉందని మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బిజెపిని లక్ష్యంగా చేసుకోవడానికి షోలే నుండి ఒక డైలాగ్ చెబుతూ 'అనకొండ' అనే విమర్శను ఉపయోగించారు. 'పచీస్ కోస్ దూర్ జబ్ బచ్చా రోటా హై తో మా కెహ్తీ హై సో జావో నహీ తో గబ్బర్ ఆ జాయేగా' అనే డైలాగ్ లాగా, మీరందరూ మేల్కొని ఉండాలని చెప్పాలనుకుంటున్నాను, లేకపోతే అనకొండ వస్తుంది' అని థాక్రే అన్నారు. ప్రతిపక్షాలు పాలక కూటమిని ఓడించడానికి ఆసక్తిగా ఉన్నందున ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నాయని ఆయన అన్నారు. తన పార్టీని, పార్టీ చిహ్నాన్ని, తన తండ్రి పేరును దొంగిలించారు, ఇప్పుడు ఓట్లను కూడా తస్కరించాలని చూస్తున్నారని థాక్రే బిజెపి నేతృత్వంలోని పాలకవర్గాన్ని విమర్శించారు. ఈ సంవత్సరం జూలై 1 వరకు అప్‌లోడ్ చేయబడిన ఓటర్ల జాబితా ప్రకారం ముంబయిలో లక్షలాదిగా ద్వంద్వ ఓటర్లు ఉన్నారని రాజ్ థాక్రే ఆరోపించారు. కళ్యాణ్ గ్రామీణ అసెంబ్లీ (పొరుగున ఉన్న థానే జిల్లాలో), మలబార్ హిల్ అసెంబ్లీ (దక్షిణ ముంబైలో)లో దాదాపు 4500 మంది ఓటర్లు ఓటు వేశారు. ఈ బోగస్ ఓటర్ల జాబితాతో ఎన్నికలు అవసరం ఏమిటి? దాన్ని శుభ్రం చేసి, ఆపై ఎన్నికలు నిర్వహించండి అని ఎంఎన్ఎస్ నాయకుడు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పటికే ఐదు సంవత్సరాలుగా ఆలస్యమయ్యాయని, దానిని ఒక సంవత్సరం వెనక్కి నెట్టివేస్తే ఎటువంటి సమస్య ఉండదని ఆయన అన్నారు. ద్వంద్వ ఓటర్ల కోసం ఓటర్ల జాబితాను సూక్ష్మంగా తనిఖీ చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు. ద్వంద్వ ఓటర్లు పట్టుబడినప్పుడల్లా, వారిని కొట్టి, ఆపై పోలీసులకు అప్పగించండని సూచించారు. తాను, ఉద్ధవ్ థాక్రే కలిసి వచ్చారని పార్టీ కార్యకర్తలు అసంతృప్తి చెందవద్దని రాజ్ థాకరే కోరారు. మరాఠీ హిందువులు, మహారాష్ట్ర ప్రజల కోసం తాము చేతులు కలిపామని ఎంఎన్ఎస్ చీఫ్ స్పష్టం చేశారు. రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఈ మోర్చా బలం, ఐక్యతకు ఒక ఆదర్శప్రాయమైన ప్రదర్శన అని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ అన్నారు. మహారాష్ట్ర, కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాలు ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాలాసాహెబ్ థోరట్ మాట్లాడుతూ ఓటు దొంగతనం అంశాన్ని మొదట రాహుల్ గాంధీ లేవనెత్తారని, ఇప్పుడు అది దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాపై తమ అభ్యంతరాన్ని పట్టించుకోలేదని, ఓటర్ల జాబితాను సరిదిద్దిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్ నాయకులు నసీమ్ ఖాన్, సతేజ్ పాటిల్, భాయ్ జగ్తాప్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సులే కూడా నిరసన మోచాలో పాల్గొన్నారు. రాజ్ థాక్రే, తన మద్దతుదారులు, పార్టీ సహోద్యోగి బాలా నందగావ్కర్‌తో కలిసి దాదర్ స్టేషన్‌లో రైలు ఎక్కి చర్చిగేట్‌కు వెళ్లారు. ఈ వారం ప్రారంభంలో ముంబయిలో జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ, థాక్రే ఎంఎన్ఎస్ కార్యకర్తలను వేదికకు చేరుకోవడానికి ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సిఎం రేవంత్‌రెడ్డితో ఫ్రెంచ్ ప్రతినిధుల బృందం భేటీ

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబడులను విస్తరించాలని ఫ్రెంచ్ ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాద్ నగరంలోని ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని బలోపేతం చేయడం ద్వారా ఇరుపక్షాల మధ్య మరింత సన్నిహిత సహకారం కొనసాగించవచ్చని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డిని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా సిఎం నివాసంలో శనివారం కలిసింది. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ సంస్థల సహకారంతో అమలవుతున్న ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమావేశంలో అలయన్స్ ఫ్రాన్స్ హైదరాబాద్ డైరెక్టర్ మౌద్ మిక్వా, ఫ్రెంచ్ బ్యూరో అసిస్టెంట్ రోహిణి రెడ్డిపల్లి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిన వెంటనే మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులు పలాస చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందేలా చూశారు. కాశీబుగ్గకు చెందిన హరిముకుంద పండా తన సొంత నిధులతో ఇక్కడ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించారు. నాలుగు నెలల క్రితం ఆలయానికి భక్తులు రావడం ప్రారంభమైంది. దేవాలయం నిర్మాణం జరిగిన తీరుపై సామాజిక మాధ్యమాలలో చిన్న తిరుపతిగా ప్రచారం కావడంతో భక్తుల తాకిడి అధికమైంది. గత శనివారం కూడా భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పటికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే ఈ శనివారం ఏకాదశి కావడం... మహిళలకు ఉచిత బస్సు కావడంతో భక్తులు పోటెత్తారు. దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు స్టీల్ గ్రిల్ ఊడిపోవడంతో ఒకరిపై ఒకరు పడి తొక్కిసలాట జరిగింది. ప్రమాద స్థలం వద్ద ఏడుగురు మంది మృతి చెందగా...మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మత దేహాలకు స్థానిక పలాస ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో శవ పంచనామా చేసి... కుటుంబ సభ్యులకు అప్పగించారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు భక్తులు నందిగాం మండలం, రౌతుపురం గ్రామానికి చెందిన బాకి కళావతి (50), మందస మండలం బెల్లుపటియ గ్రామానికి చెందిన దువ్వు కుమారి (25)ని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించారు.సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేరుకున్నారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. మాజీమంత్రి, వైసీపీ నాయకులు సీదిరి అప్పలరాజు ఘటనా స్థలానికి చేరుకుని గాయాల పాలైన భక్తులకు వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం వివిధ ఆసుపత్రులకు పంపారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కష్ణదాస్ పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. కాగా ఇక్కడి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వేల సంఖ్యలో భక్తులకు ప్రవేశం కల్పించడం వల్లే ఈ ఘటన జరిగినట్టు పరిశీలకులు అంటున్నారు. ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉందని పోలీసులకు సమాచారం అందించినా... వారు చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### విచారణకు కలెక్టర్ ఆదేశం

కాశీబుగ్గ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్... ముగ్గురు అధికారులతో కూడిన విచారణ బందాన్ని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. టెక్కలి ఆర్‌డీవో ఎం.కష్ణమూర్తి, శ్రీకాకుళం ఏఎస్పీ వీ రమణ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ ఈ బందంలో ఉన్నారు. వీరు ఈ దుర్ఘటనకు సంబంధించి దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వనున్నారు. కాగా, కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంతో దేవాదాయ శాఖకు సంబంధం లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. ఇది ప్రైవేటు వ్యక్తులకు చెందినదని, సొంత నిధులతో ఓ వ్యక్తి ఆలయం నిర్మించారని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కాగా, కాశీబుగ్గ ఘటనపై ఆలయ నిర్వాహకుడు హరిముకుంద్ పండా స్పందించారు. సాధారణంగా ఆలయానికి రెండు వేల మంది వరకు భక్తులు వస్తుంటారని, ఇంత పెద్దసంఖ్యలో వస్తారని ఊహించలేదని తెలిపారు. 'భక్తులకు ప్రసాద వితరణ చేసి పంపిస్తాను. ఇలా జరుగుతుందని ఊహించలేదు. ఇంతమంది వస్తారని తెలియక పోలీసులకు సమాచారం ఇవ్వలేదు' అని అన్నారు. ఆలయంలోనే హరిముకుంద్ పండాతో కలెక్టర్, ఎస్పీ మాట్లాడారు. ప్రస్తుతం ఆలయ పరిసరాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు.

## రైతుకు భరోసానివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని, తక్షణమే సంబంధిత అధికారులచే క్షేత్రస్థాయిలో సర్వే చేయించి అంచనాల నివేదికను ప్రభుత్వానికి అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం తక్షణమే రైతులకు అందించి వారికి భరోసా కల్పించాలని కోరారు. రేకొండ నుంచి పెద్దమ్మపల్లికి వెళ్లే దారిలో 1984లో నిర్మించిన లో లెవెల్ బ్రిడ్జి దెబ్బతిన్నదని, చెరువులోని నీరు బ్రిడ్జి నుంచి ఊరి మీదుగా వెళ్లడంతో బ్రిడ్జి పూర్తిగా చెడిపోయిందన్నారు. రేకొండ నుంచి ఎక్లాస్‌పూర్ వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి దాదాపుగా మూడు సంవత్సరాలు కావస్తుందని, అయినప్పటికీ బ్రిడ్జిపనులకు అతీగతీలేదన్నారు. రేకొండ నుంచి మొగిలిపాలెం వెళ్లే లోలెవెల్ బ్రిడ్జి సైతం నిర్మించాల్సిన అవసరముందన్నారు. తక్షణమే బ్రిడ్జిల నిర్మాణ పనులు చేయాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న మట్టి కొట్టుకుపోయి గండ్లు పడి రోడ్లు పూర్తిగా చెడిపోగా వాటిని మరమ్మత్తులు చేయాలన్నారు. వర్షాల కారణంగా కూలిపోయిన ఇండ్లను పరిశీలించి వారికి తక్షణమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పశువులు సైతం చనిపోయాని వాటికి నష్టపరిహారం అందించాలన్నారు. వరద కాలువలో కల్వర్టులు పూర్తి చేయకపోవడం మూలంగా అనేక ప్రాంతాల్లో ఇసుక మేటలు ఏర్పడి పంట పొలాల్లోకి వరద నీరు వెళ్తుందని, బావుల్లో మట్టి కూరుకుపోయి రైతులకు నష్టం కలుగుతుందన్నారు. తక్షణమే అధికారులు, పాలకులు స్పందించి రైతులకు, ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయమై మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోయిన సర్దార్ వల్లభాయ్ పటేల్, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్ రెడ్డి, ముద్రకోల రాజయ్య, మాజీ ఎంపిటిసి పరకాల కొండయ్య, సిపిఐ పెద్దమపల్లి శాఖ కార్యదర్శి నీల వెంకన్న, నాయకులు తమ్మిశెట్టి రవీందర్, విలాసాగరం అంజయ్య, రాచర్ల రంగయ్య, బోయిని రాజు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెంచల రవి తదితరులున్నారు.

## రాకెట్ ప్రయోగం! (మొదటి పేజీ తరువాయి)

శక్తివంతమైన ఎల్‌వీఎం3 (లాంచ్ వెహికల్ మార్క్ 3) సహాయంతో అంతరిక్షంలోకి ప్రయోగించనున్నారు. ఈ సిఎంఎస్–03 4,410 కిలోల బరువు ఉంటుంది. ఇంతటి బరువైన ఉపగ్రహాన్ని భారత గడ్డ మీద నుంచి జియోస్టేషనరీ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జిటిఒ)లోకి ప్రయోగించేందుకు ప్రయత్నించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 'ఎల్‌వీఎం3/సిఎంఎస్–03 మిషన్‌ను ఆదివారం ప్రయోగించనున్నాం. సిఎంఎస్–03 అనేది కమ్యూనికేషన్ శాటిలైట్. దీనిని ఎల్‌వీఎం3–ఎం5 లాంచ్ వెహికల్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నాం. ఈ ఉపగ్రహం అత్యంత బరువైనది. దీని బరువు 4,410 కిలోలు. ఈ ఉపగ్రహం కమ్యూనికేషన్‌కు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం శ్రీహరికోటలో అన్ని ప్రీలాంచ్ వెరిఫికేషన్ విధానాలు జరుగుతున్నాయి. ఉపగ్రహంతో సహా మొత్తం వెహికల్ ప్రయోగానికి సిద్ధంగా ఉంది. ఈ శాటిలైట్‌ను రేపు సాయంత్రం సుమారు 5:26 గంటలకు ప్రయోగించనున్నాం' అని ఇస్రో చీఫ్ వి. నారాయణన్ తెలిపారు.

## నవయుగానికి నాంది

(మొదటి పేజీ తరువాయి)

కాగానే అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వి.డి. సతీశన్ మాట్లాడుతూ రూల్ 300 ద్వారా సిఎం చేసిన ప్రకటన 'శుద్ధ మోసం' సభ నియమాలను ధిక్కరించడమేనన్నారు. తాము ఇందులో భాగస్వామ్యం కాలేమ ని, సమావేశాన్ని పూర్తిగా బహిష్కరిస్తున్నామని సతీశన్ అన్నారు. సిఎం చేసిన ప్రకటన 'మోసం', 'సిగ్గుచేటు' అని నినాదాలు చేస్తూ సభ నుండి వాకౌట్ చేసింది. విపక్షాల ఆరోపణలకు సిఎం విజయన్ ప్రతిస్పందిస్తూ, యుడిఎఫ్ మోసం అని పేర్కొనడం ఆ కూటమి ప్రవర్తనను సూచిస్తోందని అన్నారు. తాము అమలు చేసేదే చెబుతామని, చెప్పినది అమలు చేస్తామన్నారు. ఇదే ప్రతిపక్ష నాయకుడికి తమ సమాధానం అని విజయన్ ఉద్ఘాటించారు. రాష్ట్రం నుండి తీవ్ర పేదరికాన్ని నిర్మూలించడంతో, కేరళ, 'సంక్షేమ కార్యక్రమాల ప్రయోగశాలగా', ఇతర రాష్ట్రాలు అనుకరించగల, ప్రయోజనం పొందగల కొత్త నమూనాను దేశానికి అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యం, వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల సమన్వయ ప్రయత్నాల కారణంగా ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తయిందని ఆయన అన్నారు. సుమారు 62 లక్షల కుటుంబాలకు సంక్షేమ పెన్షన్ అందించడం, సుమారు 4.70 లక్షల నిరాశ్రయులైన కుటుంబాలకు ఇళ్ళు అందించడం, సుమారు 6,000 ప్రజారోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం, 43 లక్షల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య బీమా, నాలుగు లక్షల కుటుంబాలకు భూమి వంటి చర్యలు 'కేరళలో తీవ్ర పేదరికం యొక్క పరిధి, తీవ్రతను గణనీయంగా తగ్గించడంలో సహాయపడ్డాయని' విజయన్ అన్నారు. ప్రజలు ముందుకు వచ్చి లక్ష్య భావనతో ముందుకు సాగితే, ఏదీ అసాధ్యం కాదని ఈ విజయం నిరూపించిందన్నారు. 'కానీ ఇది ముగింపు కాదు, ఇది ఒక కొత్త ప్రారంభం. తీవ్ర పేదరికం తిరిగి తలెత్తకుండా మేము నిర్ధారిస్తాము. తీవ్ర పేదరిక రహిత స్థితిని కొనసాగించడానికి ఇప్పుడు అప్రమత్తమైన చర్యలు అవసరం. దీని కోసం, ఎప్పటికప్పుడు సరైన తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం దీని కోసం చర్యలు తీసుకుంటుంది. వివిధ స్థాయిలలో కార్యకలాపాలకు సంబంధించిన బ్లూప్రింట్ తయారు చేయబడింది' అని విజయన్ వివరించారు. తీవ్ర పేదరికంలో నివసిస్తున్న కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, సామాజిక న్యాయం, సమానత్వాన్ని నిర్ధారించడానికి రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త వహించిందన్నారు. రాష్ట్రం నుండి తీవ్ర పేదరిక నిర్మూలనతో, ఐక్యరాజ్యసమితి ఊహించిన స్థిరమైన అభివృద్ధి సూచికలో పురోగతి సాధించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మునుపటి ప్రగతిశీల ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం అమలు చేయడం వల్ల కేరళలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా గణనీయంగా తగ్గిందని ఆయ న అన్నారు. తీవ్ర పేదరిక నిర్మూలన ప్రక్రియ సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను అమలు చేయడానికి, భూమిలేనితనం, నిరాశ్రయులను నిర్మూలించడానికి గతంలో తీసుకున్న చర్యల కొనసాగింపు అని అన్నారు. లక్ష్యాన్ని సాధించడం కష్టమే అయినప్పటికీ, ప్రజల భాగస్వామ్యంతో ఇది సమయానుకూలంగా జరిగిందని చెప్పారు. 2021లో రెండవసారి ఎల్‌డిఎఫ్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ మొదటి మంత్రివర్గంలో రాష్ట్రం నుండి తీవ్ర పేదరికాన్ని నిర్మూలించాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. విస్తృతమైన భాగస్వామ్య ప్రక్రియ ద్వారా లబ్ధిదారులను గుర్తించిన తర్వాత, ఈ ప్రాజెక్టును వడక్కంచెరి మునిసిపాలిటీలో పైలట్ ప్రాతిపదికన అంచుతెంగు, తిరునెల్లి గ్రామ పంచాయతీల్లో అమలు చేశామన్నారు. తరువాత దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా, 64,006 మంది లబ్ధిదారుల కుటుంబాలకు సూక్ష్మ ప్రణాళికలు రూపొందించామని, వాటిని స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక కార్యక్రమాలుగా వర్గీకరించామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం 2023–24, 2024 25 ఆర్థిక సంవత్సరాలకు ఒక్కొక్కరికి రూ. 50 కోట్లు, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు రూ. 60 కోట్లు ప్రత్యేకంగా కేటాయించామని, ఈ మొత్తాలను ఆరోగ్య సంరక్షణ, గృహనిర్మాణంష జీవనోపాధి భద్రత కోసం ఉపయోగించామని ఆయన చెప్పారు. సామాజిక సంక్షేమ పథకాలు, విద్యా సౌకర్యాలు, గ్రామీణ ఉపాధి హామీ, జీవనోపాధి పంపిణీ ద్వారా, ఎక్కడా ఆకలి బాధలు లేకుండా చూసుకున్నామని ఆయన అన్నారు. 'తీవ్ర పేదరిక నిర్మూలన కోసం కేరళ రూ. 1,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది' అని ఆయన నొక్కి చెప్పారు. ఇదిలా ఉండగా, అసెంబ్లీని బహిష్కరించిన తర్వాత ప్రతిపక్షం సభ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ తీవ్ర పేదరిక నిర్మూలన ప్రకటన చేయడానికి మాత్రమే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి లక్షలు ఖర్చు చేశారని చెప్పారన్నారు. ఇప్పటికే వార్తా మాధ్యమాలలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రచారం చేశారని, అందుకే తాము అసెంబ్లీని బహిష్కరించామని సతీశన్ అన్నారు. తిరువనంతపురం జిల్లాలోని ఒక షెడ్‌లో ఒంటరిగా నివసించిన ఒక మహిళ ఆకలితో మరణించినట్లు వార్తలు వచ్చినందున ప్రభుత్వ ప్రకటన మోసం అని కూడా ఆయన అన్నారు. ఆమె అత్యంత పేదల జాబితాలో లేదా?' అని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రకటనను 'ప్రజా సంబంధాల' ప్రక్రియగా ఆయన అభివర్ణించారు. శబరిమల బంగారం మిస్సింగ్ అంశంపై రాష్ట్ర దేవస్థానం మంత్రి విఎన్ వాసవన్ రాజీనామా చేయాలని, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు నిరసన తెలుపుతుండటం సభను బహిష్కరించడానికి మరో కారణమని ఆయన అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన పి.సుదర్శన్ రెడ్డి శనివారం ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కు మద్దతు

సిపిఐ కరపత్రం విడుదల

దోపిడీదారు బిఆర్ఎస్, మతోన్మాద బిజెపిలను ఓడించండి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నికలో మతోన్మాద బిజెపి, దోపిడీదారు బిఆర్ఎస్ పార్టీలను ఓడించి సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నర్సింహా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దుతుగా ఆదివారం నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారంతో పాటు పాదయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా సిపిఐ హైదరాబాద్ సమితి రూపొందించిన కరపత్రాన్ని బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో శనివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్, కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయా దేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, మొహమ్మద్ సలీం, కంపల్లి శ్రీనివాస్ సయ్యిద్ ఒమర్ ఖాన్ తదితరులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ.టి.నర్సింహా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని నీరుగార్చే పార్టీలకు వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని రక్షించేందుకు పాటుపడుతున్న కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. బిఆర్ఎస్ గెలుపుకోసం బిజెపి పరోక్షంగా పనిచేస్తుందని ఆయన విమర్శించారు. నియోజకవర్గం, ప్రజల అభివృద్ధి గురించి పట్టించుకోని బిజెపి మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోనేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో బిఆర్ఎస్, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. నవీన్ యాదవ్ రౌడీషీటర్ బిఆర్ఎస్ బిజెపి నేతలు అభివర్ణించడం గర్హనీయమన్నారు. హైదరాబాద్ సంస్కృతిలో కుస్తీ పోటీలు, రెజ్లింగ్ పోటీలు పోటాపోటీగా జరుగుతుండేవని, అలా గెలుపొందిన వారికి పహిల్వాన్ బిరుదు ఇచ్చేవారన్నారు. అలాంటి బిరుదు కలిగిన నవీన్ యాదవ్‌ను రౌడీషీటర్ అనడం దారుణమన్నారు. బయటి నుంచి హైదరాబాద్‌కు వచ్చిన నేతలు ఇక్కడి సంస్కృతి గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. వివిఎస్. బోస్ మాట్లాడుతూ కాళేశ్వరం అవినీతిలో కూరుకుపోయిన మాజీ మంత్రులు ఇప్పుడు జూబ్లీ హిల్స్‌లో నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. 2014లో తెలంగాణ వచ్చిన తరువాత బిఆర్ఎస్ నేతలు, బిఆర్ఎస్ మాజీ మంత్రుల ఆస్తులు ఎంత, ప్రస్తుతం వారి ఆస్తులు ఎంత పెరిగాయనేది వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

## జూబ్లీహిల్స్‌లో జోరుగా ఎన్నికల ప్రచారం

వాకర్స్ మీట్‌లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎర్రగడ్డ డివిజన్‌లోని బ్రిగేడ్ సిటాడెల్ అపార్ట్‌మెంట్‌లో శనివారం వాకర్స్ మీట్ నిర్వహించారు. స్పోర్ట్స్ లాంజ్‌లో అపార్ట్‌మెంట్ వాసులతో కలిసి షటిల్, టెన్నిస్ ఆడారు. జిమ్‌లో కాసేపు ఉత్సాహంగా గడిపారు. అనంతరం వారితో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తదితర పథకాల్ని లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ విస్తరణ, అభివృద్ధి పనుల గురించి వివరించారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అందరి సహకారంతో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలిచి, ఈ ప్రాంతాన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు మంత్రిని సత్కరించారు. కొందరు నివాసులు తమ సమస్యలను నేరుగా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి విశ్వాసం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌వి జి.మధుసూదన్ రెడ్డి, కూడా చైర్మన్ వెంకట్‌రామ్ రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్‌లది లోపాయికారీ ఒప్పందం

టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి బిఆర్ఎస్‌లు లోపాయికారి ఒప్పందంతో నడుస్తున్నాయని, అందుకే జూబ్లీహిల్స్‌లో బిజెపి బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టిందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఎనిమిది సీట్లు గెలవడానికి కూడా బిఆర్ఎస్ సహకరించిందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం యూసుఫ్‌గూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. అహ నా పెళ్ళంట మాట బిఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుందని ఎద్దేవా చేశారు. సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి, కేబినెట్‌లో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపిన నీచ చరిత్ర బిఆర్ఎస్ పార్టీది అని దుయ్యబట్టారు. జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే బిజెపికి వేసినట్లేనని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రుణం తీర్చుకోవడానికి బిజెపి ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని దుయ్యబట్టారు. ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో గులాబీ బాస్, మాజీ సిఎం కెసిఆర్ పాత్ర ఉందని విమర్శించారు. రాష్ట్రపతి అధ్యక్ష పదవిని నుంచి మొదలు కొని ట్రిపుల్ తలాక్ వరకు బిజెపికి కెసిఆర్ మద్దతు ఇచ్చారన్నారు. డబ్బుతో ఓట్లను కొలవడమనేది అనైతిక చర్య అన్నారు. కాంగ్రెస్ వాళ్ళు ఇచ్చే రూ.5 వేలు తీసుకోండి, బిఆర్ఎస్ పార్టీకి ఓటేయండి? అంటూ కెటిఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. ఎలక్షన్ కమిషన్ తక్షణమే కెటిఆర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సంపత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌ల అప్పులు, ఆస్తులపై నివేదిక ఇవ్వాలి

వ్యవసాయశాఖ పరిధిలోని కార్పొరేషన్స్‌పై తుమ్మల సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ శాఖ పరిధిలోని అనుబంధ కార్పొరేషన్స్ స్థితిగతులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష చేశారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ పరిధిలోని అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో శనివారం జరిగిన సమావేశంలో కార్పొరేషన్‌ల పనితీరుపై చర్చించారు. వ్యవసాయశాఖకు అనుబంధముగా ఉన్న చాలా కార్పొరేషన్లు, అవి ఏర్పడినప్పుడు ఉన్న పరిస్థితులు, వాటి ఉద్దేశ్యాలు, వాటికి గల ఆర్థిక మానవ వనరులు, రైతులకు కార్పొరేషన్ల ద్వారా ఒన గురే ప్రయోజనాలతో పోల్చుకుంటే, కాలక్రమేణా జరిగిన మార్పులతోనో లేక పరిపాలన సౌలభ్యమైన కారణాలతో, కొన్ని కార్పొరేషన్ల పై పని ఒత్తిడి భారం పెరగగా, మరి కొన్ని కార్పొరేషన్‌లు పూర్తిగా నిర్ధకం కావడం గమనించవచ్చు. చివరికి అందులో పని చేస్తున్న ఉద్యోగస్థుల జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితులలో కార్పొరేషన్‌లు చేరుకున్నాయి. అంతేగాక ఒక్కటే పనిని, 3,4 కార్పొరేషన్‌ల నిర్వహించడం, (ఉదాహరణకు ఎరువుల, విత్తనాల సరఫరా) కార్పొరేషన్ లకు సంబంధము లేని కొన్ని కార్యకలాపాలలో అవి పాలు పంచుకోవడం వంటి వాటితో కొత్త సమస్యలు రావడం జరిగింది. ఇవి అన్నీ గమనించిన మంత్రి మొదటి సంవత్సరం నుండే వాటిని గాడిలో పెట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ రోజు జరిగిన సమీక్షలో వాటి పని విధానం ఎలా సాగుతుంది వారి పరిధి దాటి ఇతర పనులు చూస్తున్నారా, పనిభారం విధి విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేషన్‌ల ఆర్థిక పరిస్థితులు రుణాలు – ఆస్తులపై పూర్తి స్థాయిలో వివరాలు ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లు రైతాంగానికి సేవలు అందించేలా సమర్థవంతంగా పని చేయాలని మంత్రి తుమ్మల అధికారులకు దిశా నిర్దేశం చేశారు.గత కొంత కాలంగా నిర్ధకంగా మారిన అగ్రోస్ ను మళ్లీ పునరుద్ధరణ చేయాలని అందుకు తగ్గ కార్యాచరణ సిద్ధం చేయాలనీ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ పరిధిలోని కార్పొరేషన్స్ అన్ని సమర్థవంతంగా పని చేసేలా పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఆయిల్ ఫెడ్ ఎం.డి యాస్మిన్ బాషా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ భాయి, ఆగ్రోస్ ఎండి శ్రీ రాములు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**నిర్ధకంగా మారిన ఆగ్రోస్‌ను పునరుద్ధరణ చేస్తాం**

వ్యవసాయ శాఖ పరిధిలోని అన్ని కార్పొరేషన్‌లు సమర్థవంతంగా పనివేసే విధంగా ప్రభుత్వం కార్యాచరణను రూపొందించనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులకు సేవలు అందించిన ఆగ్రోస్ నిర్ధకంగా మారిందని దాన్ని పునరుద్ధరణ చేసి మళ్ళీ రైతులకు సేవలు అందించే విధంగా తగిన కార్యాచరణ కోసం క్షేత్ర స్థాయిలో పర్యటన చేసినట్లు చెప్పారు. మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి రైతుల కష్టాలు చూసారన్నారు. ప్రతి ఎకరాకు రూ.10 వేల పంట నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పత్తి రైతులు తేమ శాతం విషయంలో అప్రమత్తంగా ఉండాలని మద్దతు ధర దక్కాలంటే జాగ్రత్తగా పత్తి ఆరబెట్టుకోవాలని మంత్రి తుమ్మల రైతులకు సూచించారు.

## రిజర్వేషన్లు అమలు కావాలని ప్రార్థనలు



**ప్రజాపక్ష/హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలని కోరుతూ తెలంగాణ బిసి కమిషన్ ఆధ్వర్యంలో శనివారం బాపుఘాట్ లోని గాంధీజీ సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా బాపు ఘాట్ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి, సమాధికి నేతలు పుష్పాంజలి ఘటించి రాష్ట్ర శాసన సభ ఆమోదించిన 4 బిల్లులను గాంధీజీ సమాధి వద్ద ఉంచి, వందేమాతర గీతాలాపనతో ప్రార్థనా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్, మాజి ఎంపి వి.హనుమంతరావు, బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్ , తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి రంగు, బిసి ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, బిసి నేతలు జాజుల శ్రీనివాస్, పలువురు కుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్వేత, చింతామణి, రాజ్‌గోపాల చారి, రవికాంత్‌లు పలు గాంధీజీ స్మృతి భజనలను ఆలపించారు.

## పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

తేమ ఆంక్షలు పెట్టకుండా వరి, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి: సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/వేములపల్లి:** ఇటీవల కురిసిన మొంథా తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతన్నలకు నష్టపరిహారం వెంటనే అందించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో తుఫాన్ వలన దెబ్బతిన్న శంకరయ్య అనే రైతు పంట పొలాలను సిపిఐ, తెలంగాణ రైతు సంఘం నాయకులతో కలసి పరిశీలించి, రైతును పరామర్శించారు. ఈసందర్భంగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జిల్లా తెలుగు రాష్ట్రాలలో మొంథా తుఫాన్ వల్లన వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతినిపోయా అని పేర్కొన్నారు. రైతన్నలు లక్షలాది రూపాయలను అప్పులుగా తీసుకొచ్చి వ్యవసాయం సాగు చేసి పంటలు చేతికి అందే సమయంలో తుపాన్ రూపంలో పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటలను పరిశీలించి అంచనా వేసి నష్టపరిహారం అందించాలని కోరారు. పంట నష్టపోయిన రైతా గానికి ప్రభుత్వం ఇస్తున్న కేవలం రూ.పది వేలు ఏమేరకు సరిపోవని కనీసం వరికి రూ.40వేలు, పత్తి కి 60వేలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వరి, పత్తిని కొనుగోలు చేయడానికి అధికారులు కొనుగోలు కేంద్రాలు అక్కడక్కడ ప్రారంభించినప్పటికి తేమ శాతం ఆంక్షలు పెట్టడం వల్ల రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన పంటను అమ్ముకోలేకపోయారని దీనివల్ల తుపాన్ వలన పూర్తిగా తడిసిపోయింది అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ చూసినా మొలకలు వచ్చిన వరి ధాన్యం, తడిసిన పత్తి కనబడుతుంది, ఇంకా వరి,పత్తి వర్షం నీటిలో మునిగి చేతికొచ్చే పరిస్థితి లేకపోయిందని పేర్కొన్నారు పత్తి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని నిబంధనలు అన్ని పక్కన పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజాల రామచంద్రం, సహాయ కార్యదర్శి జిల్లా కనకయ్య, సిపిఐ మండల కార్యదర్శులు జిల్లా యాదగిరి, రామలింగం, ఉదయ్, ఏఐటీయూసీ. జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయ్యద్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి దీరావతలింగ నాయక్, డిహెచ్‌పిఎస్ నాయకులు వల్లంపట్ల వెంకన్న, జగన్, గువ్వల మటయ్యలు ఉన్నారు.

## రిజర్వేషన్లతోనే సమానత్వం



బిసిల 42శాతం రిజర్వేషన్లకు ఐక్య పోరాటాలు

టిజెఎస్ సదస్సులో పలువురు వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో రిజర్వేషన్ల ద్వారానే సమానత్వం వస్తుందని, ఈ క్రమంలో బిసి వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఐక్యంగా పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సామాజిక తెలంగాణ నిర్మాణానికి బిసి రిజర్వేషన్లు ఒక కీలక అడుగు అని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ లోని దేశోద్ధారకభవన్‌లో శనివారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జన సమితి (టిజెఎస్) ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ మురళీ మనోహర్ హాజరయ్యారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దనేది సుప్రీంకోర్టు తీర్పు కాదని, 1931 బిసి గణన, 1961 గణన, 1979 మండల్ కమిషన్ రిపోర్టులను పరిగణనలోకి తీసుకుని అప్పటి పరిస్థితులలో కోర్టు ఆ అభిప్రాయం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. రిజర్వేషన్లు సవరించుకోవచ్చని మండల్ కమిషన్ రిపోర్టులోనే ఉన్నదన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్లకు బిజెపి మొదటి నుండి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, మనుస్మృతి పేరుతో అణగారిన వర్గాలను విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలకు దూరం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ మురళీ మనోహర్ మాట్లాడుతూ బిసిలు ఐక్యంగా పోరాడి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించాలన్నారు. ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అమలుకు టిజెఎస్ అధ్వర్యంలో జిల్లా కేంద్రాలలో సదస్సులు, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. జనవరిలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని వివరించారు. సదస్సులో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సయ్య, టిజెఎసి రాష్ట్ర నేతలు అంబటి శ్రీనివాస్, గోపగాని శంకర్‌రావు, పల్లె వినయ్ కుమార్, నిజ్జన రమేష్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ కళాశాలల బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3వ తేదీ నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలు చేస్తున్న నిరవధిక బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతును ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదలపై నిర్లక్ష్యం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని ఎఐఎస్‌ఎఫ్ విమర్శించింది. సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చాక వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 23 నెలలు గడుస్తున్నా ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో కళాశాలల వారు బంద్ చేస్తే దసరా, దీపావళి లోపు రూ.1200 కోట్లు విడుదల చేస్తామని చెప్పి మాట తప్పి కేవలం రూ.300 కోట్లు విడుదల చేశారని తెలిపారు. నవంబర్ 3వ తేదీ నుండి కళాశాలలు బంద్ చేస్తామని యాజమాన్యాలు ప్రకటించి పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం వారితో చర్చించకుండా వారికి బకాయిలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసి విద్యార్థుల చదువులతో చెలగాటమాడుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ యాజమాన్యాలకు ఇవ్వాల్సిన బాకాయిలు ఇవ్వకుండా పెండింగ్ బకాయిలు అడిగినందుకు విజిలెన్స్ తనిఖీల పేరిట ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8000 వేల కోట్ల ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నించారు. ఫీజు బకాయిల విడుదల లేక విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు అప్పులు చేసి మరి ఫీజులు కట్టే పరిస్థితి వచ్చిందన్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకాలు లేకుండా ప్రభుత్వం వెంటనే కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి బంద్ విరమింపజేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని వారు కోరారు. లునట్లయితే కళాశాలల బంద్ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.

## కెటిఆర్‌పై ఎన్నికల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పది సంవత్సరాల పాలనలో అక్రమంగా సంపాదించిన అహంతో జూబ్లీహిల్స్ ఓటర్లను కొనుగోలు చేసే పద్ధతిలో ఓటుకి 5 వేలు అడుక్కోండి అని కెటిఆర్ చెప్తున్న మాట అక్షేపణీయం.. ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ పక్షాన పిర్యాదు చేసామని హైదరాబాద్ ఇన్‌ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్‌రావు తెలిపారు. ఓటుకు 5 వేల చొప్పున ప్రస్తావన తెచ్చిన అంశాన్ని ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకొని కెటిఆర్‌పై కేసు పెట్టాలని పేర్కొన్నారు. చరిత్రలో అందరికీ తెలుసు హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఓటుకు ఆరు వేలు ఇచ్చిన సంస్కృతి కెటిఆర్‌దే అని అన్నారు. ప్రజల అభిమానంతో అభివృద్ధి చేస్తూ.. మరింత అభివృద్ధి చేస్తామని విశ్వాసం కలిగిస్తూ ఓట్లు అడుగుతున్నాం అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాదిరి కాంగ్రెస్‌కి ఓటు వేసి గెలిపిస్తారని అన్నారు. తాము 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కి గ్యాస్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,వడ్డీలేని రుణాలు, నూతనంగా ఉద్యోగాలు ఇచ్చాం, హైదరాబాద్ అభివృద్ధి చేస్తూ డ్రింకింగ్ వాటర్ ,డ్రైనేజీ, రోడ్లు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం అందుకే తమ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను ప్రజలు ఆశీర్వదిస్తున్నారని తెలిపారు.

## కొన్నిరోజుల్లో.. అధికారంలోకి బిఆర్ఎస్

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేవలం ఐదేళ్ల కోసమే రేవంత్ రెడ్డిని గెలిపించారని, సరిగ్గా పాలించకపోతే బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా శనివారం రాత్రి రహమత్‌నగర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా కెటిఆర్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కేవలం 500 రోజుల సమయమే ఉందన్నారు. 500 రోజుల తర్వాత బిఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని, కెసిఆర్ తిరిగి సిఎం కాబోతున్నారని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఓటు వేయకపోతే పథకాలను రద్దు చేస్తానని సిఎం రేవంత్ రెడ్డి ధమ్కీలు ఇస్తున్నాడని ఆరోపించారు. ఎగిరెగిరి పడితే ప్రజలు పెట్టే వాతలకు నీ ప్రభుత్వమే ఆగమయ్యే రోజు దగ్గరలోనే ఉందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలంటే మాగంటి గోపీనాథ్‌కు ఎంతో అభిమానం ఉండేదన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు పెట్టే వాతలకు రేవంత్ రెడ్డికి బుద్ధి రావాలన్నారు. ఎన్‌టిఆర్ హిల్స్‌లో బ్రహ్మాండమైన స్టేడియం కట్టి మాగంటి గోపీనాథ్ పేరు పెడతామని తెలిపారు.




**మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం**
రంగారెడ్డి జిల్లా

క్రింది అంశాల కోసం కొటేషన్లు కోరబడుచున్నవి:
1. మున్సిపల్ కార్యాలయం మరియు వార్డు కార్యాలయాల్లో సిసిటివి నెట్‌వర్క్, టివి మరియు ఇతర సంబంధిత ఉపకరణాలు ఏర్పాటు.
2. మొయినాబాద్ మున్సిపాలిటీలోని అన్ని విభాగాలకు స్టేషనరీ మరియు కంప్యూటర్ల కొనుగోలు.
3. మొయినాబాద్ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల కోసం డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) తయారీ చేయుటకు ప్రతిపాదన (RFP) కోసం అభ్యర్థన. రూ.10,000/- (పది వేల రూపాయలు) విలువైన DDని కమిషనర్, మొయినాబాద్ మున్సిపాలిటీ పేరుతో జతపరచాలి. టెండర్‌ను 03.11.2025 తేదీ మధ్యాహ్నం 2.00 గంటల లోపు షెడ్యూల్ చేయాలి. టెండర్లను స్వీకరించడానికి చివరి తేదీ 05.11.2025 సాయంత్రం 4.00 గంటల వరకు. (రూ.10,000/- DD తిరిగి ఇవ్వబడదు)
4. మొయినాబాద్ మున్సిపాలిటీలో ఇతర అభివృద్ధి పనులు, K2 టెండర్ పనులు మరియు ఇతర పనులు.

**కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ: 05.11.2025 సాయంత్రం 4.00 గంటల వరకు.**

జతపరిచినది: టెండర్ నోటీసు
సం/- కమిషనర్
DIPR R.O. No. : 10110-PP/CL/ADVT/1/2025-26, Date: 01-11-2025
మొయినాబాద్ మున్సిపాలిటీ



**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com

ప్రతిపాదన కోసం అభ్యర్థన (RFP)

నెం. E1/DB/MCK/8201/RFP-Biogas/MCK/2025-26, తేది: 01.11.2025

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ క్రింద టర్న్ కీ ప్రాతిపదికన & రెండు (2) సంవత్సరాల పాటు ప్లాంట్ ఆపరేటింగ్ & నిర్వహించడం మరియు 3 TDP వేరు చేయబడిన మున్సిపల్ వ్యర్థాల సేంద్రీయ భిన్నాన్ని ఉపయోగించి వంట ఇంధనం మరియు విద్యుత్ ఉత్పత్తి కోసం బయోగ్యాస్ ఉత్పత్తి కోసం (గ్రిడ్/ఆఫ్ గ్రిడ్‌కు, ఆచరణాత్మక అమలు కోసం తక్కువ ఖర్చుతో సాధ్యమయ్యేది) CSIR- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (CSIT-IICT), అనారోబిక్ గ్యాస్ లిఫ్ట్ రియాక్టర్ (AGR) టెక్నాలజీ ఆధారంగా బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదన కోసం అభ్యర్థన (RFP).

ఆర్‌ఎఫ్‌పి సమర్పణకు ప్రారంభ తేదీ & సమయం : 03.11.2025న సా.04.00గం.లకు.
ఆర్‌ఎఫ్‌పి సమర్పణకు ఆఖరి తేదీ & సమయం : 11.11.2025న సా.04.00గం.ల వరకు.

మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- కమిషనర్,
DIPR R.O. No. : 10054-PP/CL/ADVT/1/2025-26, Date: 01-11-2025
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.



# జనరల్

STATE & REGIONAL NEWS

## మెట్రో రైల్ ప్రయాణ వేళల్లో మార్పులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణికులకు ఎల్ అండ్ టి హెచ్ఎంఆర్ఎల్ ముఖ్యమైన ప్రకటన వెలువడింది. ఈ నెల 3వ తేదీ నుంచి మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్ని టెర్మినళ్లలో, అన్ని రోజుల్లో ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ అధికంగా ఉండటంతో ఉద్యోగులు, విద్యార్థులు, నగరవాసులు మెట్రో రైలు ప్రయాణానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రయాణికులందరికీ అనుకూలంగా ఉండేలా ఎల్ అండ్ టి హెచ్ఎంఆర్ఎల్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసింది.



## బిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

### బిసి జెఎసి చైర్మన్ ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దేశవ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్. కృష్ణయ్య అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను శాసించే స్థాయికి బిసి ఉద్యమాన్ని తీసుకెళ్తామని పేర్కొన్నారు. బిసిల రిజర్వేషన్లకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో బిసి జెఎసి కో–ఆర్డినేటర్ గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై, మాట్లాడారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు , చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లను సాధించడమే బీసీల అంతిమ లక్ష్యమన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్స్ బిల్లును 9వ షెడ్యూల్ లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. బిసి జెఎసి బలోపేతం చేస్తూనే ఉద్యమాన్ని తీవ్రతరంచేస్తామన్నారు. జెఎసిలో అన్ని కుల సంఘాలను భాగస్వామ్యం చేస్తూ , గ్రామ స్థాయి నుండి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇటీవల చేపట్టిన బంద్ నేపథ్యంలో బిసి నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, లేనిపక్షంలో 'చలో జైల్ భరో' చేపడతామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బిసిల 42శాతం రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 4 నుంచి 8 వరకు ఓయూలో జరిగే బిసి విద్యార్థి దీక్షకు మద్దతు తెలిపారు. సమావేశంలో బిసి కుల సంఘాల నేతలు విజయ్ కుమార్, శంకర్ ముదిరాజ్, కొండా దేవయ్య, బిసి సంఘం నేతలు రాజేందర్, రాజ్ కుమార్, నిఖిల్ పటేల్, విద్యార్థి నేత సైదులు పాల్గొన్నారు.

## 3, 4 తేదీల్లో యువ ఉత్సవ్

### ఇస్కీ డైరక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ ) – స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీలలో యువ ఉత్సవ్–2025 మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించనున్నామని కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు. నగరంలోని వివిధ కాలేజీల విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొనవచ్చని, ఆసక్తి గల వారు 88861 19192 లేదా 88867 37375 నెంబర్‌లలో సంప్రదించి ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. అశోక్ మాట్లాడుతూ యువ ఉత్సవ్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే అద్భుత వేదిక అన్నారు. యువతలోని ప్రతిభను, సాంస్కృతిక, నిర్వహణ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ప్రోత్సహించడమే ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈనెల 3న మేనేజ్‌మెంట్ ఈవెంట్స్‌లో భాగంగా సాంప్రదాయ నృత్యాలు, బిజినెస్ క్విజ్, బెస్ట్ మేనేజర్ వంటి పోటీలు జరుగుతాయన్నారు. 4న రెండవ రోజు ర్యాంప్ వాక్, నృత్య గానాలు, ట్రెజర్ హంట్, స్పాట్ చిత్రాంకన్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రెండు రోజుల ఈవెంట్‌లో ఏర్పాటు చేయబోయే ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ఆసక్తి గల వారు స్పాన్సర్‌షిప్ చెల్లించి తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు. యువ ఉత్సవ్–2025 విద్యార్థులకు మేనేజ్‌మెంట్, సాంస్కృతిక రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఒక ప్రత్యేక వేదికగా నిలవనుందన్నారు.



## పోలీసుల సేవలు నిరుపమానం

### ఎంఇఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసుల సేవలు నిరుపమానమని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) డైరెక్టర్ పి.సుధారెడ్డి అన్నారు. రేయనకా పగలనకా ప్రజల భద్రతకు పోలీసులు చేస్తున్న కృషి వేళ కట్టలేనిదని అన్నారు. హైదరాబాద్ లోని నానక్ రామ్ గూడ లో ఉన్న అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం వద్ద భద్రతా విధులు నిర్వర్తించే తెలంగాణ స్పెషల్ పోలీసులు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన భవన నిర్మాణాన్ని ఎంఇ ఐఎల్ సొంత ఖర్చులతో చేపట్టింది. అమెరికన్ కాన్సులేట్ ఎదురుగా కేటాయించిన స్థలంలో ఈ భవన నిర్మాణానికి శనివారం ఎంఇఐఎల్ డైరెక్టర్ పి. సుధారెడ్డి శంఖుస్థాపన చేశారు. 50 మంది భద్రతా సిబ్బంది వినియోగించుకునేలా ఈ భవనాన్ని డిజైన్ చేశారు. ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పద్ధతిలో త్వరగా ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి పోలీస్ సిబ్బందికి ఎంఇ ఐఎల్ అందించనుంది. ఈ శంఖుస్థాపన కార్యక్రమంలో బెటాలియన్స్ అదనపు డిడిజి సంజయ్ కుమార్ జైన్ , మాదాపూర్ డిసిపి రితిరాజ్ , కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ ఎం రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్‌లు ఎం.పార్ధసారథి రెడ్డి, ఎస్.రాంబాబు, అమెరికన్ కాన్సులేట్ భద్రతా అధికారులు వెంకట్, సతీష్, రవిచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ లోని అమెరికన్ కాన్సులేట్ దక్షిణ ఆసియాలోనే పెద్దది. ప్రతి రోజు 3500 వీసా దరఖాస్తులను స్వీకరించే సామర్థ్యంతో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ప్రజలకు సేవలు అందించే ఈ కార్యాలయాన్ని పోలీసులు నిరంతరం కాపలా కాస్తుంటారు. వీరి సౌకర్యార్థం ఎం ఈ ఐ ఎల్ ఈ నిర్మాణాన్ని చేపట్టింది.

## వ్యర్థాల నిర్వహణలో రైల్వే హైదరాబాద్ డివిజన్ టాప్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను అమలు చేయడంలో హైదరాబాద్ రైల్వే డివిజన్ టాప్‌గా నిలిచింది.ఈ సందర్భంగా హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ డాక్టర్ అనిరుత్ పామర్ మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వహణ చొరవలో భాగంగా హైదరాబాద్ డివిజన్ కాచిగూడ, నిజామాబాద్, కర్నూలు సిటీ రైల్వే స్టేషన్లలో శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాల కోసం అధీకృత్త రీసైక్లింగ్‌తో స్క్రాప్క్యూ హబ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్థిరమైన వ్యర్థాల నిర్వహణ వైపు ఈ హరిత చొరవను చేపట్టినందుకు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ వారి బృందాన్ని అభినందించారు. రైల్వే ప్రాంగణాలను పరిశుభ్రమైన, స్వచ్ఛమైన పచ్చని, పర్యావరణ హితమైన మండలాలుగా మార్చే దిశగా ఈ చొరవ ఒక ముఖ్యమైన మైలు రాయిని సూచిస్తుందని సునీల్‌కుమార్ శ్రీవాస్తవ అన్నారు.

# మన సీట్లు మనకే

### మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తెలంగాణ విద్యార్థులకు 85 శాతం రిజర్వేషన్లకు ఓకే

### ఇప్పటివరకూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లన్నీ ఆల్ ఇండియా కేటగిరీలో భర్తీ

### ఇకపై 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకే ఇవ్వనున్న సర్కార్

### హెల్త్ మినిస్టర్ విజ్ఞప్తికి స్పందించిన సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) వైద్య విద్య విద్యార్థులకు గత పదేళ్లుగా జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం స్పందించింది. మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తెలంగాణ విద్యార్థులకు 85 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. ఇప్పటివరకూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లన్నీ ఆల్ ఇండియా కేటగిరీలో భర్తీ అవుతూ వస్తుండగా, ఇకపై 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకే దక్కనున్నాయి. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి మేరకు సిఎం రేవంత్ రెడ్డి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు లోకల్ విద్యార్థులకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో పీజీ కోసం ఎంబిబిఎస్ విద్యార్థులు పడుతున్న కష్టాలపై ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకున్నందుకు సిఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. వైద్య విద్యపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని టిపిసిసి డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ పేర్కొన్నారు. ఇకపై మేనేజ్ మెంట్ కోటా సీట్లలో సింహభాగం మనకే దక్కుతాయని... ఇదెంతో శుభపరిణామమని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య మరింతగా పెరగనున్నది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో తోడ్పడుతుంది.

**పదేళ్లుగా అన్యాయం**

మెడికల్ పీజీ స్టేట్ కోటా మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీలో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతూ వచ్చింది. 25 శాతంగా ఉన్న మేనేజ్ మెంట్ కోటా1 సీట్లలో తెలంగాణలో మాత్రం 100 శాతం ఆల్ ఇండియా కోటాగా చూపిస్తూ వస్తే ఎపిలో మాత్రం ఇదే కోటాను 85 శాతం స్థానికులకే రిజర్వ్ చేశారు. తెలంగాణలోనూ 25 శాతంగా ఉన్న మేనేజ్ మెంట్ కోటా1 సీట్లలో తెలంగాణలోనూ 85 శాతం లోకల్ క్యాండిడేట్స్‌కే కేటాయించాలని రాష్ట్రానికి చెందిన వైద్య విద్యార్థులు, వారి తల్లితండ్రులు, వైద్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. గత ఏడాది వరకు కూడా ప్రభుత్వం పాత విధానంలోనే సీట్లను కేటాయించింది. స్థానిక కోటా లేకపోవడంపై తెలంగాణ వైద్య విద్యార్థులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎపిలో ఇస్తున్నప్పుడు తెలంగాణాలో అన్యాయం చేయడమెందుకని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకున్న వైద్య మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకుపోయారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన సిఎం వెంటనే ఉత్తర్వులు వచ్చేలా చేశారు. దీంతో ఇన్నాళ్లపాటు తెలంగాణ విద్యార్థులకు జరుగుతూ వచ్చిన అన్యాయానికి ఫుల్ స్టాప్ పడింది.

**తెలంగాణ విద్యార్థులకు దక్కనున్న 388 పీజీ సీట్లు**

202526 విద్యా సంవత్సరానికిగాను తెలంగాణలో 31 పీజీ మెడికల్ కాలేజీలలో 2983 సీట్లు ఉన్నాయి. వీటిలో 12 ప్రభుత్వ (1472 సీట్లు), 19 ప్రైవేట్ కాలేజీలు (1511 సీట్లు) ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీలలో 50 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద, 50 శాతం సీట్లు స్టేట్ కోటా పరిధిలోకి వస్తాయి. ప్రైవేట్ కాలేజీలలో 50శాతం స్టేట్ కోటా పరిధిలోకి, మిగిలిన 50శాతం మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయి. 741 పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 374 సీట్లు మేనేజ్ మెంట్ కోటా1 (ఎంక్యూ1) కు చెందినవి. ప్రభుత్వం సవరించిన కొత్త విధానం ప్రకారం 318 సీట్లు (85 శాతం) ఇప్పుడు తెలంగాణ స్థానికత ఉన్న అభ్యర్థులకు రిజర్వ్ చేయబడతాయి. 56 సీట్లు (15శాతం) ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు. అలాగే 70 డెంటల్ పీజీ సీట్లు కూడా తెలంగాణ విద్యార్థులకే దక్కుతాయి. మొత్తంగా పీజీ మెడికల్, పీజీ డెంటల్ కలిపి తెలంగాణ స్థానికత ఉన్న విద్యార్థులకు 388 సీట్లు అదనంగా లభించనున్నాయి.

**వైద్యరంగంలో కీలకమైన నిర్ణయమిది : వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

రాష్ట్ర వైద్యవిద్య చరిత్రలో ఇది మర్చిపోలేని రోజుగా మిగిలిపోతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనరసింహ తెలిపారు. వైద్య విద్యార్థులు ఈ నిర్ణయం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, ఎట్టకేలకు ఇది సాకారమైందన్నారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభావంతులైన యువ వైద్యులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ఆరోగ్య రంగం మరింత బలపడుతుందన్నారు. విద్యార్థుల పక్షాన, తెలంగాణ పక్షాన ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి రాజనరసింహ కృతజ్ఞతలు తెలిపారు.

### కులవివక్షతను ఎదుర్కోవడానికే

## దళిత ఆత్మగౌరవ పోరాటం

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్ మీద దాడి జరిగితే ఈ దేశ వ్యవస్థలన్ని ఎలాంటి చర్యలకు ఉపక్రమించకుండా మౌనం వహించి, అంటరానితనాన్ని ప్రదర్శించాయని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. జస్టిస్ బి.ఆర్. గవాయ్ మీద జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నుండి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో వేలాది మందితో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ బి.ఆర్. గవాయ్ దళితుడు కావడం వల్లనే ఈ దాడి జరిగిందన్నారు. గవాయ్ స్థానంలో ఉన్నత వర్గాలకు చెందిన న్యాయమూర్తులు ఉంటే ఈ దాడి జరిగి ఉండేదా అని ప్రశ్నించారు. అందువల్లనే ఈ దాడిని దళితుల మీద జరిగిన దాడిగా చూస్తున్నామన్నారు. గవాయ్ దళితుడు కావడం వల్లనే వ్యవస్థలన్ని మౌనం వహించాయని, కానీ అదే స్థానంలో ఉన్నత వర్గాలకు చెందిన న్యాయమూర్తి ఉంటే ఇప్పటికే స్పందించి శిక్షలు వేసే వారన్నారు. ఇంత కులవివక్షత పాటించడం అత్యంత అమానుషమన్నారు. డిల్లీ పోలీసులు ఎందుకు ఇప్పటికీ కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు సుమోటోగా కేసు ఎందుకు స్వీకరించలేదన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ మౌనంగా ఉండిపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దళితులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే దళితుల ఆత్మగౌరవ ఉద్యమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. జస్టిస్ బి.ఆర్. గవాయ్‌కి న్యాయం జరగాలని జాతీయ స్థాయిలో పోరాటం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ లో జరుగుతున్న దళితుల ఆత్మగౌరవ పోరాటం కేవలం అరంభం మాత్రమే ఇక జాతీయ స్థాయిలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 17న ఛలో డిల్లీకి పిలుపునిస్తున్నామని, దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున దళితులను సమీకరించి, దళిత ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు నరసప్ప మాదిగ, తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు లోకేష్ మాదిగ, మహారాష్ట్ర అధ్యక్షులు అజిత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర నేత జాన్సన్ మాదిగ, ఉత్తరాఖాండ్ రాష్ట్ర అధ్యక్షులు ఆశిష్ కుమార్ పాల్గొన్నారు.



## కళలే సమాజాన్ని తీవ్ర ప్రభావితం చేస్తాయ్

### తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

**హైదరాబాద్ :** కళలు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయయని, కళాకారులు తమ కళారూపాల ద్వారా చైతన్యవంతంగా ప్రజల హృదయాలను తట్టి లేపుతారని తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. శనివారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మ ణ చక్రవర్తి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు పల్లె నర్సింహ ఆధ్వర్యంలో బస్సు యాత్రలో భాగంగా కళాకారులు 'ఎంజాయ్ పేరుతో గంజాయి' వద్దపై కళాజాతతో విద్యార్థులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యాదగిరి మాట్లాడుతూ సోషల్ మిడియా ప్రభావం వలన సమాజం తిరోగమనానికి దారి తీస్తుందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో సమాజంలో నిర్మాణాత్మక మార్పుకు కృషి చేయాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వినోద్ మాట్లాడుతూ యువత సులభంగా డబ్బు సంపాదించే మార్గంలో సైబర్ నేరాలు పెరిగాయి అన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం ఒకసారి ప్రారంభమైతే తనని బానిసగా మార్చుకుంటుందన్నారు. యువత ఈ మధ్యకాలంలో ఎంజాయ్ పేరుతో గంజాయిని సేవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కళాకారుల బృందం ఆట పాటలు, ప్రదర్శనలు, నాటికల ద్వారా గంజాయి వలన నష్టాలను సజీవంగా కళ్ళకు కట్టినట్లు అవగాహన పరిచి విద్యార్థులను చైతన్యపరిచినారు. కార్యక్రమంలో పల్లె నరసింహ గంజాయి పేరుతో ఎంజాయ్ అనే పాట ప్రేక్షకుల హృదయాలను కలిచివేసింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొ. కె. అపర్ణ, తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షులు శ్రీనివాస్, విశ్వవిద్యాలయ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించండి

### రుణ మోసపూరిత పథకాల బారిన పడకండి: విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న మోసపూరిత రుణ నేరాల దృష్ట్యా యువత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి.సజ్జనార్ చెప్పారు. రుణాలు, ఆర్థిక పురోగతికి సంబంధించిన ఏదైనా సైబర్ నేరగాళ్ల పరస్పర చర్యలలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్)లో 2023–2025 సంవత్సరాలలో మొత్తం 25 కేసులు నమోదయ్యాయని, 2023లో 5 కేసులు, 2024లో 8 కేసులు, 2025లో 12 రుణ మోసాల కేసులు నమోదయ్యాయన్నారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ద్వారా నమోదు చేయబడి, దర్యాప్తు చేయబడిన మోసపూరిత రుణ పథకాల నేరాలు తరుచుగా పెరుగుతున్నందున, ఏదైనా రుణ సంబంధిత లావాదేవీలోకి ప్రవేశించే ముందు ప్రజలు తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలు రుణం మంజూరు చేసే సంస్థల ఆధారాలను ధ్రువీకరించుకోవాలన్నారు. అన్ని నిబంధనలను జాగ్రత్తగా చదవడంతో పాటు రుణం చట్టబద్ధంగా మంజూరు చేయబడి పంపిణీ చేయబడే వరకు ఎటువంటి చెల్లింపులు చేయకుండా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద కార్యాచరణ లేదా మోసపూరిత ఆఫర్ విషయంలో, వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా సెంట్రల్ క్రైమ్ స్టేషన్, డిటెక్టివ్ విభాగంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్స్ నుండి జాగ్రత్త!

### సైబర్ క్రైమ్ డిసిపి దారా కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిత్యం పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ స్కామ్స్ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి దారా కవిత ప్రజలను హెచ్చరించారు. ఈ స్కామ్‌లలో నకిలీ పోలీస్, ప్రభుత్వ అధికారులు, కోరియర్ కంపెనీల ప్రాతినిధ్యాన్ని చేసుకుని, బాధితుల్ని మనీ లాండరింగ్, ట్రాఫికింగ్, నార్కోటిక్స్, టెర్రరిజం వంటి నేరాల్లో అరెస్ట్ చేయబోతున్నట్లు, ఖాతాలు ఫ్రీజ్ అవుతాయని లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భయపెడతారని కవిత సూచించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత లేదా బ్యాంక్ సమాచారాన్ని పంచుకోకూడదని, అనుమానాస్పద కాల్స్ లేదా మెసేజ్లు వెంటనే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్ అలైవ్'

### డిజిపి బి.శివధర్ రెడ్డి ప్రకటన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్కువగా రోడ్డు ప్రమాదాలలో మరణించే వారి సంఖ్య ప్రతి ఏటా వివిధ సంఘటనలలో హత్యలకు గురయ్యే వారి సంఖ్య కంటే పదిరెట్లు ఉందని తెలంగాణ రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రోడ్డు భద్రతను ప్రజా ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రోడ్డు భద్రత నిపుణులతో శనివారం తన కార్యాలయంలో డిజిపి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు 'అరైవ్ అలైవ్' రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమం డిసెంబర్ నెలలో 15 రోజులపాటు నిర్వహించనున్నామని డిజిపి తెలిపారు. నవంబర్ 16వ తేదీన జరిగే ప్రపంచ రోడ్డు భద్రతా బాధితుల స్మారక దినం సందర్భంగా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేయనున్నామన్నారు. ఈ ప్రచారం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, నియమాలను కచ్చితంగా పాటించే విధంగా చేయటం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను ప్రమాదాలను తగ్గించటం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఒక ఉద్యమం మాదిరిగా చేపట్టాలన్నారు. పోలీసు శాఖ, రవాణా శాఖ, కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలను సమీకరించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి నవంబర్ 9 లేదా 10న జరిగే తదుపరి సమావేశంలో చర్చించాలని డిజిపి సూచించారు. వివిధ ప్రాంతాల్లో అమలులో ఉన్న రోడ్డు భద్రతకు సంబంధించి ఉత్తమ విధానాలను పరిశీలించి, తెలంగాణలో అనుసరించదగిన మార్గాలను రూపొందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం.భగవత్, ఎడిజిపి (మల్టిజోన్II) దేవేంద్ర సింగ్ చౌహాన్, ఐజిపి లు (మల్టిజోన్I) ఎస్.చంద్ర శేఖర్ రెడ్డి, (ప్రోవిజనింగ్, లాజిస్టిక్స్) డాక్టర్ ఎం.రమేశ్, ఐజిపి (రైల్వే, రోడ్డు భద్రత) కె.రమేశ్ నాయుడు, జాయింట్ సిపి (ట్రాఫిక్, హైదరాబాద్ సిటీ) డి.జోయెల్ డేవిస్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## సిఎం భాష మార్చుకోవాలి

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా భాష మార్చుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే ఒపీనియన్ పోల్‌కు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, ఖైరతాబాద్ బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, ప్రసన్నలక్ష్మి , బిఆర్ఎస్ నేత మహేందర్‌లతో కలిసి శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సంచలన సవాల్ విసిరారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా, హైదరాబాద్‌కు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. 'జూబ్లీహిల్స్‌లో ఓటమి భయం పట్టుకోవడం వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే రేషన్ కార్డులు, బియ్యం ఆగిపోతాయంటూ ఆ పార్టీ నేతలు ప్రజలను బెదిరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతలతో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేయించాలో బిఆర్ఎస్‌కు బాగా తెలుసని అన్నారు. ఈ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో గెలిచేది బిఆర్ఎస్ పార్టీయే అని తలసాని ధీమా వ్యక్తం చేశారు. అత్యంత భారీ మెజార్టీతో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అసెంబ్లీలో అడుగుపెడతారని ఆయన జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ తొక్కిసలాటలో చనిపోయిన భక్తులకు మాజీ మంత్రి సంతాపం తెలిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సిఎం లేదా నేను చెబితేనే... నాయకత్వ మార్పుపై డికె

**బెంగళూరు:** కర్నాటకలో కొంతకాలంగా ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల తన తండ్రి రాజకీయ భవిష్యత్తుపై సీఎం సిద్ధరామయ్య కొడుకు చేసిన వ్యాఖ్యలతో ఈ వార్తలు మళ్లీ తెరపైకి వచ్చాయి. నవంబరులో సీఎంమార్పు ఉండొచ్చన్నప్రచారం జోరందుకుంది. కథనాలను ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి కొట్టిపడేశారు. రాష్ట్ర ప్రభుత్వంలోని నేతలందరూ ఐక్యతతో ఉన్నారని, ప్రస్తుతానికి తమకు మరో నాయకుడిని వెతకాల్సిన అవసరం లేదన్నారు.ఏ విషయమైనా సీఎం లేదా తాను చెబితేనే నమ్మాలని,మరెవరిమాటలనుపట్టించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం తమ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని, తప్పుడు వార్తలపై కాదని డికె హితవు పలికారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన అనుబంధం ముందులాగానే కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో సీఎం మార్పు విషయంలో వినిపిస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లు అయింది.

## అక్టోబరులో యుపిఐ లావాదేవీలు 20.70 బిలియన్లు




**న్యూఢిల్లీ:** పండుగ సీజన్ కావడంతో అక్టోబరులో డిజిటల్ చెల్లింపులు సరికొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి నూతన రికార్డులను నెలకొల్పింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం... అక్టోబరులో యూపీఐ ద్వారా జరిగిన లావాదేవీలు 20.70 బిలియన్లుగా నమోదైంది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 25 శాతం వద్ధి నమోదైంది. విలువ పరంగా చూస్తే అక్టోబరులో రూ.27.28 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. ఇక రోజువారీ లావాదేవీల విలువ సగటున రూ.87,993 కోట్లు. ఇది గతేడాదితో పోలిస్తే 16 శాతం అధికం. 2016లో సాధారణంగా ప్రారంభమైన యూపీఐ చెల్లింపులు ఇప్పుడు తారాస్థాయికి చేరాయి. 2017 జూన్‌లో లావాదేవీలు రోజువారీ సగటు 3.5 లక్షలుగా ఉండగా... ఈ ఏడాది సరికొత్త రికార్డుకు చేరాయి.

## బిహార్‌లో 'డబుల్ ఇంజిన్' లేదు

### ఎన్‌డిఎది విభజన రాజకీయాలు : ప్రియాంక

**ప్రతీది ఢిల్లీ నుంచి నియంత్రించబడుతుంది**

**బెగుసరాయ్ :** ఎన్‌డిఎ ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, నిజమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు నకిలీ జాతీయ వాదాన్ని ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ మండిపడ్డారు. బిహార్‌లోని బెగుసరాయ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ప్రియాంకా, రాష్ట్రంలో నిరుద్యోగం, వలస సమస్యలను ఎన్‌డిఎ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. 'ప్రజలను బిజెపి ప్రభుత్వం బలహీనపరచింది. వారు ఇరవై ఏళ్లుగా అధికారంలో ఉన్న ఈ ప్రభుత్వం బలహీనంగా మారింది. వారు మీ ఓటును ప్రమాదంలో పడేశారు. వారు విభజన రాజకీయాలను అనుసరిస్తున్నారు. తద్వారా మతాల మధ్య, కులాల మధ్య శత్రుత్వం ఏర్పడుతుంది. మిమ్మల్ని దృష్టి మరల్చడానికి, వారు ఏదో ఒక అంశాన్ని లేవనెత్తుతున్నారు. ఓటు హక్కు భారత రాజ్యాంగం ఇచ్చిన వరం. ఎన్‌డీఏ ప్రభుత్వం ఆ హక్కును, ఇసితో కలిసి బలహీనపరిచిందని అన్నారు. రాష్ట్రంలో 65 లక్షల ఓట్లను తొలగించారు. మీ హక్కులు తగ్గిస్తున్నారు. మీరు పొందుతున్న అన్ని ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలను బలహీనపరుస్తున్నారు. దేశంలో ఐఐటీలు, ఐఐఎంలు, పరిశ్రమలను నెలకల్పింది కాంగ్రెసే. ఎన్‌డిఎ హయాంలో దేశంలో ప్రైవేటీకరణ తీవ్రమైంది' అని ప్రియాంక అన్నారు. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నడుస్తోందని మోదీ చెబుతున్నారు. డబుల్ ఇంజిన్ ఏం లేదు. సింగిల్ ఇంజిన్ మాత్రమే ఉంది. అది ఢిల్లీ నుంచి నడుస్తుంది. మీ మాట వినడానికి ఎవరు లేరు. మీ సిఎం మాట వినడానికి కూడా ఎవరు లేరు. నీతీశ్ కుమార్‌కు ఎలాంటి ఆధారం లేదు. అంతా కేంద్రం నుంచే నడిచే పరిస్థితి బిహార్‌లో నెలకొంది. విదేశాల్లోని పెద్దపెద్ద వ్యాపారులకు భూమిని కేటాయిస్తున్నారు. మీకేం అందుతోంది. ఇప్పుడు అవకాశం వచ్చింది. మేలుకోకపోతే మీ భవిష్యత్ మీ చేతిలో ఉండదు. ఏదీ మారదు' అని ప్రియాంక గాంధీ అన్నారు.



**'నిరుద్యోగ్య సమస్యను పరిష్కరించడంలో బిజెపి విఫలం**

బిహార్‌లో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ఎన్‌డిఎ ప్రభుత్వం విఫలమైందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. దాని ఫలితంగా ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని విమర్శించారు. 'ప్రధానమంత్రి, సిఎంలు, హోంమంత్రి, బిజెపి అగ్రనేతలు అందరూ బిహార్ వచ్చినప్పుడల్లా గతం లేదా భవిష్యత్తు గురించే మాట్లాడుతున్నారు. ఎప్పుడూ నెహ్రూ, ఇందిరా గాంధీ అది చెడగొట్టార, ఇది నాశనం చేశారు అనే మాట్లాడతారు. కానీ మీరు ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడుగుతున్నారా? నిరుద్యోగం, వలసల గురించి ప్రస్తావించారు ద్రవ్యోల్బణంలో మీరు ఎలా జీవిస్తున్నారో తెలుసుకుంటున్నారా? బిహార్‌లో ఉద్యోగాలు లేవు. ఉపాధి లేదు. దేశవ్యాప్తంగా ప్రజలు వలస వెళ్లాల్సి వస్తోంది. కేరళ నుంచి కశ్మీర్ వరకు ప్రజలు బిహార్‌ను వదిలి వెళ్తున్నట్లు నే చూశా. కశ్మీర్‌లో రోడ్డు నిర్మిస్తున్న కార్మికుడిని ఎక్కడి నుంచి వచ్చావ్ అని ప్రశ్నించగా బిహర్ అని సమాధానిమిచ్చాడు' అని ప్రియాంక గాంధీ తెలిపారు. అంతకుముందు పట్నా విమానాశ్రయంలో ఆమె మీడియాతో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బిజెపి కోటి ఉద్యోగాల హామీపై స్పందిస్తూ ఇన్నేళ్ల పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు.

## పరిణతితోనే హామీలు



**పట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ దూకుడు పెంచాయి. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రచార జోరు పెంచారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. ఈ హామీ అమలు చేయడంలో సాధ్యాలపై మీడియా ఆయనను ప్రశ్నించగా... అందుకు తేజస్వి బదులిస్తూ తనకు వయసు లేకపోవచ్చు కానీ... పరిణతి ఉందన్నారు. దాని ఆధారంగానే హామీ ఇచ్చానని చెప్పారు. ప్రతి కుటుంబానికో ప్రభుత్వ ఉద్యోగం, ఆర్థిక న్యాయం, సమ్మిళిత వద్ధితో బీహార్‌ను భారత్‌లోనే నంబర్ వన్ రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో తాను ముందుకువెళుతున్నట్లు తెలిపారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు ఉద్యోగాల కోసం, విద్యార్థులు కోచింగ్‌ల కోసం ఇళ్లు వదిలేసి ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తేజస్వి స్పష్టంచేశారు. మూతబడిన జనపనార మిల్లుల పునరుద్ధరణ, ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఐటీ పార్కులు, సెజ్‌ల అభివద్ధి, బీహార్‌ను విద్యా కేంద్రంగా మార్చడం వంటి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. అభివద్ధి బీహార్‌లోని ప్రతి ఇంటి గుమ్మం ముందుకు చేరుకునేలా చర్యలు తీసుకుంటూ... స్వయం సమద్ధిగల రాష్ట్రాన్ని సష్టిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని అభివద్ధి చేయలేకపోయాయని తేజస్వీ యాదవ్ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే బీహార్‌ను పర్యాటకంగానూ అభివద్ధి చేసి... దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

## 'కన్నడ'పై కేంద్రానికి నిర్లక్ష్యం

### హిందీని బలవంతంగా రుద్దుతున్నారు
### సిఎం సిద్ధరామయ్య

**బెంగళూరు :** కేంద్ర ప్రభుత్వంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బిజెపి సర్కార్ కన్నడ భాషను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బలవంతంగా హిందీని రుద్దుతున్నారని, కన్నడ వ్యతిరేకులను వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఫెడరల్ ప్రభుత్వం కర్ణాటక పట్ల సవతి తల్లి వైఖరిని అనుసరిస్తోందని సిఎం సిద్ధరామయ్య రాష్ట్ర స్థాపన దినోత్సవం సందర్భంగా తన ప్రసంగంలో పేర్కొన్నారు. 70వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలను శనివారం పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ నిర్వహించింది. కేంద్రానికి రాష్ట్రం రూ.4.5 లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తుందని, కానీ దానికి రావాల్సిన హక్కును నిరాకరించిందని, బదులుగా చాలా తక్కువ మొత్తాన్ని ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. కన్నడ భాషకు అన్యాయం జరుగుతోందని పేర్కొంటూ హిందీని రుద్దడానికి నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలోని ఇతర భాషలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకకు నిధులను నిరాకరిస్తున్నారన్నారు. కన్నడ భాష అభివృద్ధికి తగిన నిధులు నిరాకరించడం ద్వారా దానికి రాష్ట్రానికి తీవ్ర జరుగుతోందని మండిపడ్డారు. కన్నడ వ్యతిరేకులందరినీ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కన్నడ భాషను, దాని సంస్కృతిని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించకుండా, విద్యలో కన్నడ భాషను నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్తాయని సిద్ధరామయ్య అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల పిల్లలు తమ మాతృభాషలోనే ఆలోచిస్తారు, నేర్చుకుంటారు, కలలు కంటారని, కానీ ఇక్కడ పరిస్థితి దానికి విరుద్ధంగా ఉందన్నారు. భాషాపరమైన కారణాల వల్లే ఇంగ్లీష్, హిందీ మన పిల్లల ప్రతిభను బలహీనపరుస్తున్నాయని సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషలో బోధనా మాధ్యమం కోసం ఒక వ్యవస్థను ప్రవేశపెట్టడానికి చట్టాలను తీసుకురావాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కేంద్రం ఈ దిశలో శ్రద్ధ వహించాలన్నారు. కన్నడను సవాళ్లను ఎదుర్కోవడానికి, కృత్రిమ మేధస్సు వల్ల కలిగే ఉద్యోగ నష్టాలను నివారించడానికి, అందుకు తగనట్లుగా యువతను సిద్ధం చేయడానికి తన ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. కన్నడను ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన భాషగా మార్చడానికి సహాయం చేయాలని ఆయన పండితులు, సాంకేతిక నిపుణులను కోరారు. ఐటి యుగం ఇప్పుడు కృత్రిమ మేధస్సు యుగంలా మారిపోయిందని, దీనివల్ల ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చనే ఆందోళన కూడా ఉందన్నారు. కన్నడ భాష, సంప్రదాయం, సంస్కృతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగా, ఉపాధి ప్రభావితం కాకుండా కృత్రిమ మేధస్సు సవాళ్లను ఎదుర్కోవడానికి తమ భాషను సిద్ధం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విద్యా సంస్కరణలను నొక్కి చెబుతూ శతాబ్దానికి పైగా పురాతనమైన 800 ప్రభుత్వ పాఠశాలలను మోడల్ సంస్థలుగా అప్‌గ్రేడ్ చేస్తామని సిద్ధరామయ్య చెప్పారు. మైనారిటీ వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి, మదర్సా విద్యలో భాగంగా ప్రాథమిక కన్నడను బోధిస్తున్నారని, ప్రస్తుతం, 180 మదర్సాలలో కన్నడ బోధించబడుతోంది, దీనిని రాష్ట్రవ్యాప్తంగా 1,500 కు విస్తరిస్తామని చెప్పారు. ఏకీకరణ తర్వాత కర్ణాటక 69 సంవత్సరాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తూ, ముఖ్యమంత్రి ఆలూరు వెంకటరావు, అందనప్ప దొడ్డమేటి, గుడ్లెప్ప హళ్లికేరి, సిద్ధప్ప కాంబ్లి, ఆర్ హెచ్ దేశ్‌పాండే, కౌజల్గి శ్రీనివాసరావు, కెంగల్ హనుమంతయ్య వంటి వ్యక్తులను గుర్తుచేసుకుంటూ, ఏకీకరణ ఉద్యమంలో అమరవీరులకు నివాళులర్పించారు. నేటి కర్ణాటక వారి పోరాట ఫలమన్నారు. కర్ణాటక అద్భుతమైన వృద్ధిని సాధించిందని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) ఆకర్షించడంలో మరియు 2.5 శాతం నిరుద్యోగ రేటును జాతీయ సగటు కంటే చాలా తక్కువగా ఉంచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'రాష్ట్రంలోకి రూ. 50,107 కోట్లకు పైగా ఎఫ్‌డిఐలు వచ్చాయి, ఇది భారతదేశ మొత్తం ఎఫ్‌డిఐలో 51 శాతం' అని ఆయన అన్నారు.



## ఆయుధాలు వీడండి

### ప్రజల్లోకి రండి : సహచరులకు మల్లోజుల విజ్ఞప్తి

**గడ్చిరోలి :** ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని తన సహచరులకు మాజీ మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి విజ్ఞప్తి చేశారు. అడవులను వీడి ప్రజల మధ్యకు రావాలని కోరారు. అక్టోబర్ 14న మల్లోజున గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం విదితమే. కాగా, మల్లోజన వీడియోను శనివారం గడ్చిరోలి పోలీసులు మీడియాకు విడుదల చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) నేతృత్వంలోని నిషేధిత ఉద్యమం నుండి బయటపడాలని కోరుకుంటే తమ సహచరులు తన, లొంగిపోయిన మరో సహచరుడు రూపేష్ మొబైల్ ఫోన్ నంబర్లలో సంప్రదించాలని భూపతి తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యుడు, సెంట్రల్ రీజినల్ బ్యూరో కార్యదర్శి సిపిఐ (మావోయిస్ట్) ప్రతినిధి అయిన భూపతి, అధికారం, భూమి కోసం సాయుధ పోరాటంలో పాల్గొన్న సహచరులు తమ చర్యలు తమను ప్రజల నుండి దూరం చేశాయని అర్థం చేసుకోవాలని ఇది 'మార్గ వైఫల్యాన్ని' చూపిస్తుందని అన్నారు. ఇంకా మిగిలి ఉన్న మావోయిస్టులు హింస మార్గాన్ని విడిచిపెట్టి, లొంగిపోయి ప్రధాన స్రవంతిలో చేరి ప్రజలలో పనిచేయాలని మల్లోజుల సూచించారు. నిషేధిత సంస్థ కేంద్ర కమిటీ చుట్టూ జరుగుతున్న మార్పును గ్రహించినప్పటికీ సాయుధ పోరాటాన్ని విరమించుకోవడానికి ఇష్టపడకపోవడం వల్ల కఠినమైన వైఖరి అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. తనను లొంగిపోయిన ఇతర నక్సలైట్లను 'గద్దర్' (దేశద్రోహులు) అని పి పిలుస్తూ కొందరు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన అన్నారు. అయితే ఎందుకు మావోయిస్టులు లొంగిపోవాలో రూపేష్ చాలా వివరంగా వివరించినట్లు భూపతి చెప్పారు. పరిస్థితి మారిపోయిందని, మావోయిస్టులు సాయుధ ఉద్యమాన్ని విడిచిపెట్టి చట్టం పరిధిలో పనిచేయాలన్నారు. దేశంలోని మేధావులందరూ, జనవాది ప్రేమియో (ప్రజాస్వామ్య ప్రేమికులు), ముఖ్యంగా గిరిజనుల శ్రేయోభిలాషులు తమ నిర్ణయాన్ని అర్థం చేసుకుని తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నానన్నారు. ఆయుధాలను నిషేధించాలనుకునేవారు, ప్రజలలో పనిచేయాలనుకునేవారు తనను, రూపేష్‌ను ఫోన్‌లో సంప్రదించవచ్చు అని ఆయన వీడియో సందేశంలో తెలిపారు. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టు ఉద్యమాన్ని వ్యాప్తి చేయడంలో ప్లాటూన్ కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా సహాయపడిన నిషేధిత పీపుల్స్ వార్ గ్రూప్ వ్యవస్థాపక సభ్యుడు భూపతి అధికారికంగా 60 మంది కేడర్లతో లొంగిపోయాడు. ఏడు ఎకె47 ఎస్, తొమ్మిది ఇన్సాస్ రైఫిల్స్‌తో సహా 54 ఆయుధాలను అప్పగించారు. అక్టోబర్ 17న ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో 200 మందికి పైగా కేడర్‌లతో పాటు రూపేష్ అలియాస్ సతీష్ ఆయుధాలు వదులుకున్నాడు. ఇది ఆ రాష్ట్ర చరిత్రలో అతిపెద్ద సామూహిక లొంగుబాటుగా నిలిచింది.

## మాజీ మంత్రిపై దర్యాప్తునకు గవర్నర్ ఆమోదం



**చండీగఢ్:** శిరోమణి అకాలీ దళ్ మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీతియాపై అక్రమాస్తులపై దర్యా ప్తు చేపట్టేందుకు పంజాబ్ గవర్నర్ గులాబ్ చాంద్ కటారియా శనివారం అనుమతి ఇచ్చారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం ఆయన తన ఆమోదం తెలిపారు. సెప్టెంబరు ఎనిమిదో తేదీన పంజాబ్ క్యాబినెట్ చేసిన ప్రతిపాదన ఆధారంగా గవర్నర్ ఆ ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మజీతియా వద్ద సుమారు 700 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. 2013లో డ్రగ్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ ద్వారా సుమారు రూ.540 కోట్లు కుంభకోణానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. మజీతియా నియోజకవర్గం నుంచి మజీతియా మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. జూన్ 25న ఆయన్ను అమత్‌సర్‌లో అరెస్టు చేశా రు. అతడి ఇంటి నుంచి డిజిటల్ డివైస్‌లు, ప్రాపర్టీ డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ రి కార్డులను విజిలెన్స్ బ్యూరో సీజ్ చేసింది. మొహాలీ కోర్టు ఆయనకు ఏడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. ఆ తర్వాత జూలై ఆరో తేదీన జుడిషియల్ కస్టడీలోకి తీసుకెళ్లారు. ఆగస్టు 22న విజిలెన్స్ బ్యూరో పూర్తి వివరాలతో అభియోగాలు నమోదు చేసింది. 200మంది సాక్షుల నుంచి 40వేల పేజీల ఆధారాలను సేకరించింది. 2013లో పంజాబ్‌లో సుమారు ఆరు వేల కోట్ల సింథటిక్ డ్రగ్ రాకెట్ చోటుచేసుకుంది. మాజీ డీఎస్పీ జగదీశ్ సింగ్ బోలాను ఈ కేసులో విచారించారు. డ్రగ్ కేసుతో మజీతియాకు సంబంధం ఉన్నట్లు జగదీశ్ విచారణలో వెల్లడించారు. అయితే డ్రగ్స్ కేసులను గతంలో కోర్టు కొ ట్టివేసింది. కానీ డబ్బు కుంభకోణం కేసులో మాత్రం విచారణ కొనసాగుతోంది.

## ఢిల్లీలో ప్రమాదకరస్థాయికి వాయుకాలుష్యం

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం...శనివారం ఉదయం ఓవరాల్ ఎయిర్ క్వాలిటీఇండెక్స్245గా నమోదైంది. మరోవైపు వాయు కాలుష్యం నివారించేందుకు ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలకు దిగింది. బీఎస్ 6 నిబంధనలు పాటించని వాణిజ్య వాహనాలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. వాయుకాలుష్యం పెరిగిపోవడం దృష్ట్యాఢిల్లీలోఎన్సీఆర్‌లో గ్రాప్1 కాలుష్య నియంత్రణ చర్యలు అమలవుతున్నాయి. తాజాగా గ్రాప్ 2 అమలు, నిర్మాణ పనులపై ఆంక్షలు విధించారు.బొగ్గు,కట్టెల వాడకం, డీజిల్ జనరేటర్ సెట్లపై నిషేధం విధించారు. వాయు కాలుష్యంతో ఢిల్లీ వాసులుఅనారోగ్యంబారిన పడుతున్నారు. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పిలతో బాధ పడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

## రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీలు ఐక్యం

### శివసేన (యుబిటి)

**ముంబై:**ప్రతిపక్షాల'సత్యచా మోర్చా' భారత ఎన్నికల సంఘాన్ని కుదిపేస్తోందని శివసేన (యూబీటీ) శనివారం పేర్కొంది ఉద్ధవ్ ఠాక్రే నేతత్వంలోని పార్టీ, సామ్నాలో రాసిన ఒక సంపాదకీయంలో సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం తర్వాత రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని పార్టీలు హదయపూర్వకంగా కలిసి వచ్చాయని పేర్కొంది. మహానగరం దక్షిణ భాగంలోని ఫ్యాషన్ స్ట్రీట్ నుంచి మధ్యాహ్నం ప్రారంభమై ఒక కిలోమీటరు దూరంలో ఉన్న బీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ముగియనున్న ఈ ర్యాలీలో శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్‌పీ), కాంగ్రెస్, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేనతో పాటు వామపక్షాలు, పీడబ్ల్యూపీ పాల్గొన్నాయి. ఓటర్ల జాబితాలో జరిగిన తప్పుడు తొలగింపులు, చేర్పులు వంటి అవకతవకలకునిరసనగా ఈ ప్రదర్శన జరిగింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ విషయంపై కళ్లు మూసుకుందని ప్రతిపక్షం ఆరోపించింది. లోపాలను సరిదిద్దిన తర్వాతే మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని నొక్కి చెప్పింది. 'అన్ని పార్టీల మోర్చా ఢిల్లీలో ఎన్నికల సంఘాన్ని కుదిపేస్తుంది' అని సామ్నా సంపాదకీయం పేర్కొంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నుంచి ఓటర్ల జాబితా వరకు కుంభకోణం జరిగిందని ఆరోపించింది. ఓటర్ల జాబితాలోని అవకతవకల కారణంగా 2014 నుంచి బీజేపీ గెలుస్తోందని శివసేన (యూబీటీ) ఆరోపించింది. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలో 60 లక్షలకు పైగా ఓటర్లు జాబితాలో చేర్చబడ్డారని సంపాదకీయం పేర్కొం ది. నాసిక్‌లో 3.5 లక్షల మంది ద్వంద్వ ఓటర్లు ఉన్నారని, థానే మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో భాగమైన దివాలో 17 వేల మంది ద్వంద్వ ఓటర్లు ఉన్నారని పేర్కొంది. యాదచ్ఛికంగా, మహారాష్ట్ర ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో నకిలీ ఆధార్ కార్డును తయారు చేసి, బోగస్ ఓటర్లను నమోదు చేయడానికి దాని ఉపయోగాన్ని చూపించిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులపై ఇక్కడ ఎఫ్‌ఐఆర్ నమోదయింది. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, రోహిత్ పవార్‌పై కేసు నమోదు చేయబడితే, ఓటర్ల జాబితాలో వందలాది నకిలీ పేర్లను 'ప్రవేశపెట్టినందుకు' ఎన్నికల కమిషన్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని సేన (యూబీటీ) ప్రశ్నించింది.




**FORMAT C-1**

*(for candidate to publish in Newspapers, TV)*

**Declaration about criminal cases**

*(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation &Ors. Vs. Union of India & Anr.)*

**Name and address of candidate : NAVEEN YADAV. V**
H.No.8-3-229/S/3/5, Rahmath Nagar,
Yousufguda Check post, Yousufguda,
Hyderabad – 500045.

**Name of Political Party : INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of Constituency : 61-JUBILEE HILLS**

I, **NAVEEN YADAV. V**, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No. and dated | Status Ofcase(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description ofoffence(s) & punishment imposed | MaximumPunishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |





## దయాగుణం అత్యవసరం..

'పరోపకారార్థం ఇదం శరీరం' అంటాడు త్యాగమూర్తి దధీచి. ఆ స్థాయిలో కాకపోయినా, దయా గుణాన్ని ప్రదర్శించడం వల్ల.. ఎంతోకొంత ఉపకారం చేయడం వల్ల మానసిక ఉత్సా హం, అలౌకిత ప్రశాంతత సాధ్యమవుతాయి. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం, దయా గుణాన్ని ప్రదర్శించడం వల్ల మెదడులో డోపమైన్, ఆక్సిటోసిన్, సెరోటోనిన్, ఎండార్ఫిన్స్ లాంటి ఆనంద హార్మోన్లు ఎక్కువగా విడుదల అవుతాయి. ఇవి మనిషి ఆనందాన్ని పెంచుతాయి. ఒత్తిడిని తగ్గిస్తాయి. సామాజిక సంబంధాలను బలపరుస్తాయి. నిరంతరం ఆరు వారాలపాటు దయా ప్రవర్తనను సాధనగా చేస్తే, మెదడులోని ప్రీఫ్రాన్‌టల్ కార్టెక్స్ అనే ప్రాంతంలో కొత్త నాడీ మార్గాలు ఏర్పడతాయి. ఇవి సహానుభూతి, నిర్ణయం, భావోద్వేగ నియంత్రణకు దోహదపడతాయి. రెండునెలలలోపే మెదడులో శాశ్వతమైన మార్పులు రావచ్చు. తద్వారా సానుకూల భావోద్వేగాలను సులభంగా అనుభవించవచ్చు. ఈ మార్పులు ఒత్తిడి, బాధను తగ్గించడమే కాక స్థిరమైన ఆనందం కోసం సహాయపడతాయి. మనం ప్రదర్శించే దయాగుణం వల్ల ఇతరులకు మాత్రమే మేలు జరుగుతుందని అనుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే, ఇది మనకూ మంచిదే. మనోవైజ్ఞానికంగా, మానవ సంబంధాల్లో మెరుగుదల, ఒంటరితనంతో పోరాటం, సమాజంలో సానుకూలత పెరుగుతుంది. చిరునవ్వు, ప్రశంస,, నేను ఉన్నానంటూ ఓ చిన్న భరోసా వంటి చిన్న చిన్న చర్యలు మనుషులను దగ్గర చేస్తాయి. ఆనందాన్ని పెంచుతాయి. దయతో ప్రవర్తించాలన్న పెద్దలు మాటల వెనుక, ఇంతటి శాస్త్రం దాగి ఉందన్నమాట.



## గౌరవంగా చేపలు పట్టాలి!

గాలం వేసి చేపలు పట్టడం చాలా మందికి ఒక హాబీ. అందులో గౌరవం లేదా జీవుల పట్ల ప్రేమ అనే పదాలకు అర్థం లేదు. కానీ, జర్మనీలో మాత్రం చేపలు పట్టేవారు, వాటిని గౌరవంగా చూడాలి. బాధ ఎక్కువ లేకుండా జాగ్రత్త పడాలి. జంతుజాలంతోనూ మృదువుగా వ్యవహరించే ధర్మశాస్త్రం (ఎథిక్స్)లో ప్రత్యేక శిక్షణ పూర్తి చేసిన తర్వాతే ఫిషింగ్‌కు అర్హత పొందుతారు. ఈ శిక్షణ ద్వారా చేపలకు బాధ కలిగించకుండా, అవి ఆందోళన చెందకుండా జాగ్రత్తగా ఎలా పట్టు చేసుకోవాలి? అనేది నెర్చుకుంటారు. జర్మనీ పర్యావరణ, జంతు సంరక్షణ చట్టాల ప్రకారం, చేపలను అరుస్తూ వినోదం కోసం పట్టకవడం కంటే, జీవరాశులను గౌరవించడం ముఖ్యం. ఈ దృష్టికోణం ప్రకారం, చేపలు పట్టుకోవడంలో 'ఎథికల్ ఫిషింగ్' ప్రాముఖ్యత చాలా ఎక్కువ. కాలానుగుణంగా చేపలను వినమ్రతతోపాటు శాస్త్రీయంగా నిర్వహించడం, వాటి వేదనను తగ్గిస్తూ, ప్రయాణం సమయంలో క్షీణత రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం జర్మనీలో చేపల పట్టే సంస్కృతిలోని ఒక ముఖ్య భాగమైంది. ఈ నియమాలు మనుషుల మనోవ్యవహారాన్ని కూడా పరిరక్షిస్తాయి. ప్రకృతిని వినోదంగా కాకుండా జీవిగా చూసుకునేందుకు, దాని గౌరవం కోల్పోకుండా, బాధ లేకుండా చేపల పట్టు జరుగుతుంది. ఈ విధానాలు జర్మనీ పర్యావరణ చట్టాలు, జంతు సంరక్షణ చట్టాల క్రింద అమలవుతున్నాయి. అందువలన, జర్మనీలో ఫిషింగ్ అనేది ఒక శిక్షణ, నైతికత పరమైన పని గా పేర్కోవాలి. ఇది ప్రకృతితో నిజమైన సంబంధాన్ని పెంచుతుంది.



## వందల ఏళ్లనాటి వైన్!



మద్యం ఎంత పాతబడితే అంత మంచిదని అంటారు. అది బహుశా కొన్ని నెలలు మాత్రమే వర్తిస్తుందని అనుకుంటాం. కొన్ని సందర్భాల్లో, కొద్ది సంవత్సరాల క్రితం నాటి వైన్ ల భించడం కూడా తెలుసు. కానీ, ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్ విశ్వవిద్యాలయ ఆసుపత్రుల క్రింద ఉన్న నేలమాళిగలో ప్రపంచంలోని అత్యంత పురాతన వైన్ నిల్వలో ఉంది. ఈ చారిత్రాత్మక వైన్ బారె ల్ క్రీస్తు శకం 1472లో తయారు చేశారు. ఇందులోని వైన్ ఇప్పటికీ తాగతగినదిగానే ఉందని పరిశోధకులు అంటున్నారు. శతాబ్దాల కాలంలో అగ్నిప్రమాదాలు, యుద్ధాలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ ఇది ఇప్పటికీ చెదరని స్థితిలో ఉండడం విశేషం. ఆ నేలమాళిగను 1395లో నిర్మించారని, వైద్యం, ఆధ్యాత్మిక అవసరాల కోసం వైన్ ఉత్పత్తి చేసే సంప్రదాయాని కి కేంద్రంగా నిలిచిందని శాస్త్రకారులు నిర్ధారించారు. ఆసుపత్రిని మొదట 1100 దశకాల్లో ని ర్మించారు. అయితే నల్ల ప్లేగు వ్యాధి పట్టణాన్ని విధ్వంసం చేసిన తర్వాత, 14వ శతాబ్దంలో ఆ భవనాన్ని నేలమాళిగపైకి తరలించారు. 1472 తేదీ చెక్కిన ఆ బారెల్ నేడు ఆ ప్రాంతపు వైన్ త యారీ వారసత్వానికి, సహనానికి ప్రతీకగా నిలుస్తోంది. బారెల్‌లోని వైన్‌ను మొత్తం మూడు సా ర్లు మాత్రమే ఆస్వాదించారు. మొదటి స్విట్జర్లాండ్ ప్రతినిధులను గౌరవించేందుకు రుచి చూ శారు. రెండోసారి 1716లో – నేలమాళిగపై ఉన్న ఆసుపత్రి అగ్నిప్రమాదంలో దగ్ధమైనప్పుడు, కింద ఉన్న వైన్ నిల్వ మాత్రం సురక్షితంగా ఉండటంతో రుచి చూశారు. చివరిసారి 1944లో, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జనరల్ లెక్లెర్క్ దళాలు స్ట్రాస్‌బర్గ్‌ను స్వాతంత్ర్యానికి నడిపించిన సందర్భంగా ఆ వైన్‌ను సర్వ్ చేశారు. తయారు చేసి శతాబ్దాలయినప్పటికీ, ఆ వైన్ నేటికీ నైపుణ్యానికి, వైన్ తయారీ కళాకారుల శ్రద్ధా నిబద్ధతకు నిదర్శనంగా ఉంది. ప్రస్తుతం ఆ నేలమాళిగను పునరుద్ధరించి, వైన్ తయారీని కొనసాగిస్తున్నారు. ప్రతిఫలాలుగా వచ్చిన లాభాలు ఆసుపత్రి మెడికల్ పరికరాల కొనుగోలు కోసం వినియోగిస్తున్నారు.

## మంచి ప్రయత్నం..



అమెరికా మాదిరి చలి ఎక్కువగా ఉండే పలు ఐరోపా దేశాల్లోనూ నిరాశ్రయులు, నిరుద్యోగులు శీతాకాలం పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. కప్పుకోవడానికి చాలీచాలని దుప్పట్లు, రగ్గులతో నెట్టుకొస్తుంటారు. అలాంటి వారికి 'సర్వైవల్ బ్యాక్‌ప్యాక్' ఆలోచన వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతున్నది. వీటిని రోడ్డు పక్కల ఏర్పాటు చేస్తారు. ఈ ప్యాక్‌ను కేవలం రెండు నిమిషాల్లోనే పూర్తిగా విప్పగలుగుతారు. వాతావరణానికి నిరోధకత కలిగి ఉండే ఈ సురక్షిత ప్యాడ్‌ను నిద్రకు ఉపయోగించుకోవచ్చు. దీనిని తేలికగా మడిచిపెట్టుకునేలా, నీటిని తట్టుకునేలా రూపొందించారు. వీధుల్లో నివసించే వారికి తక్షణ ఆశ్రయం అందించడమే దీని ముఖ్య లక్ష్యం. ఇందులో సౌరశక్తితో నడిచే ప్యానెళ్ళు ఉంటాయి. ఫోన్లు ఛార్జ్ చేసుకోవడానికి, చిన్న ఎల్ఇడి లైట్లు వెలిగించడానికి అనువుగా ఉంటుంది. పైగా, ఇందులో స్థిర ఉష్ణ సంరక్షణ కోసం ప్రత్యేక పదార్థం, ప్రాణాపాయ సమయాల్లో రెస్క్యూ బృందాలు వాడే ప్రతిబింబిత థర్మల్ పొరలు ఉంటాయి. ఇవి కేవలం చలి నుంచి రక్షించడమేకాదు... మానవతకు నిదర్శనంగా విరాజిల్లుతున్నాయి. సమాజం మరిపోయిన బాధితులకు కూడా మానవతా దృష్టితో కూడిన సాంకేతికత ఎలా సేవ చేయగలదో ఈ సాంకేతికత చాటి చెప్పింది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# అమెరికాతో రక్షణ బంధం

ప్రజాపక్షం
02-11-2025, ఆదివారం

భారత్ నుంచి దిగుమతులపై సుంకాలను 50 శాతానికి, నాన్ జనరిక్ ఔషధాలపై సుంకాలను 100 శాతానికి పెంచి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేధిస్తున్నారు. రష్యా నుంచి చౌకగా ఆయిలు కొనుగోలును నిషేధించి రేటు ఎక్కువైనా, దూరాభారం రవాణా ఖర్చులు ఎక్కువైనా తమ ఆయిలు కొనాలంటున్నారు. వాణిజ్య ఒప్పందం కోసం ఒత్తిడి చేస్తూ ఈ నెలాఖరులోపు ఒప్పందానికి రాకపోతే సుంకాలు మరింత పెంచుతానని బెదిరిస్తున్నారు. మరోవైపు హెచ్ 1బి తదితర వీసాలను కఠిన తరం చేస్తూ భారతీయ కంపెనీలకు, విద్యార్థులకు వారి కుటుంబాలకు కంటి మీద కునుకులేకుండా భయపెడుతున్నాడు ట్రంప్ మహానుభావుడు. ప్రధాని మోదీ కూడా తమ ప్రియమిత్రుడు ట్రంప్‌ను కలుసుకోవటాన్ని దాటవేస్తూ అంతర్జాతీయ సమావేశాలకు గైరుహాజరవుతున్నారు. భారత్, అమెరికా సంబంధాలు తీవ్రమైన ఉద్రిక్తతలో ఉన్నట్లు ఇవి సూచిస్తున్నాయి. కాని కౌలంపూర్‌లో ఏషియన్ భద్రత మహాసభ సందర్భంలో అమెరికాతో 10సంవత్సరాల రక్షణ ఒప్పంద చట్రం పత్రంపై భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం సంతకం చేయటం దేశ ప్ర జల మనోభావాలను నిస్సదేహంగా గాయపరుస్తుంది. 2015లో కుదిరిన ఒప్పందం కాలపరిమితి ముగిసినందున దాన్ని మరో పదేళ్లు పొడిగించటం తప్ప ఇందులో కొత్తేమిలేదని ప్రభుత్వం సమర్థించుకోవచ్చు. రక్షణ చట్రం ఒప్పందంపై సంతకం చేయటం జాగు చేయటం ద్వారా వాణిజ్య ఒప్పందం విషయంలో రాయితీలు సాధించుకోవలసిందిపోయి వాణిజ్యం సంగతెలా ఉన్నా తమకు రక్షణ సహకారమే ప్రాధాన్యం అన్నట్లు ప్రవర్తించటం మన దేశ ప్రయోజనాలకు భంగం కలుగజేస్తుంది. ఇండో–పసిఫిక్‌లో చైనా ఆధిపత్యానికి వ్యతిరేకంగా క్వాడ్ ఏర్పాటు చేసిన అమెరికా ఎత్తు గడల్లో భారత్‌ను బిగించటానికి కూడా ఈ రక్షణ చట్రం ఒప్పందం ఉద్దేశించబడింది. ఒక వైపు అమెరికా, మరోవైపు భారత్ చైనాతో మైత్రి, సహకారం పెంపుదల కోరుకుంటూనే, రెండో వైపున చైనాతో ఇండో– చైనాలో ఘర్షణకు సైతం సన్నద్ధంకావటం ఈ నాటి ప్రపంచ రాజకీయాల్లోని వైరుధ్యం. 'భారత్ – అమెరికా రక్షణ సహకార చట్రం 2025–2530' శీర్షికతో కూడిన ఈ ఒప్పందం పరిధి చాలా విస్తృతం అని రెండు దేశాల ప్రతినిధులు అభివర్ణించారు. దాని పరిధిలోని అంశాలు ఇలా ఉన్నాయి. సంయుక్త సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, ఇంటెలిజెన్స్ సమాచారం పంచుకోవటం, సముద్ర యానంలో జాగృతి, రక్షణ టెక్నాలజీ సహఉత్పత్తి, సహ అభివృద్ధి : మిలటరీ లాజిస్టిక్స్, మెయింటినెన్స్ కోపరేషన్, ఇండో–పసిఫిక్ భద్రతపై సంప్రదింపు లు. భారత్, అమెరికాల మధ్య రక్షణరంగంలో గాఢమైన బంధం వేసిన 2016 (లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజి మెమొరాండం), 2018 (కమ్యూనికేషన్స్ కంపాటబిలిటీ, సెక్యూరిటీ అగ్రిమెంట్) ఒప్పందాలకు ఈ చట్రం పొడిగింపు. ఇది 'మనమధ్య పెరుగుతున్న వ్యూహాత్మక మమేకతకు సంకే తం. మన భాగస్వామ్యంలో నూతన దశాబ్దాన్ని అవిష్కరిస్తున్నది అని రాజ్‌నాథ్‌సింగ్ కొనియాడారు. 'మన ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ సహకారం ఒక స్తంభం. స్వేచ్ఛాయు త, బాహాట, నిబంధనల ప్రాతిపదిక ఇండో–పిసిఫిక్ రీజియన్ ఏర్పాటుకు మన భాగస్వా మ్యం కీలకం' అని కూడా ఆయన అన్నారు. అమెరికా రక్షణ లక్ష్యాల్లో మనదేశం ఎంతగా కూరుకుపోయిందో ఇది తెలియజేస్తున్నది. ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరిలో వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ను కలుసుకున్నప్పుడు ఎఫ్ – 35 స్టీల్త్‌ఫైటర్ జెట్లు ఇస్తామని ఎర వేశాడు. అమెరికన్ మిలటరీ ప్లాట్‌ఫాంలతో పాటు తాజా టెక్నాలజీ లభిస్తుందని భారత్ ఆశపడుతున్నది. అమెరికా ఒక వైపు పాకిస్థాన్‌తో రక్షణ బంధం పెంపొందించుకుంటూ, దానిని దీటుగా ఎదుర్కోగల టెక్నాలజీ ఇస్తుందని భావించటం అత్యాశే అవుతుంది. పాకిస్థాన్, చైనాలను బూచిగా చూపి భారత్ రక్షణ వ్యవస్థను అది ఆకర్షించింది. మన రక్షణ వ్య వస్థకు సాంప్రదాయక సహాయకారి అయిన రష్యా నుండి దూరం చేస్తున్నది. మన దేశ ప్రయోజనాలు చూచుకోవటం ముఖ్యం. అదే సమయంలో అమెరికా ప్రపంచ సైనిక వ్యూహాలకు దూరంగా ఉండేటట్లు జాగ్రత్త పడటం అవసరం.

# నవ బిహార్ నిర్మాణం : మహాఘట్ బంధన్ సంకల్పం

డాక్టర్ గ్యాన్‌పాఠక్

ఇండి కూటమి బిహార్ ఎన్నికలకు అక్టోబర్ 28న విడుదల చేసిన ఎన్నికల ప్రణాళిక ఎన్‌డిఏ పాలనలో ఉన్న దయనీయ స్థితి నుంచి రాష్ట్రాన్ని బయటకు తెస్తామని, పౌరులందరికీ సామాజిక, ఆర్థిక న్యాయంతో కూడిన న్యాయమైన కొత్త బిహార్‌ను నిర్మిస్తామని వాగ్దానం చేసింది. ఇండియా ఘట్బంధన్ సంకల్ప పత్ర 2025 విశ్లేషణ ప్రకారం ఎన్‌డిఎ ప్రభుత్వం సామాన్య ప్రజల ఆశలను అడియాశలు చేసింది. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, శాంతి–భద్రతలు, ఉపాధి, వలసలు, అవినీతి అరికట్టటం, ధరల పెరుగుదల, వరదలు, లేదా కరువు ఇలా అన్ని రంగాల్లో పరిపాలన విఫలమైంది. ప్రజాస్వామిక సంస్థలు బలహీనమైనాయి. పారదర్శకత, బాధ్యత, జవాబుదారీతనం లేకుండా పోయాయి. అసమానతలు పెరిగాయి, దళితులు, ఒబిసిలు, ఇబిసిలు, మహిళలు, మైనారిటీలు అణచివేత, దోపిడీకి గురికావటం పెరిగింది. ఇదీ రాష్ట్ర దుస్థితిని మహాగట్బంధన్ విశ్లేషించిన తీరు. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నాయకత్వంలోని ప్రభుత్వానికి రాష్ట్రాన్ని ప్రస్తుత దుస్థితి నుండి కాపాడేందుకు సమర్థవంతమైన ప్రణాళిక గాని, సంకల్పంగానీ లేదని పేర్కొన్నది. పేదలు, అట్టడుగు తరగతుల హక్కులు హరించేందుకు, వారి ఓటు హక్కు అపహరించేందుకు కుట్ర జరిగిందని విమర్శించింది. తమకు అధికారమిస్తే అందరికీ ఆర్థిక, సామాజిక న్యాయంతో సంతోషకరమైన నవ బిహార్‌ను నిర్మిస్తామని వాగ్దానం చేసింది. ఎన్నికల ప్రణాళిక ఎన్నికల పత్రం మాత్రమే కాదని, అది నిర్దిష్టమైన తమ చారిత్రక వాగ్దానమని వక్కాణించింది.

మహాగట్బంధన్ మ్యానిఫెస్టో సామాజిక న్యాయాన్ని వక్కాణించినప్పటికీ ఆర్థిక అంశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 రోజులలోపల ప్రతి కుటుంబానికీ ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించే వాగ్దానంతో చట్టం తెస్తామని, 20 నెలల్లో నియామక ప్రక్రియ మొదలవుతుందని అది వాగ్దానం చేసింది. నిరుద్యోగ సమస్య బిహార్ ఎన్నికల్లో ప్రధాన సమస్యగా ముందుకు వచ్చినట్లు ఇది తెలియజేస్తున్నది. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫారాలు, పరీక్ష ఫీజు రద్దు, పరీక్షా కేంద్రాలకు రానుపోను ఉచిత ప్రయాణాన్ని ఇండి కూటమి వాగ్దానం చేసింది. పరీక్ష పేపర్ల లీకులు, నియామకాల్లో అవకతవకలు ఆపుతామంది. రాష్ట్రంలోని ఉద్యోగాల్లో స్థానికులు అధిక ప్రాధాన్యత పొందేటట్లు నివాస విధానాన్ని తీసుకువస్తామని తెలిపింది.

తమ సర్వీసుకు గుర్తింపు, ప్రభుత్వోద్యోగుల హోదా కోరుతున్న జీవిక దీదీల (సమాజ సమీకరణకర్తలు) దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చుతామని వాగ్దానం చేసింది. నెలకు రూ.30వేల వేతనాన్ని హామీ ఇచ్చింది. కాంట్రాక్టు కార్మికులు, పొరుగు సేవల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామంది. నూ



తన ఉద్యోగాల కల్పనకు పారిశ్రామికాభివృద్ధి, ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలును గట్బంధన్ వాగ్దానం చేసింది. గ్రామీణ ఉపాధి కార్మికులకు రోజు వేతనాన్ని రూ.255 నుంచి రూ.300లకు పెంచుతామని, పనిదినాలను 100 నుంచి 200కు పెంచుతామని వాగ్దానం చేస్తూ, దిన వేతనాన్ని రూ.400లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మయి–బాహిన్ మాన్ యోజన పథకం కింద 2025 డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2500 చొప్పున ఉచిత సహాయం వాగ్దానం చేసింది. తల్లులకు ఇల్లు, ఆహారధాన్యాలు, ఆదాయం, కుమార్తెలకు ఆర్థిక సదుపాయాలు, విద్య, శిక్షణ సమకూర్చుతామని, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు హామీ ఇచ్చింది.

రైతులకు తమ పంటలన్నింటికీ ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీ హామీ ఇచ్చింది. మండీ, మార్కెట్ కమిటీ వ్యవస్థను పునరుద్ధరిస్తామంది. 'ప్రతి పౌరునికి రూ.25లక్షల ఆరోగ్యబీమా వాగ్దానం చేసింది. అత్యంత వెనుకబడిన తరగతులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా చట్టం తీసుకువస్తామంది. పంచాయతీ, మున్సిపల్ సంస్థల్లో బిసి రిజర్వేషన్‌ను 20 నుంచి 30 శాతానికి, ఎస్‌సి రిజర్వేషన్‌ను 16 నుంచి 20కి పెంచుతామని, ప్రస్తుతం 50శాతం రిజర్వేషన్‌లను పెంపు చేసే శాసనం చేసి కేంద్రానికి పంపుతామని మహాగట్బంధన్ హామీ ఇచ్చింది.

### ముస్లింకు చోటు లేని బిజెపి అభ్యర్థుల జాబితా

101 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న బిజెపి తమ ముస్లిం వ్యతిరేక విధానంలో భాగంగా ఒక్కరంటే ఒక్క ముస్లిం అభ్యర్థికీ టిక్కెట్టు ఇవ్వలేదు. కాంగ్రెస్ ఏడుగురు ముస్లింలకు టిక్కెట్టు ఇచ్చినప్పటికీ, డిప్యూటీ ముఖ్యమంత్రిగా ముస్లింని ప్రకటించలేదని బిజెపిలోని ముస్లిం పాత ముఖం షా నవా జ్ హుస్సేన్ ఇల్లెక్కి అరుస్తున్నాడు. ఇదొక వింత. పార్లమెంట్ ఎలక్టోరల్ రాజకీయాల్లో ఒక సముదాయం ప్రాతినిధ్యం దాని జనాభా పెరుగుదలకనుగుణంగా ఉండాలి. ప్రజాస్వామిక సూత్రం, రాజ్యాంగం హామీ ఇచ్చిన 'ఒక వ్యక్తి ఒక ఓటు' సరైన నిర్వచనం జనాభా పెరుగుదల దామాషాకు అనుగుణంగా ప్రజా ప్రాతినిధ్యం. అయితే దాని అ మలు ఫెడరలిజం స్వభావం, ప్రాంతీయ సమతౌ ల్యం, ఆయా సముదాయాల ప్రాబల్యం బట్టి ఉం టుంది. రాజకీయ పార్టీలు ఆ దృష్టి నుంచే ఎంపిక చేస్తాయి. అయితే మత ద్వేషంతో ఒక మతం మొ త్తానికి ప్రాతినిధ్య అవకాశాన్ని నిరాకరించటం, అది పాలక పార్టీ కావడం వివక్షకు పరాకాష్ట . బి హార్ అనేకాదు, బిజెపి పార్లమెంట్ , అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ఈ వివక్ష పాటిస్తున్నది .కాంగ్రెస్ ఎన్ని కల విజయాలు క్షీణించటం, హిందూత్వ రాజకీయాలు పైచేయి కావటం ముస్లింల ప్రాతినిధ్యం తగ్గటానికి ప్రధాన కారణం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింల ప్రాతినిధ్యం గత ఆరు దశాబ్దాల్లోకెల్లా అతితక్కువ స్థాయికి దిగజారింది. పాలక ఎన్‌డిఎకు ముస్లిం ఎంపి లేరు. మొత్తం ముస్లింల ప్రా తినిధ్యం 4 శాతానికి పడిపోయింది. 2025 బిహా ర్ ఎన్నికల్లో బిజెపి ఒక్క ముస్లిం అభ్యర్థిని నిలబెట్టలేదు. కాంగ్రెస్ 7,జనతాదళ్(యు) 4, ఎల్‌జెపి(ఆర్‌వి) ఒక టిక్కెట్ ఇచ్చాయి. ప్రశాంత్ కిశోర్ జన సురాజ్ పార్టీ 21 మందిని నిలబెట్టింది. కాగా ముస్లిం జనాభా 87 నియోజక వర్గాల్లో 20 శాతం పైగా ఉన్నారు. రాష్ట్ర జనాభాలో 17.7 శాతంగా ఉన్న ముస్లింల్లో సుమారు 75 శాతం ఉత్తర బిహార్‌లో నివసిస్తున్నారు.

బిహార్‌లో ఒకేఒక్క ముస్లిం అబ్దుల్ గఫూర్ 1973లో ముఖ్యమంత్రి అయినారు. పేద , దళిత ,పస్మండ ముస్లింల ఎన్నికల ప్రాతినిధ్యం మరీ తక్కువ. రాష్ట్రంలోని ముస్లింల్లో వారి వాటా 73 శాతం. ముస్లిం ఎమ్మెల్యేల్లో వారి వాటా ఇప్పటి వరకు 18 శాతం మాత్రమే . 2020లో ఐదుగురు మాత్రమే ఈ కేటగిరీ నుంచి ఎన్నికైనారు. వారిలో నలుగురు (ఎఐ ఎంఐఎం) , ఇకరు ఆర్‌జెడి. ఎంఐఎం టిక్కెట్‌పై గెలిచిన నలుగురూ జెడి(యు)లో చేరిపోయారు. మహాగట్బంధన్ అధికారంలోకి వస్తే కాంగ్రెస్‌నుంచి ముస్లిం ఉప ముఖ్యమంత్రి ఉంటారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కృష్ణ అళ్లవారు చెప్పారు.

### చిన్న పార్టీల హవా

బిహార్‌లో కులరాజకీయాల ప్రభావం మెండు. ఓటింగ్‌లో కుల ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని జాతీయ పార్టీలు రెండూ రిజర్వుడు షెడ్యుల్డు కులం సీట్లను ప్రాంతీయపార్టీలకు కేటాయించాయి. బిహార్‌లో హిందూ ఓటులో ఐదు ఉపవిభజనలున్నాయి. అగ్రవర్ణాలు, యాదవ ఇతర వెనుకబడిన కులాలు, అత్యంత వెనుకబడిన కులం (ఇబిసి) , దళితులు, జనజాతి. ఓటర్లలో ఇబిసిల వాటా 36శాతం, హిందువుల్లో ఒబిసిల వాటా 27.12 శాతం. హిందూ ఓట్లలోఅగ్రవర్ణాలు 15. 52 శాతం, దళితులు19 శాతం ,జనజాతి1.68 శాతం. 38 ఎస్‌సి రిజర్వు సీట్లలో బిజెపి 11 మాత్రమే పోటి చేస్తున్నది. జెడియు 15, ఎల్‌జెపి (ఆర్‌వి) 8 సీట్లలో పోటి చేస్తున్నాయి. హిందుస్థాన్ అవామీ మోర్చా సెక్యులర్ నాలుగుసీట్లలో పోటీ చేస్తున్నాయి. కాగా కాంగ్రెస్ 11, ఆర్‌జెడి 20, సిపిఐ ఎంఎల్ 6, సిపిఐ 2 ఎస్‌సి రిజర్వ్‌డ్ సీట్లలో పోటీలో ఉన్నాయి. విఐపి పార్టీ ఒక అభ్యర్థిని నిలబెట్టింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ 21, మహాగట్బంధన్ 17 ఎస్‌సి రిజర్వేషన్ సీట్లు గెలుచుకున్నాయి.

# అజారుద్దీన్ మంత్రి పదవితో కాంగ్రెస్ విజయం సాధిస్తుందా?




భారత క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్, మాజీ ఎంపి మహ్మద్ అజారుద్దీన్‌కు ఆకస్మికంగా మంత్రి యోగం లభించింది. రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చేత గవర్నర్ జిష్ణు కాంత్ వర్మ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. అజహరుద్దీన్‌కు హుటాహుటిన మంత్రిని చేయడం వెనుక పెద్ద రహస్యమేమీ లేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. గత శాసనసభ సాధారణ ఎన్నికల్లో ఆయన ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయన కేవలం 16,337 ఓట్ల తేడాతో ఓడిపోయి, ద్వితీయ స్థానంలో .నిలిచారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శాసనసభ నియోజకవర్గాలలో కాంగ్రెస్ ద్వితీయ స్థానం నిలిచిన అతి కొద్ది స్థానాలలో జూబ్లీహిల్స్ ఒకటి. అక్క డ అంతకు ముందు కాంగ్రెస్ తరుపున ఎంఎల్‌ఏగా ప్రాతినిధ్యం వహించిన సిఎల్‌పి మాజీ నేత పి.జనార్ధన్‌రెడ్డి తనయుడు విష్ణువర్ధన్ రెడ్డిని కాదని మరీ కాంగ్రెస్ టిక్కెట్ అజార్‌కు కట్టబెట్టారు. దీంతో విష్ణు బిఆర్ఎస్‌లో చేరారు. అంతే కాకుండా ఆ నియోజకవర్గంలో గణనీయమైన ఓట్లు కలిగిన ఎంఐఎం బిఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించింది. అ యినప్పటికీ కాంగ్రెస్ రెండవ స్థానంలో నిలవడం విశేషం. సిట్టింగ్ ఎంఎల్‌ఏ మాగంటి గోపీనాథ్ హఠన్మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఈసారి అజారుద్దీన్‌కు కాకుండా నవీన్ యాదవ్‌కు కాం గ్రెస్ టిక్కెట్ దక్కింది. యువకుడైన నవీన్ యాదవ్ ఇదే నియోజకవర్గం నుంచి రెండు సార్లు పోటీ చే సిన అనుభవం ఉంది. గత ఎన్నికల్లో బిఆర్ఎస్ టిక్కెట్ ఆశించినప్పటికీ, దక్కకపోడంతో కాంగ్రెస్ లో చేరారు. 2014లో ఎంఐఎం నుంచి పోటీ చేసి న నవీన్ యాదవ్ కేవలం 9వేల ఓట్ల తేడాతో ఓట మి పాలయ్యారు. ఈసారి ఎలాగైనా విజయం సా ధించాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా నవీన్ యాదవ్‌కు టిక్కెట్ ఇచ్చింది. అయితే, గత ఎన్నికల్లో ద్వి తీయ స్థానంలో నిలిచిన అజారుద్దీన్ సైతం టిక్కెట్ ఆశించినా దక్కకపోవడంతో అసంతృప్తి చెందారు. చివరకు ఆయనను గవర్నర్ కోటాలో ఎంఎల్‌సిగా మంత్రివర్గం సిఫార్సు చేసినప్పటికీ రాజ్‌భవన్ నెలలు తరబడి పెండింగ్‌లోనే ఉంచింది.

దీనిని ఆసరాగా చేసుకొని ముస్లిం మైనారిటీల ఓట్లకు గాలం వేసేందుకు బిఆర్ఎస్ సర్వశక్తులు ఒడ్డింది. ఎందుకుంటే నాలుగు లక్షల ఓటర్లు కలిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 1.75 లక్షల ముస్లిం ఓట్లు ఉన్నాయి. గతంలో ఎంఎల్‌సి జర్నలిస్టు అమేర్ అలీఖాన్‌ను గవర్నర్ కోటాలో కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్‌తో పాటు ఆయనను నామినేట్ చేసినప్పటికీ, అది సుప్రీం కోర్టులో కేసు కారణంగా రద్దు చేయబడింది. ప్రభుత్వం మరోసారి కోదండరామ్‌ను కొనసాగిస్తూ, అమేర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును గవర్నర్‌కు సిఫార్సు చేసినా అధికారిక ప్రకటన వెలువడేదు. బిఆర్ఎస్‌కు ఇదొక అస్త్రంగా మారింది. గతంలో అమేర్ అలీఖాన్‌కు ఒకసారి ఎంఎల్‌సి ఇచ్చి, రద్దవడంతో ఆయన పేరును మరోసారి పంపకుండా కాంగ్రెస్ మోసం చేసిందని బిఆర్ఎస్ మైనారిటీల లోకి తీసుకెళ్ళింది. ఆయన స్థానంలో అజారుద్దీన్ పేరును పంపినా పెండింగ్‌లో పడడంతో, ఇది కూడా జిమ్మిక్కేనని విస్తృత ప్రచారాన్ని చేసింది. మైనారిటీలలో ఒక వర్గం ఈ విషయంలో ఆలోచనలోపడింది. పైగా ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటికీ ముస్లింల నుంచి ఒక మంత్రి లేకపోవడం పై కూడా చర్చకు వచ్చింది. జూబ్లీహిల్స్‌లో కీలకమైన మైనారిటీఓట్లలో కొన్ని బిఆర్ఎస్‌వైపు మొగ్గే అవకాశం లేకపోలేదనే నివదికలు కూడా వచ్చాయి.

### ఒక్క దెబ్బకు మూడు పిట్టలు

వీటన్నిటి నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం అప్రమత్తమైంది. అన్నిటికీ విరుగుడుగా అజారుద్దీన్‌ను వెంటనే మంత్రివర్గంలోకి తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు విపులీకరించారు. శాసనసభ లేదా శాసనమండలి లో ఏదో ఒక సభ నుంచి సభ్యుడు కాని వ్యక్తిని కూడా మంత్రిమండలిలోకి తీసుకోవచ్చు. అయితే, మ త్రివర్గంలో చేరిన ఆరు నెలల్లో ఉభయ సభల్లో ఏదో ఒక సభకు సభ్యుడు కావాల్సి ఉంటుంది. ఇదే వెసులుబాటును అనుకూలంగా మార్చుకొని అజారుద్దీన్‌ను మంతివర్గంలో తీసుకుంది కాంగ్రెస్ సర్కార్. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అనేది సామెత. కానీ, అజార్ వ్యవహారంలో ఒక్కదెబ్బకు మూడు పిట్టలు అన్నట్లుగా అయింది. ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ద్వా రా మంత్రివర్గంలో ముస్లిం వర్గానికి ప్రాతినిధ్యం లభించింది. రెండవది, ఆరు నెలల్లో ఏదో ఒక సభకు సభ్యుడిగా కావాల్సి ఉండడంతో, శాసనమండలి తదుపరి ఎన్నికల్లో ఆయనకు కచ్చితంగా శాసనమండలి సభ్యుడిగా ఆరు నెలల్లో అవకాశం దక్కుతుంది. కాబట్టి, ఆయనకు ఆ లోటూ తీరుతుంది. మూడవది, ఈ ప్రభావం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ముస్లిం మైనారిటీ ఓటర్లపై తప్పక ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలూ చెబుతున్నాయి. ఎందుకంటే, గత ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి పోటీలో ఉన్నప్పటికీ, అజారుద్దీన్‌కు మైనారిటీ వర్గాల నుంచి సింహభాగం ఓట్లు పడ్డాయనడంలో సందేహం లేదు. ఎంఐఎంకు గతంలో 41వేలకు పైగా ఓట్లు లభించిన ఈ నియోజకవర్గంలో 2023లో 7,848 ఓట్లే పోలయ్యాయంటే అజార్ వైపే ఓటర్ల మొగ్గారనేది స్పష్టం. ఏతావాత, ఈ పరిణామం కాంగ్రెస్‌కు లాభం చేకూర్చేదేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అజార్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోవడంపై బిజెపి అడ్డుపడేందుకు చేసిన ప్రయత్నాలు, ప్రచారాలు విఫలమయ్యాయి. అంతే కాకుండా ముస్లింలలో వివిధ వర్గాలతో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుస సమావేశాలు నిర్వహించి, తమ వైపే ఉండేలా పావులు కదిపారు.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్రచార రంగంలోకి నేరుగా అడుగుపెట్టారు. ఆయన రోడ్‌షోలకు పెద్ద ఎత్తున జనాలు తరలివస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన సికిందరాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక, ఆ నియోజకవర్గంలో రూ. 4వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయనే సిఎం చెప్పిన మాట ఓటర్లను ఆలోచింపజేసింది. ఆరు గ్యారెంటీల అమలు కాలేదంటూ బిఆర్ఎస్ బాకీ కార్డుల పేరుతో ఓటర్లకు చేరువచ్చే ప్రయత్నం చేసింది. దానిని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రభావవంతంగా కౌంటర్ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో లక్ష కుటుంబాలకు సంక్షేమ పథకాలతో లబ్ది చేకూరుతుందని, సన్న బియ్యంతో పాటు పాతిక వేలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోందని, 20వేల కుటుంబాలకు రూ.500లకే గ్యాస్ ఇస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజవర్గ మహిళలకే ఇప్పటి వరకు రూ.120 కోట్లు ఆదా అయ్యాయని లెక్కలతో సహా వివరిస్తుండడంతో కాంగ్రెస్‌కు కలిసి వస్తుంది. అలాగే సెటిలర్లు కూడా పెద్ద సంఖ్యలో ఉండే ఈ స్థానంలో వారి ఓట్లను తమ వైపే పడేలా టిడిపి వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు విగ్రహాన్ని అమీర్‌పేట్ మైత్రివనం కూడలిలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు కూడా. చర్చనీయాంశంగా మారిన బిసి అంశాన్ని సానుకూలంగా మలుచుకొని కాంగ్రెస్ అభ్యర్థి స్థానికుడే కాకుండా, ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులలో ఏకైక బిసి అనే అస్త్రాన్ని ఆ వర్గాల్లో చొచ్చుకుపోయేలా ప్రచారం చేస్తున్నారు. మొత్తమ్మీద జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార బరిలో ముఖ్యమంత్రి ముందే దిగి పోటీని రసవత్తరంగా మార్చాడమే కాకుండా, మంచి మెజారిటీతో కాంగ్రెస్‌ను గెలిపించుకోవడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పావులు కదుపుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/ధన్వాడ:** ధన్వాడ మండలం కిష్టాపూర్ గ్రామంలో ఐకెపి సెంటర్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం చేశారు. కనుక రైతులు తమ యొక్క వరి ధాన్యాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేట్‌కు 2389 గ్రేట్ బి 2369 రూపాయలు అన్నారు. గ్రామాలలో రైతుల తమ వడ్లను దళారులకు అమ్మి మోసపోవద్దని అని కోరారు. అలాగే రైతులు కొనుగోలు కేంద్రాల తీసుకువచ్చేటప్పుడు తమ యొక్క ఆధార్ గుర్తింపు కార్డును బ్యాంకు పాస్ బుక్కును ఆధార్ ఉండాలి. అదే విధంగా రైతుల తమ పంట వరి అని నమోదు అని ఉన్నదో లేదో అని తమ ఏ ఈ దగ్గర సరిచూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ సదశివరెడ్డి, చిట్టెం మాధవరెడ్డి, ఏవో, ఏవో జంక్షన్ రాఘువేందర్ జిపి వెంకట్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గండి బాలరాజు, సుదర్శన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాఘవేందర్, ఎలుక బాలరాజు, జోగు కదుపయ్య, దైవం నరసింహులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు మమత, భవాని, వివోఏ చంద్రలేఖ, నందిని కొండన్న, రాయుడు, మల్లేశ్, జిపి కృష్ణ, మాసయ్య, కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట్‌లో 30 వరకు పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పీ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈనెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ నవంబర్ 30 వ తేదీ వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజల గుమిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పైకార్యక్రమాలు నిర్వహించి నిర్వాహకులపై చట్టపరమైన చర్య లు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారి పై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు.



## కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/నర్వ:** మక్తల్ నియోజకవర్గం నర్వ మండలంలోని ఉందెకోడ్ గ్రామంలో డాక్టర్ శ్రీహరి మంత్రి ఆదేశాల మేరకు, ఉందే కోడు గ్రామ అమాలిక రైతు ఉత్పత్తి దారుల కంపెనీ, వారి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా అమాలిక సంఘం చైర్మన్ జగన్నాథం మాట్లాడుతూ వరి ఏ గ్రేడ్ 2389 బి గ్రేడ్ 2369 ధర ప్రభుత్వం కల్పిస్తుందని రైతులు ఉపయోగించుకోవాలని రైతులు ఎవరు దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ అర్షియా తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, నర్వ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, ఆత్మకూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాగన్న శ్రీనివాస్, నాగన్న వివేకవర్ధన్ రెడ్డి, శరణప్ప, రాజరెడ్డి, అశోక్ గౌడ్, కొండప్ప, అమాలిక రైతు సంఘం చైర్మన్ జగనథం, డైరెక్టర్లు, అధికారులు, రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాలాజీ ప్రసాద్ ఏవోగా బాధ్యతలు



**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండల వ్యవసాయ అధికారిగా బాలాజీ ప్రసాద్ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పనిచేసిన ఏఓ మణి చందర్ బదిలీపై వెళ్లడంతో ఖాళీ అయిన స్థానంలో ఏఓగా బాలాజీ ప్రసాద్ విదుల్లో చేరారు. గతంలో కొండగల్, దౌల్తాబాద్ ఏవోగా పనిచేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా విధులు నిర్వహిస్తున్న బాలాజీ ప్రసాద్ మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

## స్మారక వారోత్సవాల్లో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** అమరవీరుల స్మారక వారసరాల్లో భాగంగా శనివారం రాజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జడ్చర్ల రూరల్ సర్కిల్ సంబంధిత మూడు మండలాల ప్రజలు, యువకులు, పోలీస్ సిబ్బంది కలిసి మొత్తం 85 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "రక్తదానం ఒక గొప్ప మానవీయ సేవ. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదు. పోలీస్ శాఖ ఎల్లప్పుడు ప్రజలకు భద్రతా కల్పించడమే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందంజలో ఉండాలి. శనివారం ఇంతమంది స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనడం చూసి ఆనందంగా ఉంది", అని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్ మండలాల ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, రాజాపూర్ ఎస్సై శివానందం గౌడ్, బాలానగర్ ఎస్సై లెనిన్, మిడ్జిల్ ఎస్సై శివ ప్రసాద్, జడ్చర్ల రూరల్ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా భద్రత – పోలీస్ బాధ్యత

### విద్యార్థుల్లో అవగాహన పెంపు దిశగా పోలీసుల చర్యలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్ ఫర్ బాయ్స్ నందు ప్రజా భద్రత పోలీసు బాధ్యత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ , ఎహెచ్‌టియు (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) సభ్యులు, షీటీమ్, కళా బృందం పాల్గొన్నారు. విద్యార్థులకు మహిళ భద్రత, సైబర్ నేరాల నివారణ, చైల్డ్ ట్రాఫికింగ్, ఈవ్ టీజింగ్, తత్తు పదార్థాల ప్రమాదాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమెన్ పి.ఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి బాధ్యతాయుత పౌరుడిగా ఎదగడం సమాజ అభివృద్ధికి కీలకం. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, చట్టవిరుద్ధ చర్యలను గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని" విద్యార్థులను ఆహ్వానించారు. కళా బృందం సభ్యులు సమాజంలో జరుగుతున్న వివిధ నేరాలపై అవగాహన కల్పించే సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

## ఎంపిడిఒ కిశోర్ కుమార్‌కు సన్మానం

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలం కున్సీ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ గ్రామ సభకు మొదటి సారి విచ్చేసిన ఎంపీడీఓ కిశోర్ కుమార్‌ను బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో గ్రూప్ 1 ఉద్యోగం సాధించి ఎంపిడీఓగా కృష్ణ మండలానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్వామినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్ బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు అలిగేరి శివా, పిట్టల ప్రభు, బిఆర్ఎస్ నాయకులు కుమ్మప్ప, రాము పింగల్ శంకర్ అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న పుడమి ఫౌండేషన్

**ప్రజాపక్షం/మక్తల్:** కచ్వార్ టోల్‌గేట్ దగ్గర మతిస్థిమితం లేని వ్యక్తి చాలా రోజుల నుండి అక్కడే ఉంటూ కనిపించడం జరిగింది. ఆ వ్యక్తి జుట్టు పెరిగిపోవడంతో పాటు సరైన బట్టలు లేకపోవడం, అశుభ్రంగా ఉండడం చూసి పుడమి ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటపతి రాజు ఆధ్వర్యంలో ఆ వ్యక్తిని శుభ్రపరిచి కొత్త బట్టలు ధరించడం జరిగింది. ఈ వ్యక్తిని హైదరాబాదులోని ఆశ్రమాలలో చేర్పిద్దామని ప్రయత్నం చేసినప్పటికీ వారిని సంప్రదించగా ఆశ్రమాలన్నీ ఎక్కువ సంఖ్యలో ఇలాంటి వారు ఉన్నారని తెలిసింది. కావున ఆశ్రమాలలో చేర్పించలేకపోయాం. పుడమి ఫౌండేషన్ మా శక్తి మేరకు మానవ సేవలో ఉంటామని తెలియజేస్తున్నాము. ఇలాంటి వారి పట్ల ఉదారభావంతో వ్యవహరించి సహాయపడాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ జె.వెంకటపతి రాజు, సభ్యులు యం. వెంకటేశ్ బాబు, కె.సురేష్, కె.లక్ష్మ ణ్, జె.నాగరాజు, జె.రమేష్, జె.తరుణ్, కె.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు

### కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశం



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** జిల్లాలో వ్యవసాయ అనుబంధాల రంగాల అభివృద్ధికి పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలుపై వ్యవసాయ పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, హార్టికల్చర్, మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఆయా రంగాల ఉత్పాదకతలను పెంచేలా అన్ని పారామిటర్స్ కూడిన డాక్యుమెంటేషన్‌కు అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఆ పథకం అమలు కోసం మన జిల్లాకు ఆ పథకం అమలు కోసం మన జిల్లాకు కేంద్రం నుంచి ఓ ప్రత్యేక (ఐఏఎస్) అధికారి వస్తున్నారని, అందరూ తమ తమ శాఖల పూర్తి వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమీక్షలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, అధికారులు సాయిబాబా, జాన్ సుధాకర్, రహమాన్, ఈశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టవిరుద్ధం



**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండలంలోని పులిమామిడి గ్రామంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం పంచాయతీ సెక్రటరీ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీసీపీఓ తిరుపతయ్య ఓఎంఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ నారాయణ తదితరులు పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో కమిటీని ఏర్పాటు చేసుకొని బాల్య వివాహాల నిషేడానికి, పిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా కాపాడటం, ఆడపిల్లలు జోగినిలు కాకుండా, బాల కార్మికులుగా కాకుండా మొదలైనవి గ్రామంలో జరగకుండా చూసుకోవలసిన బాధ్యత కమిటీపై ఉంటుంది. వివాహ వయస్సు 18పై అంతకన్నా తక్కువగా ఉంటే అందులో పాల్గొన్న వారిపై కూడా కేసు నమోదు అవుతుందని అన్నారు. మత పెద్దలు కూడా కమిటీకి సహకరించాలని అన్నారు. ఈ బాలల పరిరక్షణ కమిటీ చైర్మర్ గా ప్రత్యేక అధికారి కన్వీనర్‌గా విలేజ్ సెక్రటరీ కమిటీ సభ్యులుగా అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్, మహిళ సంఘం సభ్యురాలు, యువజన సంఘం నుంచి ఒకరు పెరెంట్స్ నుంచి ఒకరు పాఠశాల నిర్వహణ కమిటీ. పాల్గొన్నావారుయన్‌జిఓ నుంచి ఒకరు బాలా బలికల నుంచి ఒకరు కమిటీ లో సభ్యులుగా ఉంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, మత పెద్దలు పెరెంట్స్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలి

### జాయింట్ కలెక్టర్ కీమ్యా నాయక్



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండల పరిధిలో వడ్డేవాట, చర్లపల్లి, నేర్విన్, భూత్కూర్, కాణాయపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసినా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కీమ్య నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యంతో పాటు ఆరబెట్టిన పంట తడవకుండా ఉండేందుకు అన్ని కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలనీ రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు, నిర్ణీత గడువులోగా వరిధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అకాల వర్షాల కారణంగా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా, రైతును రాజు చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ ఉండేదని, ఈ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. క్వింటాలుకు 500 బోనస్ రూపాయలు ఇవ్వడం జరుగుతుందని, దేశ చరిత్రలోనే తెలంగాణ రాష్ట్రం ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. అంతేకాకుండా రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రైతు భాంధవుడు మన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, రైస్ మిల్లర్లు ఎలాంటి జాప్యం లేకుండా, మిల్లులకు వచ్చినా ధాన్యాన్ని వెంటనే దించుకొని, త్వరగా రైతుల ఖాతాలో డబ్బులు జమచేసేలా చర్యలను తీసుకోవాలని సూచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే పూర్తిస్థాయిలో తుఫాన్ నష్టాల సేకరణ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మొంథా తుఫాన్‌వల్ల సంభవించిన నష్టాలను వెంటనే శాఖలవారిగా సేకరించి అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్లు పి.అమరేందర్, దేవసహాయం,వ్యవసాయ నీటిపారుదల , పంచాయతీరాజ్, గృహనిర్మాణ, ఆర్‌అండ్‌బి, వివిధశాఖల అధికారులను ఆదేశించారు. శాఖలవారిగా జరిగిన నష్టాలను తెలియజేస్తూ వాటి పునరుద్ధరణకు అయ్యేఖర్చు అంచనాలనుకూడా పంపాలని తెలిపారు. నష్టాల అంచనాలు కచ్చితంగా ఉండాలని, ప్రత్యక్షంగా చూసి రాయాలని, వాటిఫోటోలు వీడియోలతోసహా పంపాలని తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో వివిధశాఖల జిల్లా అధికారులతో నష్టాల వివరాల సేకరణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ మండలాల వారిగా అన్నిశాఖలకు సంబంధించిన నష్టాలపై ఆరాతీశారు. తాత్కాలిక పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని, శాశ్వత పనులకోసం అంచనాలను తయారుచేసి పంపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు జిల్లాలో ఏఒక్కరికి నష్టం జరగకుండా క్షుణ్ణంగా పరిశీలించి నష్టాల వివరాలను కచ్చితంగా ప్రభుత్వం అందజేసిన ఫార్మెట్ ఆధారంగానే పంపించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటలవారిగా దెబ్బతిన్న పంటల నష్టాల వివరాలు పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు భవనాలు ఇతర ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడిలు, కళాశాలలు, వసతిగృహాలు ఇతర ప్రభుత్వ ప్రైవేట్ వ్యక్తుల దెబ్బతిన్న నష్టాలను శాఖలవారిగా అందించాలన్నారు. అంతకుముందు రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ సమావేశానికి అదనపు కలెక్టర్లు హజరై జిల్లాలో జరిగిన నష్టవివరాలను, చేపట్టిన సహాయక చర్యల కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జ్ఞానశేఖర్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ విజయ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ పార్థసారథి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి, డిఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్, జిల్లాసాంఘిక సంక్షేమశాఖ అధికారి ఉమాపతి, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



## గంజాయి బాబులు అరెస్ట్

### విచ్చలవిడిగా పెరిగిపోతున్న విక్రయాలు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని వివిధ ప్రాంతాలలో గంజాయి విగ్రహాలు జోరుగా కొనసాగుతున్నాయని ప్రత్యేక హోదా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జడ్చర్ల కమలాకర్ తెలిపారు. శనివారం నాడు జడ్చర్ల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గంజాయి బాబుల గురించి పలు విషయాలను వెల్లడించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో సోదాలు జరుపుతున్న సమయంలో జడ్చర్ల మహబూబ్ నగర్ కి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని విచారించగా హైదరాబాదులోని దూల్‌పేట నుంచి గంజాయి తెచ్చి జడ్చర్ల విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది యువకులు హైదరాబాదులోని దూళిపేట నుంచి గంజాయి ప్యాకెట్లు తీసుకువచ్చి జడ్చర్లలో యువకులకు నెరవేసి గంజాయి విక్రయిస్తున్నట్లు ఆయన వివరించారు. పట్టణానికి చెందిన అబ్బుతహేబ్ గుండు హరి ప్రసాద్ అజర్ అలీ కార్తీక్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి నుంచి 200 గ్రాములు గంజాయి ప్యాకెట్లను నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని సిఐ తెలిపారు. అదేవిధంగా జడ్చర్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించామని గంజాయ్ అమ్మకాల పై చిన్న చిన్న హోటల్లో వద్ద ప్రత్యేక పహారా నిర్వహించి అదుపులోకి తీసుకొని విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్సై మల్లేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ లైన్ దాటి ఎవరైనా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు



### డిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సరిజ్ ఖాద్రీ

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం మాజీ పర్సన్ ఇన్చార్జ్ గంజి ఆంజనేయులు చెప్పడం సరికాదని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజి ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యేను విమర్శిస్తూ మాట్లాడడం సబబు కాదన్నారు. ఒకవేళ మీకు ఏమైనా బాధ కలిగితే సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేతో మాట్లాడాలి కాని ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తరపున రెండు పర్యాయాలు కౌన్సిలర్లుగా గెలిచిన మీరు సొంత ఆస్తులను కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లో చేరినప్పుడూ మీకు పార్టీ గుర్తుకు రాలేదా అని అన్నారు. కష్టకాలంలో పార్టీ ఉన్నప్పుడూ మీరు విడిచిపెట్టి పోయారని అన్నారు. ఏ నాయకుడైనా, కార్యకర్త అయినా పార్టీ లైన్ దాటి మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని అన్నారు. సమావేశంలో నాయకులు మైత్రి యాదయ్య, రామకృష్ణ, తిరుమల వెంకటేష్, నాచ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ప్రచారంలో కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/కల్వ-కుర్తి :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి శనివారం నవీన్‌యాదవ్‌కు మద్దతుగా కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌సి ఎస్‌టి మానిటరింగ్ విజిలెన్స్ కమిటి సభ్యులు జిల్లెల రాములు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి శ్రీహరి జన్మదిన వేడుకలు







**ప్రజాపక్షం/మక్తల్:** పశు సంవర్ధక శాఖ, క్రీడా శాఖ, యువజన శాఖల మంత్రి డా.వాకిటి శ్రీహరి జన్మదినాన్ని పురస్కరించుకుని బాల్య మిత్రులు, ఆత్మీయులు మరియు అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు రక్తదాన శిబిరం మక్తల్ గవర్నమెంట్ హాస్పిటల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథైన మంత్రి మాతృమూర్తి రాములమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం జన్మదినం సందర్భంగా కేకులు, శాలువాలు కంటే ప్రజాసేవ, ప్రజల ఆరోగ్యం ముఖ్యం అనే నినాదం అన్న ఇవ్వడం దాన్ని అనుసరిస్తూ పెద్ద ఎత్తున మక్తల్ మండలంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదినంను సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ మక్తల్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. దాదాపు 50 మందికి పైగా బాలింతలకు పండ్లు బ్రెడ్ అందించినట్లు అధ్యక్షులు సత్య ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ ఆడెం సత్యనారాయణ, కోశాధికారి అంజన్ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ మామిళ్ల పృథ్వీరాజ్, సీనియర్ లయన్ సభ్యులు, డా.శ్రీరామ్, గవినోళ్ల జైపాల్‌రెడ్డి, అంబాదాస్‌రావు, శరణప్ప, డా.రాజేష్ గౌడ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ మక్తల్ మండలం మంత్రి డా.వాకిటి శ్రీహరి జన్మదినం సందర్భంగా మక్తల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి భాస్కర్ ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జన్మదిన సందర్భంగా మక్తల్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట సురేష్, కొల్ల వెంకటేశ్, వాకిటి శ్యామ్ గణేష్ కుమార్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వేణుగౌడ్, వాకిటి రాజు, వాకిటి ప్రవీణ్, బ్యాగరి సురేష్, నాదర్ హుస్సేన్, నవీద్, శివకుమార్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మాగనూర్:** మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను శనివారం మాగనూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మాగనూరు మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో పూజలు చేసిన అనంతరం మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్లు, పండ్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎక్స్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మక్తల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాకిటి శ్రీనివాసులు, శివరామ్ రెడ్డి, వడ్వాట్ రవీందర్, ఎక్స్ ఎంపిటిసి నేరేడుగం మౌలాలి, ఉజ్జలి కృష్ణయ్య, వడ్వాట్ రాములు, సాయిగన్నోల మారెప్ప, సర్పంచు రాజు, గాదె నరసింహరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దండు ఆనంద్, టప్ప రమేష్, గడ్డం నరేష్, కోల్పూర్ రాము, దండు వంశీ, పుర్రె రవి, దండు దత్తు బొంబాయి కృష్ణ, ఇడ్లూర్ సంజీవ్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కృష్ణ :** మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు సందర్భంగా సోమవారం కృష్ణ మండల కేంద్రంలోని స్థానిక క్షీరలింగేశ్వర మఠంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సర్ఫరాజ్ ఆధ్వర్యంలో పూజ లు చేసి అనంతరం కేక్ కట్ చేసి మంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్, నాయకులు పల్లె సురేష్, సంతోష్



పాలిట్ సహకారంతో మండలంలోని హిందూపూర్, కుసుమూర్తి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. షిరిడి సాయిబాబా ఆలయం నందు కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాసులు, నియోజకవర్గ నాయకులు తులసి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బంగారు భాస్కర్, గాడి కృష్ణమూర్తి, గడ్డం కృష్ణ కాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో శనివారం మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు జట్టం లక్ష్మయ్య, నీరటి రామచంద్రయ్య, చిట్టెం మాధవరెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో పల్టీ... విద్యార్థులకు గాయాలు

**ప్రజాపక్షం/నూతనకల్ :** ఆటో పల్టీ కొట్టి ముగ్గురు విద్యార్థులకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల మండలం చౌళ్ళతండ నుంచి విద్యార్థులను మండల కేంద్రంలోని విజయమేరి పాఠశాలకు తీసుకొని వస్తూ ఉండగా మండల కేంద్రంలో సూర్యాపేట దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన వ్యక్తిని తప్పించబోయి ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి లావుడ్య యశ్వంత్, 5వ తరగతి విద్యార్థి మనీషాతో పాటు మరో విద్యార్థికి గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులకు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం పాఠశాల యాజమాన్యం 108 వాహనంలో సూర్యాపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ కోదాడ:** ప్రజాసంక్షమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో కల్యాణలక్ష్మి, షాధిమూబారక్ చెక్కుల పంపిణీ ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజవర్గ వ్యాప్తంగా 192 మంది లబ్దిదారులకు ఒక కోటి, 93 లక్షల రుపాయల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. అనంతగిరి మండలం 28 మందికి, చిలుకూరు మండలానికి 22 మంది, కోదాడ మండలానికి 72 మందికి, మునగాల మండలానికి 16 మందికి, నడిగూడెం మండలానికి 43 మం దికి, మోతే మండలానికి 11 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.



## తడిసిన పత్తిని కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** మొంథా తుఫాను సమయంలో తడిసిన, రంగు మారిన పత్తిని సిసిఐ అధికారులు కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలు విషయంపై స్థానిక సిసిఐ అధికారులకు పార్టీ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కొనుగోలు నిభందనలను సడలించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. నాణ్యత, తేమ శాతం పేరుతో పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం చేసి వారికి ఆర్థిక నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని శ్రవణ్ కుమార్ కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి ఎండి అక్బర్, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, అంజయ్య పాల్గొన్నారు.

## జూదం ఆడిన ఐదుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్కటపల్లి గ్రామం శివారులో జూదం ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో చోటుచేసుకుంది. అదే రోజు రాత్రి 9 గంటలకు కేసు నమోదు చేసినట్లు వలిగొండ ఎస్ఐ వి.యుగేందర్ తెలిపారు. పోలీసుల ప్రకారం, విశ్వసనీయ సమాచారం మేరకు పబ్బు శంకరయ్య అనే రైతు భూమిలోని గూడెంలో ఐదుగురు వ్యక్తులు డబ్బులు పెట్టి కార్డులు ఆడుతూ జూదంలో పాల్గొంటున్నట్లు గుర్తించారు. అరెస్టైన వారు అకుల మహేందర్(37), ఎర్పుల శ్రీశైలం (36), మీసాల శేఖర్ (30), రాసని దేవ (39), మీసాల ప్రసాద్ (29) వీరంతా వర్కటపల్లి గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. పోలీసులు అక్కడ నుంచి రూ.2,430 నగదు, ఒక సెటు ప్లేయింగ్ కార్డులు, ఐదు మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుండి స్వీకరించిన ఒప్పంద ప్రకటనలు (Confessions) మరియు స్వాధీనం చేసిన వస్తువుల ఆధారంగా, పోలీసులు క్రైమ్ నంబర్ 336/2025 కింద సెక్షన్ 3 & 4, తెలంగాణ గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

## ప్రజలకు అందుబాటులో పోలీసులు

నేరేడుగొమ్ము పోలీస్‌స్టేషన్ సందర్శించిన ఎఎస్‌పి మౌనిక



**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం నేరడుగొమ్ము పోలీస్ స్టేషన్‌ను శనివారం ఏఎస్పి మౌనిక సందర్శించారు. ఈసందర్భంగా ఆమె పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి, త్వరితగతిన కేసులను పరిష్కరించాలని సూచించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి వినాయక నిమజ్జనం సందర్భంగా బందోబస్తులో పాల్గొన్న పోలీస్ వాలంటీర్లను అభినందించి ప్రశంసా పత్రాలు, షిల్డ్‌లను అందజేసి వారిని ఉత్తేజ పరిచారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు ఎల్లప్పడు అందుబాటులో ఉంటూ గ్రామాలలో ఎక్కడ సమస్య అని తెలిసిన వెంటనే వాటిని పరిష్కరించే విధంగా ముందుకు సాగాలని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని, గంజాయి వంటి మత్తు పదార్థాలను ఎవరైన రవాణా చేస్తూ తమకు సమాచారం అందించాలని తెలిపారు. వైజాగ్‌కాలనీ వెళ్ళే పర్యటకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అవసరం ఉన్న చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, ప్రమాదాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిఐ బీసన్న, ఎస్ఐ నాగేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రిప్ సేద్యానికి 90శాతం సబ్సిడీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పండ్ల తోటల సాగుకు డ్రిప్ సేద్యానికి 90శాతం సబ్సిడి ఉద్యానవన శాఖ ఇవ్వనున్నట్లు ఆ శాఖ డివిజన్ అధికారి నసీమామెహరిన్ తెలిపారు. శనివారం మండలంలోని నందిపాడు వినత్తనాభివృద్ధి సంస్థ క్షేత్రం , ఐలాపురం గ్రామాల్లో నిమ్మ తోట సాగుకు ధరఖాస్తు చేసుకున్న వారి భూములను సాగుకు అనుకూలంగా ఉన్నాయా లేవా అని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ నందిపాడు ఫారంలోని రెండు ఎకరాల్లో, ఐలాపురం గ్రామంలో గాదె వాగ్దేవి ఆరు ఎకరాల్లో నిమ్మతోట వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని ఆయా క్షేత్రాల్లో భూముల సారం, నీటి లభ్యత పరిశీలించామన్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీయాలని కోరారు. ఎరువులు వాడే విధానం, మొక్కలు నాటే పద్ధతి రైతుకు వివరించామన్నారు. నందిపాడు సీడ్ ఫారంలో 20 ఎకరాల ఆయిల్ ఫామ్ తోటను పరిశీలించి సలహాలు చేశామన్నారు.

## గాంధీజీ ఫౌండేషన్ సేవలు అమోఘం

**ప్రజాపక్షం/చండూరు :** రెండు సంవత్సరముల వరకు ప్రతినెల 30మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ,గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు 2024 జనవరి ఒకటవ తేదీన ప్రారంభించ గాంధీజీ ఫౌండేషన్ నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక గాంధీజీ విద్యా సంస్థల యందు 23వ నెల పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చండూరు మండల విద్యాధికారి ఊట్కూరి సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ భగవంతుడు ఎవ్వరికి ప్రత్యక్షంగా కనబడడని ,సహాయం చేసే వ్యక్తులలోనే భగవంతుడు ఉంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యా సంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్ ,పులిపాటి రాధిక,కందుల కృష్ణయ్య, బుషిపాక యాదగిరి, బోడ విజయ్ ,గోపి తదితరులు పాల్గొన్నారు.



# శిశు విక్రయాలు, బాలికలపై లైంగిక దాడులు సిగ్గుచేటు

శిశు విక్రయాలు జరిగితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తప్పవు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఎక్కడైనా శిశు విక్రయాలు జరిగితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు.ఆడబిడ్డను కాపాడుకోవడంలో భాగంగా జిల్లాలో శిశువిక్రయాలు, బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక దాడుల వంటివి జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని సంక్షేమ శాఖల అధికారులు ఆర్‌సిఓలు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జిల్లాలో ఎక్కడ శిశు విక్రయాలు జరగకుండా, అలాగే బాల్య వివాహాలు,హాస్టల్ విద్యార్థులపై లైంగిక దాడులు వంటివి జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో ఇటీవల శిశువిక్రయాలు,బాల్య విద్యార్థులపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు, తదితర సంఘటనల నేపథ్యంలో శనివారం ఆమె తన చాంబర్లో సంక్షేమ అధికారులు, ఆర్‌సిఓలతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి చెందిన సమాజంలో ఇంకా శిశు విక్రయాలు, బాలికలపై లైంగిక దాడుల వంటివి జరగడం సిగ్గుచేటని అన్నారు. అన్ని శాఖలు ఈ విశయాలపై క్షేత్ర స్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, బిడ్డలను కన్న ఏ తల్లి దండ్రులు శిశువులను అమ్మడం ,దత్తత ఇవ్వడం వంటివి చేయకుండా ఉండాలని కోరారు. వచ్చేవారం సిడిపిఓలు,సూపర్‌వైజర్లతో ఈ విషయంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు మండలాలలో అన్ని పాఠశాలలు ,కేజీబీవీలు,రెసిడెన్షియల్ స్కూళ్లను తిరిగి ఎక్కడ ఎలాంటి సంఘటన జరగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి, గృహనిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్,సాంఘిక సంక్షేమ డిడి శశికళ,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, జిల్లా ఉప వైద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి తదితరులు ఉన్నారు.

**సెట్విన్ ఆధ్వర్యంలో శిక్షణ :** సెట్విన్ ఆధ్వర్యంలో చదువుకున్న యువత, విద్యార్థులకు వివిధ కోర్సులలో శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రత్యేకించి విద్యార్థినులకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్య పూర్తయిన తర్వాత వెంటనే ఉద్యోగ అవకాశాలు లభించేలా ఒక ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. శనివారం ఈ విషయంపై సెట్విన్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో తన ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు.అంతకుముందు సెట్విన్ ప్రతినిది రేణుక మాట్లాడుతూ చదువుకున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సాంకేతిక నైపుణ్యం ఉంటే జీవితంలో రాణించడానికి అవకాశం ఉందని,సెట్విన్ ద్వారా సుమారు 30 కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, తమ శిక్షణ కాలం కేవలం మూడు నుండి ఆరు నెలలు మాత్రమే ఉంటుందని, దీని ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డిప్లమా సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/ఆలేరు :** భారత కమ్యూనిస్టు పార్టీ పున్నబోయిన రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ అకాల వర్షాలతో తుపానుతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని పంటను అంచనా వేయాలని అదేవిధంగా పత్తి, వరి నష్టమైన పంటలను కొనుగోలు చేసి రైతులకు ఆదుకోవాలని పిలుపునిచారు. ఈ నెల 6న ఆలేరు మండలంలో యాదాద్రి భువనగిరి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే కౌన్సిల్ సమావేశానికి సభ్యులు హాజరు కావాలని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, సిపిఐ టౌన్ కార్యదర్శి పొట్టిపౌన శ్రీనివాసరాజు, ఏఐటియుసి సివిల్ సప్లై జిల్లా అధ్యక్షులు హమాలి సంఘం అధ్యక్షుడు పల్లె శీను, సామి, నర్సింహులు పాల్గొన్నారు.




# తూకంలో మోసం జరిగితే సహించేదిలేదు

తేమశాతంతో పరిమితి లేకుండా వడ్లను కొనుగోలు చేయాలి

సిపిఐ, రైతు సంఘం నేతల డిమాండ్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో పిఎస్‌సిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఐ, రైతు సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో జరుగుతున్న మోసాలను సిపిఐ నాయకులు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒక్కో బస్తా 40 కిలోల 600 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా 41 కిలోల పైగా తూకం వేయడం పట్ల వారు ఆగ్రహించారు. తూకంలో రైతులను మోసం చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారిని పావని వచ్చి తూకంలో తేడాలను సవరించాలని ఆదేశించారు. ఉన్నత అధికారుల సమాచారం తెలుసుకున్న తర్వాత తేమ శాతం ఉన్న ధాన్యాలను కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, రైతు సంఘం సీనియర్ నాయకుడు తోకల రాంరెడ్డి, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు పల్లె మల్లారెడ్డి, నల్లవెల్లి ముత్యాలు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు సుర్వి నరసింహ, వీరమల్ల యాదయ్య, మంచాల జంగయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, పట్టణ సిపిఐ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, పల్లె గోపాల్ రెడ్డి, పబ్బు మారయ్య, పల్లె రాములు పాల్గొన్నారు.



## రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వం చేతకాని తనం ఓ వైపు, ప్రకృతి ప్రకోపం ఓ వైపు తో అన్నదాతలు బలైయ్యారని మాజీమంత్రి గుంట కండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు.శనివారం నల్లగొండ మండల పరిధిలోని ఆర్జాలబావిలో గల ఐకెపి కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ధాన్యాన్ని పరిశీలించి, రైతులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా మంత్రులు కమిషన్లు, సంపదన మీదనే దృష్టి సారించారని అదేవిధంగా విదేశీ టూర్ల ల్లో జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. వారి దృష్టి అంత దోచుకోవడం మీదనే ఉన్నదని రైస్ మిల్లర్ల వద్ద కోట్ల రూపాయలు లంచాలు మింగి వారికి సాగిల పడ్డారన్నారు. మంత్రులు, మిల్లర్లు రైతులను పిక్కు తింటున్నారని ఎక్కడ చూసినా మొలకలు వచ్చిన డాన్యం కనబడుతుందని పత్తి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్ట మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్,పట్టణ పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, మాజీ జెడ్పిటిసిలు తండు సైదులు గౌడ్,తుమ్మల లింగస్వామి,మాజీ ఎంపీపీ బొజ్జ వెంకన్న ఉన్నారు.

# సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమం : ఎఐటియుసి

**ప్రజాపక్షం/డిండి:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం కార్మికులు ఉద్యమాలను తీవ్రతరం చేయాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ఖానాపూర్‌లో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశానికి ముఖ్యఅతిధిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన క్లెమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు తాకట్టుపెట్టిన ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేయడం బాధాకరమన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకి బీమా పేరుతో 250 కోట్లు అప్పజెప్పడం దుర్మార్గం అని ఆరోపించారు. రాష్ట్రంలో 15లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదు అయి ఉన్నారని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు క్లెమ్‌లు, బీమా కంపెనీల అగ్రిమెంట్‌లు వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. వివాహ కానుక, ప్రసూతికి రూ. 50వేలు, సహజ మరణానికి రూ. 2లక్షలు, ప్రమాదవాశాత్తు మరణానికి రూ. 10లక్షల కు పెంచి ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా కాకుండా పాత పద్దతిలోనే ఇవ్వాలని, తంబు విధానాన్ని రద్దు చేసి పాత పద్దతినే కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎలిమినేటి దేవయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్, జైపాల్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా తాటికొండ శ్రీను, ఉపాధ్యక్షులుగా శ్రీను, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, సహాయ కార్యదర్శులుగా సైదమ్మ, దుర్గమ్మ, కోశాధికారిగా సైదులు, 12 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.




## నేత్రదానం మానవత్వానికి చిహ్నం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రతి ఒక్క నేత్రదానం ఇద్దరి నుండి నలుగురు కార్నియల్ అంధులకు కంటిచూపును అందిస్తుందని నేత్రదానానికి వయస్సుతో సంబంధం లేదని కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారు బీపీ షుగర్ థైరాయిడ్ మొదలకు సమస్యలతో బాధపడుతున్న వారు కూడా నేత్రదానం చేయించవచ్చని మేనేజర్ డాక్టర్ పుల్లారావు తెలిపారు. పట్టణంలోని పెద్ద బండ ప్రాంతానికి చెందిన చింతల మారమ్మ,శాంతినగర్ ప్రాంతానికి చెందిన బోధనపు వెంకట్ రెడ్డి,వేములపల్లి మండలం, ఎరుకల గుట్ట గ్రామానికి చెందిన పల్లా సైదయ్య వేరు వేరుగా స్వర్గస్తులైనారు. వీరి బంధువులు,కుటుంబ సభ్యుల సహకారంతో ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో టెక్నీషియన్ రమేష్‌చే నేత్రదాన సేకరించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రోడ్డు ప్రమాదాలు ఏ సమయంలో ఎక్కువ జరుగుతున్నాయి, ఎలాంటి సందర్భాల్లో జరుగుతున్నాయని అధ్యయనం చేసి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ పోలీస్ అధికారులకు ఆదేశించారు. రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా శనివారం జాతీయ రహదారి 65పై గల, ఖమ్మం జాతీయ రహదారిపై మలుపు, రాయినిగూడెం, పిల్లలమర్రి జంక్షన్, కొత్తమార్కెట్ రోడ్డు జంక్షన్, ఎఫ్‌సిఐ గోదాం వద్ద రోడ్డు ప్రమాద స్థలాలు, బ్లాక్ స్పాట్స్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఎస్‌పి పరిశీలించారు. రోడ్డు అథారిటి అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ ప్రమాద స్థలాలను నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్‌స్పాట్స్ వద్ద, మూలల వద్ద, గ్రామాల వద్ద హెచ్చరిక బోర్డులను, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలను అధ్యయనం చేసి ఇంజనీరింగ్ లోపాలను సవరించాలని, లైటింగ్ ఏర్పాటు చేయడం, సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, వేగ నియంత్రణ పాటించడం, పొదలు తొలగించడం, డ్రింకింగ్ లైట్స్ పెట్టించడం లాంటి చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కమిటిలు ప్రమాదాల నివారణకు పటిష్టంగా కృషి చేయాలని ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసన్నకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రూరల్ సిఐ రాజశేఖర్, పట్టణ సిఐ వెంకటయ్య, ఎస్‌ఐలు బాలు నాయక్, శివతేజ, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై వాహనదారుల అవస్థలు

వర్షం నీటితో రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు మునక

నాలుగు రోజులుగా చిట్యాలలో ట్రాఫిక్ జామ్



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో జాతీయ రహదారిపై గత నాలుగు రోజులుగా వాహనదారులు ఒక వైపు, ట్రాఫిక్ సమస్యతో పట్టణ ప్రజలు మరో వైపు తీవ్ర అవస్థలకు గురౌతున్నారు. పట్టణంలో జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ పనులతో ఇరువైపుల రోడ్లు ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, గత నాలుగు రోజుల క్రితం కురిసిన మొంథా తుఫానుతో పట్టణంలోని పోతురాజు కుంటకు సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి కిందికి వరద నీరు చేరి మోకాలు లోతు నిల్వ ఉంటుండటంతో రహదారిపై హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్ళే ప్రయాణం చేసే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. బ్రిడ్జి క్రిందకు కుంట నుండి నీరు వరద రూపంలో చేరుతుండటంతో వాహనాలు అతి నెమ్మదిగా కదులుతున్నాయి. దీంతో జాతీయ రహదారిపై సుమారు 6 కిలోమీటర్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. పట్టణంలో ఫ్లైఓవర్ పనుల కారణంగా మామూలుగానే పట్టణ ప్రజలు అనేక ట్రాఫిక్ సమస్యలతో సతమతమౌతుండగా రైల్వే బ్రిడ్జి కింది నుండి వాహన రవాణ వ్యవస్థ స్థంబించిపోతుండటంతో వారి కష్టాలు రెట్టింపయ్యాయి. అధికారులు ట్రాఫిక్ సమస్యలపై వెంట వెంటనే స్పందిస్తే కొంత మేరకైన వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలిగిపోయే అవకాశాలుంటాయి. తమకు ఎదురౌతున్న సమస్యలను తొలిగించే చర్యలు వెంటనే చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

## రాజయోగ శిక్షణతో విద్యా వ్యవస్థలో అద్భుతాలు

బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో విద్యావేత్తల సదస్సు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** సమాజానికి మూల స్తంభం అయినటువంటి విద్యా వ్యవస్థలో నైతిక విలువలు, రాజయోగ శిక్షణ ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని సైలెన్స్ రీ ట్రీట్ సెంటర్ డైరెక్టర్లు బి కే రాజకుమారి బికే సునీత పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మహదేవ్పూర్ గ్రామంలో గల బ్రహ్మకుమారి సైలెంట్ రీ ట్రీట్ సెంటర్‌లో వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సర్ విద్యావేత్తల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి సైలెన్స్ ట్రీట్ సెంటర్ నిర్వాహకులు మాట్లాడుతూ పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి కారణంగా అనేక రుగ్మతలు తలెత్తుతున్నాయని, దీనిని నివారించేందుకు ధ్యాన సాధన, నైతిక విలువలపై శిక్షణ చక్కని పరిష్కార మార్గాలు అవుతాయని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. బ్రహ్మ కుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల నుంచి ప్రొఫెసర్లు, అధ్యాపకులు ఇందులో పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఆలోచన శక్తిని, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించడం కోసం ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమంలో ప్రాక్టికల్ యాక్టివిటీల ద్వారా మెలకువలు నేర్పించారు. ఈ సదస్సులో మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఉస్మానియా వర్సిటీ మాజీ వీసీ టి.తిరుపతి రావు, ఉస్మానియా, అనురాగ్ వర్సిటీల మాజీ వీసీ ఎస్.రామచంద్రం,'రాజయోగ థాట్ ల్యాబ్'శిక్షకులు బి.కె.మూఖేష్, బి.కె.చిత్ర, బి.కె.సుప్రియ, వివిధ కాలేజీల డీన్‌లు, లెక్చరర్లు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## దక్షిణాఫ్రికాను తేలికగా తీసుకోం..

### ఫైనల్లో కూల్‌గా ఆడుతాం!



వరల్డ్ కప్ ఛాంపియన్ అనిపించుకునేందుకు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న భారత జట్టుకు సువర్ణావకాశం. స్వదేశంలో ట్రోఫీని ముద్దాడే సందర్భం వచ్చేసింది. ఆదివారం ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడిస్తే విశ్వవిజేతగా టీమిండియా అవతరించనుంది. ఆస్ట్రేలియాను చిత్తు చేసిన ఉత్సాహంతో టైటిల్ పోరులోనూ విజయంపై కన్నేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన అంతకంటే ముందు ఒత్తిడిని జయించాల్సి ఉంది. సొంత ప్రేక్షకుల సమక్షంలో బిగ్ ఫైట్‌కు సిద్ధమవుతున్న కెప్టెన్ మీడియా సమావేశంలో తమ వ్యూహం గురించి మాట్లాడింది. అదే సమయంలో సఫారీలను తేలికగా తీసుకోమని ఆమె స్పష్టం చేసింది. 'ప్రపంచ కప్‌ను భారీ ఓటమితో ఆరంభించిన దక్షిణాఫ్రికా ఆ తర్వాత గొప్పగా ఆడింది. వరుస విజయాలతో సెమీస్ చేరుకుంది. మెగా టోర్నీలో సఫారీల ప్రదర్శన అద్భుతమని చెప్పాలి. అంతేకాదు వాళ్లది సమతూకంతో కూడిన జట్టు. పటిష్టమైన బౌలింగ్ దళమే కాదు.. లోయర్ ఆర్డర్లోనూ చెలరేగిపోయే బ్యాటర్లు ఉన్నారు. మా జట్టులోనూ అనేక సానుకూల అంశాలున్నాయి. రేపు జరుగబోయే ఫైనల్ ఆసక్తిగా ఉండనుంది. బిగ్ మ్యాచ్ కోసం మేము మానసికంగా, శారీరకంగా సిద్ధమవుతున్నాం. రేపు మేము గొప్ప ప్రదర్శన చేసి..మ్యాచ్‌ను ఎంజాయ్ చేస్తామని ఆశిస్తున్నా. అయితే.. ముంబై ప్రేక్షకులు ఎంతో మద్దతిస్తున్నారు. స్వదేశంలో వరల్డ్ కప్ ఆడడం అనేది ఎన్నో భావోద్వేగాలతో కూడుకున్నది. అదే సమయంలో..రేపటి మ్యాచ్ మా అందరికి ఎంతో ముఖ్యమైంది. న్యూజిలాండ్ ఆస్ట్రేలియా ఆడినట్టే సమిష్టిగా రాణించాలని భావిస్తున్నాం. అందుకు అవసరమైన ఫోకస్ కోసం డ్రెస్సింగ్ రూమ్‌లో సెషన్స్ నిర్వహించాం. కెప్టెన్‌గా వరల్డ్ కప్ ఫైనల్ ఆడడం నాకు గొప్ప విషయం. చిన్న చిన్న లక్ష్యాలతో ముందుకు సాగితే.. పెద్దవి కూడా సాధ్యమవుతాయి. ఇదే సూత్రాన్ని జట్టు సభ్యులకు చెబుతున్నా' అని పేర్కొంది కౌర్.

## హాఫ్ సెంచరీతో చెలరేగిన పంత్..

### గెలుపు ముంగిట టీమిండియా!



గాయం నుంచి కోలుకున్న రిషభ్ పంత్ ఫామ్ చాటుకున్నాడు. దక్షిణాఫ్రికా ఏ బౌలర్లను ఉతికేసిన అతడు భారత ఏ జట్టును గెలుపు వాకిట నిలిపాడు. బెంగళూరులోని సీఈవో మైదానంలో జరుగుతున్న అనధికారిక టెస్టులో బంతితో తనుష్ కొతియాన్(4–26) ప్రత్యర్థిని దెబ్బకొట్టగా.. పంత్ హాఫ్ సెంచరీ(64 నాటౌట్)తో చెలరేగారు. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో పట్టుబిగించే అవకాశాన్ని కోల్పోయిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో గొప్పగా పుంజుకొని మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరుకుంది. చివరి రోజున మరో 156 పరుగులు చేస్తే రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో బోణీ కొట్టడం ఖాయం.

స్వదేశంలో జరుగుతున్న అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు గెలుపు దిశగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకున్న టీమిండియా.. మూడో రోజు ప్రత్యర్థిని కుప్పలకూల్చింది. ఓవర్‌నైట్ స్కోర్ 30/0తో ఇన్నింగ్ ఆరంభించిన దక్షిణాఫ్రికా ఏ జట్టుకు తనుష్ కొతియాన్ (4–26), అన్షుల్ కంభోజ్(3–39)లు షాకిచ్చారు. వీరిద్దరూ హడలెత్తించగా 199కే కుప్పకూలింది. ఓపెనర్ లెసెగో సెనొక్వెనె(37), జుబయిర్ హంజా(37)లు టాప్ స్కోరర్లు. కాసేపటికి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టు 32కే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(64 నాటౌట్) తనదైన స్టయిల్లో రెచ్చిపోయాడు. అజేయంగా నిలచిన పంత్ నాలుగో రోజు దంచేశాడంతో లంచ్‌లోపే మ్యాచ్ ముగిసే అవకాశముంది.

**తొలి వికెట్‌కు 91 రన్స్**

తొలి ఇన్నింగ్స్‌లో తనుష్ కొతియాన్(4–83), గుర్నూర్ బ్రార్(2–45)ల విజృంభణతో సఫారీ టీమ్ 309కి ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సాయి సుదర్శన్(32), ఆయుశ్ మాత్రే(65)లు శుభారంభం ఇచ్చినా మిగతావాళ్లు స్వదినియోగం చేసుకోలేకపోయారు. పేసర్లను దీటగా ఎదుర్కొన్న ఓపెనర్లు తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించారు. కానీ, సఫారీ స్పిన్నర్ సుబ్రయేన్(5–61) కీలక వికెట్లు తీసి దెబ్బకొట్టాడు. గాయం నుంచి కోలుకొని కెప్టెన్‌గా ఆడుతున్న రిషభ్ పంత్(17) స్వల్ప స్కోర్‌కే సెలే ఓవర్లో ఔటయ్యాడు. ఆ తర్వాత ఆయుశ్ బదొని(38).. తనుష్ కొతియాన్(13)లు కుదురుకున్నా పెద్ద స్కోర్ చేయలేకపోయారు. దాంతో. 234కే టీమిండియా ఆలౌటయ్యింది.

వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఆదివారం డీవై పాటిల్ స్టేడియంలో భారత్, దక్షిణాఫ్రికాలు తొలి కప్ కోసం అమీతుమీకి సిద్ధమవుతున్నాయి. 'కొత్త ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించేది ఎవరు?' అనే ప్రశ్నకు ఇరుజట్ల కెప్టెన్లు 'మేమే' అంటున్నారు. అయితే.. ఫైనల్లో తమ కంటే టీమిండియాపైనే ఒత్తిడి ఎక్కువని చెబుతోంది సఫారీ కెప్టెన్ లారా వొల్వార్డ్ వెల్లడించింది.

## ప్రపంచకప్ విజేతలుగా నిలుస్తాం..



**భారత ప్రేక్షకులను నిశబ్దంలోకి నెట్టెస్తాం!**

శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన తను టైటిల్ పోరు కోసం తాము ఎక్కువగా ఆలోచించడం లేదని చెప్పింది. 'మేము మొదటిసారి వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఆడుతున్నాం. అలాఅనీ మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచించడం లేదు. గతంతో సంబంధం లేకుండా కొత్తగా మా ప్రయాణాన్ని మొదలుపెట్టాలని భావిస్తున్నాం. నిజం చెప్పాలంటే భారత జట్టుపైనే ఒత్తిడి ఎక్కువ. ఎందుకుంటే.. దేశం మొత్తం వాళ్లకు మద్దతుగా ఉంది. స్టేడియంలోని ప్రేక్షకులంతా టీమిండియా గెలవాలని కోరుకుంటారు. కాబట్టి మేము కూడా ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తరహాలో కప్ గెలిచి భారత ప్రేక్షకులను నిశబ్దంలోని నెట్టాలని అనుకుంటున్నాం. కానీ, అందుకు మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది' అని లారా వెల్లడించింది.

# ఫోకస్




## ఎఐ స్టాక్స్‌దే భవిష్యత్తు!

**నిపుణుల అంచనా..**

**ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని సూచన**

ఇది కృత్రిమ మేధస్సు (ఎఐ) యుగం. ఎవరి ఊహకు అందని రీతిలో విస్తరస్తున్న ఎఐ పట్ల చాలా కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. కొన్ని ఇప్పటికే ఎఐ సాంకేతికతను అందిపుచ్చుకొని, మరింత విస్తరస్తుండగా, మరికొన్ని కంపెనీలు అత్యధిక ప్రాధాన్యమిచ్చి, విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రపంచ వ్యాప్తంగా ఎఐ కంపెనీల స్టాక్స్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మంచి లాభాలు ఆర్జించి పెడతాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



అయితే, తొందరడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదని, ఆచితూచి వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఎన్‌విడియా వంటి కంపెనీలు గత కొద్ది నెలల్లో అద్భుతమైన పెరుగుదలను నమోదు చేశాయి. ఎన్‌విడియా ఐదు ట్రిలియన్ల మార్కెట్ క్యాప్‌తో ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. బంగారం తర్వాత ఈ కంపెనీ షేర్లను విలువైన ఆస్తిగా గుర్తిస్తున్నారు. స్టాక్ ధరలు పెరుగుతున్నందున, మార్కెట్లో కొంత భయం, సందేహాలు కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సెమీకండక్టర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఇప్పటికే చాలా కంపెనీలు తమ ఎఐ ప్రోడక్ట్ ప్లాన్స్ ప్రకటించాయి. ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ అల్ఫాబెట్ వంటి గ్లోబల్ దిగ్గజాలు ఎన్‌విడియా తరువాత ఎఐ రంగంలో బలమైన పోటీనిస్తున్నాయి. ఈ మూడు కంపెనీల కలిపి మార్కెట్ క్యాప్ 11.33 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ. ప్రపంచంలో అగ్ర ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా ఎఐ అభివృద్ధిలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇటీవల డొనాల్డ్ ట్రంప్, క్జీ జిన్‌పింగ్ సమావేశంలో కూడా ఈ విషయం చర్చకు వచ్చిందని అంటున్నారు. ఎఐ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న కాబట్టి, ఈ రెండు దేశాల నుంచి పెద్ద మొత్తంలో పెట్టుబడులు వస్తున్నాయి. ఎఐ స్టాక్‌లు ఇన్వెస్టర్లకు భారీ లాభాలను ఇచ్చాయి. ఎన్‌విడియా మాత్రమే గత ఆరు నెలల్లో 100 శాతానికి విలువను పెంచుకుంది. వెస్టెడ్ ఫైనాన్స్ సిఇఒ విరం షా అభిప్రాయం ప్రకారం, 2026 వరకు గ్లోబల్ ఎఐ మార్కెట్ ఖర్చులు 300 బిలియన్ డాలర్లు దాటే అవకాశం ఉంది. ఎఐ చిప్స్, క్లౌడ్ సామర్థ్యం, ఎంటర్‌ప్రైజ్ టూల్స్ డిమాండ్స్ పెరుగుతున్నందున, లాభాలు ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అందుకే ఇన్వెస్టర్లు కూడా సుముఖత వ్యక్తం చేస్తున్నారు. 2030 నాటికి ఎఐ రంగం వల్ల ప్రపంచ జిడిపికు 15 ట్రిలియన్ల డాలర్లు జతకలుస్తాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వాదనకు బలాన్ని చేకూర్చే విధంగా ఎఐ స్టాక్ విలువలు అభివృద్ధిని కనబరుస్తున్నాయి. మరిన్ని కంపెనీలు రంగంలోకి వస్తున్నప్పుడు, నియంత్రణలు మారినప్పుడు, మార్కెట్ ఒడిదుడుకులు ఎక్కువ కావచ్చు. అందుకే, డిమాండ్ పెరుగుతుందనే సూచనలు కనిపిస్తున్నప్పటికీ, జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## బంగారం ధరలు తగ్గే అవకాశం!



బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలకు రెక్కలు రావడంతో, సామాన్యుడు డీలాపడిపోతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో, పసిడి ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయన్న వార్త కొంత ఊరటనిస్తున్నది. బంగారం ధరలు ఈ వారం చివరిలో కూడా అస్థిరంగానే ఉండడం ఈ వాదనను బలపరుస్తున్నది. జాతీయ మీడియాలో వస్తున్న నివేదికలు, నిపుణుల అంచనాలు, విశ్లేషకుల అభిప్రాయాలను అనుసరించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు క్జీ జిన్‌పింగ్ మధ్య వాణిజ్య చర్చలు సఫలం కావడం హర్షణీయ పరిణామం. చైనా నుంచి దిగుమతయ్యే వివిధ వస్తువులపై సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడం సానుకూల వాతావరణాన్ని సూచిస్తున్నది. ఈ సమావేశం అనంతరం, ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ అధిక వడ్డీ రేట్లపై బలమైన సంకేతాలు ఇస్తున్నది. ఈ పరిణామాల ప్రభావంతో బంగారం ధరలు దిశ తెలియని స్థితిలో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 4,004 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతుండగా, డాలర్ ఇండెక్స్ మూడు నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ డిసెంబర్‌లో వడ్డీ రేట్లు తగ్గించే అవకాశాల ఉన్నట్టు సూచనప్రాయంగా తెలపడంతో, డాలర్ బలపడి, బంగారం కొంత ఒత్తిడిని ఎదుర్కొంది. అయినప్పటికీ, బంగారం వరుసగా మూడవ నెలవారీ లాభం దిశగా సాగుతోంది. దీనికి ప్రధాన కారణం ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకుల భారీ కొనుగోళ్లను పేర్కోవచ్చు. ముఖ్యంగా కజకిస్తాన్, బ్రెజిల్ వంటి దేశాలు ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బంగారం కొనుగోలు చేయడంతో డిమాండ్ ఏర్పడింది. అయితే, ఈ పరిస్థితి త్వరలోనే సద్దుమణుగుతుందని, బంగారం ధరలు తగ్గుతాయని పరిశీలకులు అంటున్నారు. బులియన్ మార్కెట్లలో ఏదైనా సాధ్యమే కాబట్టి, వారి అంచనాలు నిజమవుతాయా? లేక ధరలు మరింత పెరుగుతాయా? అన్నది చూడాలి.

## స్టాక్ మార్కెట్లకు స్వల్ప నష్టాలు

గతవారం తీవ్రమైన ఒడిదుడుకులకు లోనైన భారత స్టాక్ మార్కెట్లు ఈవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో ఈవారం మొదటి రోజు (అక్టోబర్ 27) 84,211.88 పాయింట్లతో మొదలైన సెన్సెక్స్, లావాదేవీల చివరి రోజు (అక్టోబర్ 31)న 83,938.71 పాయింట్ల వద్ద ముగిసింది. మొత్తం మీద ఈ వారం 273.17 పాయింట్ల పతనం నమోదైంది. అదే విధంగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో 25,795.15 పాయింట్లతో మొదలైన నిఫ్టీ, 73.05 పాయింట్లు నష్టపోయి, 25,722.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధానికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్న తరుణంలో, వచ్చే వారం స్టాక్ మార్కెట్లలో మెరుగైన ర్యాలీలు కొనసాగే అవకాశం ఉందని అంటున్నారు. అయితే, మిగతా అంశాలు కూడా ప్రభావం చూపుతాయి కాబట్టి, నిరంతర పరిశీలనతోనే నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## ఫీజు బకాయి విడుదలలో జాప్యమేల?

**ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి సంతోష్**




ప్రజాపక్షం/కెయుక్యాంపస్: ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నయీంనగర్ లో తక్షణం ఫీజు బకాయిలు విడుదల కోరుతూ భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ రూ.8,300 కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు బకాయి చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఇద్దరు మంత్రులు ఉన్నా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కనీసం విద్యార్థుల సమస్యలు తీర్చేందుకు ఆలోచన చేసే పరిస్థితి లేదని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటే ఎఐఎస్ఎఫ్ చూస్తూ ఊరుకోదని, నిధులు విడుదల చేయాలని, లేనియెడల ఎమ్మెల్యే,మంత్రుల ఇళ్ళను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్. జక్కుల భానుప్రసాద్. జిల్లా సహాయ కార్యదర్శి బుజ్జి జ్యోతి. జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్, చరణ్ గౌడ్, రాజు, రమేష్, రమ్య, సృజన, సౌమ్య లతోపాటు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం

**ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వవిధానాలను నిరశిస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు పురవీధుల్లో బిక్షాటన చేస్తూ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకుంటున్న కాలేజీల్లో రూ.83 వేల కోట్లకు పైగా ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు ఉన్నప్పటికీ వాటిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడం దుర్మార్గం అన్నారు. గత నాలుగేళ్లుగా విడుదల కాక కాలేజీ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని, లేదంటే సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కనీసం పట్టడం లేదన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకుందని అన్నారు. బకాయిలు ఇవ్వాలంటూ యాజమాన్యాలు సైతం కాలేజీలు బంద్ చేస్తుంటే విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నప్పటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు శ్రద్ధ తీసుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటే ఏఐఎస్ఎఫ్ చూస్తూ ఊరుకోదని, తక్షణమే బకాయిలు విడుదల చేయకుంటే అధికార ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, నాయకులు పవన్, మహేష్, కళ్యాణ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేయాలి

**తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ**



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు భూమిని సేకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం భూనిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ కోరారు. శనివారం భూమిని కోల్పోతున్న భూనిర్వాసితులుఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.ఆర్‌డిఓతో మాట్లాడి భూమిని సేకరిస్తున్న వివరాలపై, నష్టపరిహారంపై, ఇతరత్రా విషయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తరతరాలుగా సాగు చేసుకుంటూ లావుని పట్టాలు పొందిన నిరుపేద రైతులు సాగు చేసుకుంటూ జీవినాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ భూమినే వారి జీవనాధారంగా ఉందని, భూమిని కోల్పోవడంతో వారి జీవనాధారం ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వారికి మరో చోట భూమి, ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో భూనిర్వాసితుల కమిటి ఏర్పాటు చేయగా, కాకి అమృతారెడ్డి కన్వీనర్‌గా, పోలగాని సైదులు, చెన్నగాని సైదులు కోకన్వీనర్లుగా, మరో 12 మందితో కమిటి ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొప్పుజు సూర్యనారాయణ, కంబాల శ్రీనివాస్, పొనుగుపాటి వాసుదేవరావు, రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## తేమ పేరుతో పత్తికి ధర తగ్గించొద్దు

**సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం**




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మొంథా తుఫాన్ వల్ల రైతుల నడ్డి విరిగిందని చేతిచ్చే దశలో ఉన్న పంటలు నేలమట్టమయ్యాయని, దీంటో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోని ఎకరాకు రూ.50వేల పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తుఫాన్‌తో పంటలు నేలమట్టమయ్యాయని, వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.10వేల పరిహారం చెల్లిస్తామనడం భావ్యం కాదని, దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి పరిహారం అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపత్తుగా పరిగణించి రూ.50వేల పరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. వ్యవసాయం చేసే పరిస్థితులో రైతులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం తక్కువ ఉందని పత్తికి ధర తగ్గించడం సరికాదని, క్వింటాకు రూ.70వేలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇండ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామచంద్రు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిల్లా కనకయ్య, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, మండల కార్యదర్శులు జిల్లా యాదగిరి, అంజనపల్లి రామలింగం, పోలేపల్లి ఉదయ్‌కుమార్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, దళిత హక్కు పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వల్లంపట్ల వెంకన్న, మద్దిరాల రంగా రెడ్డి, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## సమస్యలపై సమ్మెకు సిద్ధం..




**ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్**

ప్రజాపక్షం/భూపాలపల్లి: స్ట్రక్చర్ మీటింగ్ సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెకైనా సిద్ధమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ మాట్లాడారు. సింగరేణిలో 2014నుండి 2023 వరకు కార్మికుల సమస్యలపై స్ట్రక్చర్ మీటింగులు జరగలేదన్నారు. ఎఐటియుసి గుర్తింపు సంఘంగాగెలిచిన అనంతరం వివిధ స్థాయిలో స్ట్రక్చర్ మీటింగులు నిర్వహించిందని, కొన్ని యాజమాన్యం పరిష్కరించినా పూర్తిస్థాయిలో విఫలమైందన్నారు.కార్మికులసొంతింటిపథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి దానికి కమిటీ వేసి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కోల్ ఇండియా మాదిరిగానే పెరిక్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించాలని కోరామన్నారు. 9 నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న మెమోరాండాలు నిరసన, ధర్నా నిర్వహించనున్నామన్నారు.8న జిఎం కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. 8తర్వాతసిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలుస్తామన్నారు. బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, బ్రాంచి సహాయ కార్యదర్శి గురుజపల్లి సుధాకర్ రెడ్డి, బ్రాంచ్ కమిటీ నాయకులు నూకల చంద్రమౌళి, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి సతీష్ ఉన్నారు.

## 'మధ్యాహ్న భోజన' కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్**




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : తెలంగాణరాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనకార్మికులకు ఉద్యోగభద్రత, గుర్తింపుకార్డులు, కనీసబీమా సౌకర్యం, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజనపథకంవర్కర్స్ యూనియన్ ఎఐటియూసి రాష్ట్రసమితి పిలుపులోభాగంగా భోజన కార్మికుల సమస్యల వినతిపత్రాన్ని జిల్లావిద్యాకార్యాలయంలో అందజేశారు.ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో మధ్యాహ్న బోజనకార్మికులకు గతపదినెలలుగా కోడిగుడ్ల బిల్లులు చెల్లించడంలేదని, మెనూ చార్జీలు చెల్లించకుంటే వంటకార్మికులు ఎలా పనిచేస్తారన్నారు.ఈ నెల 12న రాష్ట్రవిద్యాశాఖ కమీషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటస్వామి, ఎఐటియూసి జిల్లానాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, సత్యం, కుమార్, చంద్రయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

## పాలకుల విధానాలతో కార్మికులు సతమతం

**ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్**




ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : పాలకుల విధానాలే కార్మికుల జీవితాలకు మరణ శాసనాలుగా మారుతున్నాయని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి. సురేష్ ఆరోపించారు. ఎఐటియుసి 106 వ వ్యవస్థాపక దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ఎదుట ఎఐటియుసి పతాకం ఆవిష్కరించారు. సురేష్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు తెచ్చారని, కార్మిక వర్గం సర్వహక్కులు కోల్పోయి యాజమాన్యాల దోపిడీ పరంపర మరింత తీవ్రమయ్యేలా ఆజ్యం పోస్తున్నాయని మండిపడ్డారు. ఎఐవైఎఫ్‌జిల్లాకన్వీనర్ డి.రాము,కోకన్వీనర్ మహేష్, ఏఐటియుసి మెడికల్, ఆర్టిసికార్గో, బీడీ సంఘం, ఆటో యూనియన్ రంగాల నాయకులు భీమయ్య, జగ్గనాయక్,యాదయ్య,రాములు,ఆంజనేయులు,నరేష్, యాదయ్యఉన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## వ్యవసాయ పొలంలో ఘనంగా క్షేత్ర దినోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తంలో భాగంగా శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని రైతుల వ్యవసాయ పొలంలో శనివారం క్షేత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు ఏలాంటి విత్తనాలు వాడుకోవాలి అనే అంశాలపై సమగ్రంగా వివరించారు. రైతులకు అందజేసిన 1010 ఫౌండేషన్ విత్తనం తీసుకున్న మండల రైతులకు సొంత విత్తన అభివృద్ధిలో తీసుకోవాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సాగుబడిలో ఉన్న సందేహాలను ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిని చంద్రకళ, అసిస్టెంట్ డైరక్టర్ మేడ్చల్ వెంకట్రామ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రమేష్, ఎఇఒ రవికుమార్, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, రైతులు జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/కాప్రా :** మెరుగైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థే లక్ష్యంగా చర్యలు చేపడతామని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు.మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మర్రిగూడలో 14 లక్షల రూపాయలతో భూగర్భ డ్రైనేజీ పనులకు ఆయన కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు.రైల్వే ట్రాక్ పక్కన ఉన్నటువంటి డ్రైనేజీ పైప్ లైన్ సమస్య పరిష్కారం కొరకు, ఎన్ఎఫ్‌సి కంపెనీ నుండి వస్తున్న కలుషిత వ్యర్థ జలాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరగా రైల్వే,ఎన్ఎఫ్‌సి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్,నాయకులు సంజీవ రెడ్డి, బోదాసు లక్ష్మి నారాయణ,సంజీవరెడ్డి,వాసుగౌడ్, తీగుళ్ల శ్రీనివాస్ గౌడ్,నాగారం బాబు,కృష్ణ,చిన్న దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## విహారిహోమ్స్ కాలనీ బురదమయం



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** విహారిహోమ్స్ కాలనీలలో ఇప్పటివరకు రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నామని వర్షాలతో కాలనీ రహదార్లతో వర్షపు నీరు నిలిచి గుంతలు ఏర్పాడి ప్రమాదాలకు దారి తీస్తున్నాయని ఎక్కడ గుంతలు ఉన్నాయన్న విషయం తెలియక వాహనదారులు అయోమయానికి గురవుతునారని విహారి హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా విహారి హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ మాట్లాడుతూ మా కాలనీ అభివృద్ధి కొరకు స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నోమార్లు రోడ్లు,డ్రైనేజీ లేక కాలనీ ప్రజలు నానా అవస్థలు పడుతున్నామని తెలియజేసిన ఇప్పటివరకు పట్టించుకోవడంలేదని దీనికి తోడు రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయని తెలిపారు. తక్షణమే రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీలు మరమ్మత్తులు చేపట్టాలని విహారి హోమ్స్ కాలనీ ప్రజలు మున్సిపల్ కమిషనర్ గారిని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో నర్సయ్య, బాలరాజ్, దయాసింగ్, బిక్షపతి, సుబ్రమణ్యం నాయుడు,వెంకటేష్,రవీందర్,మోహన్ చారీ తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** ఓ షాపులో చోరీకి యత్నించిన విదేశీ విద్యార్థిని అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డిఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం సైనిక్ పురి మా తృపురి కాలనీలో నివాసముండే మాజీ సైనికుడు శ్రీనివాస్ రాంకీ బండి సమీపంలో వెస్ట్రన్ యూనియన్ మనీ ట్రాన్స్ఫర్,వాటర్ ప్యూరిఫైయర్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు.శ్రీనివాస్ తన ఆఫీసులో ఉండగా గుర్తు తెలియన వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి తన దగ్గర ఉన్న క్యాష్ బ్యాగును కత్తిని చూపిస్తూ ఇవ్వమని బెదిరించారు.నిందితుడు బ్యాగును తీసుకుని స్కూటర్‌పై వెళ్తుండగా శ్రీనివాస్‌రావు వెంబడించి బ్యాగును లాక్కొన్నాడు.దీంతో శ్రీనివాస్ కుషాయిగూడ పిఎస్‌లో ఫిర్యాదు చేశాడు.కేసు దర్యాప్తు చేసిన పోలీసులు హోండురేనా దేశానికి చెందిన హెర్నన్‌డెజ్ @ గ్లిమార్ ఎలుదిన్(32)ను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

## ఘనంగా సైన్స్ ఫెయిర్



**ప్రజాపక్షం/ఉప్పల్ :** నాచారం జాన్సన్ గ్రామర్ హై స్కూల్ (సిబిఎస్‌ఇ) లో శనివారం ఘనంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు, ఇది విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించటంలో కీలక పాత్ర పోషించింది. ఈ ప్రదర్శన ఒక వేదికగా నిలిచింది. అక్కడ విద్యార్థులు సృజనాత్మక సైన్స్ ప్రాజెక్టులు, మోడల్స్ ప్రదర్శిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, రోబోటిక్స్, శక్తి వనరుల వినియోగం, అంతరిక్ష పరిశోధన వంటి ఆధునిక అంశాలపై ప్రాజెక్టులు సమర్పించబడి, అవి చాలా ఆకట్టుకున్నాయి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఆలోచన శక్తి , పరిశోధనా దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవడానికి సహాయపడతాయి.ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థుల ఉత్సాహాన్ని పెంపొందించారు, విద్యా ప్రగతికి సహకారమయ్యారు. ఇలా సైన్స్ ఫెయిర్ విద్యార్థులకు శాస్త్రంపై మరింత ఆసక్తి, అవగాహన కలిగించడంలో సుప్రభాత పాత్ర వహిస్తుంది.

## ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట్ మండలం అక్నాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పెద్దగోళ్ళ బాలయ్య (55) శుక్రవారం పొలం పనులకు వెళ్లి కాలువలో జారిపడి ఆకస్మికంగా మృతిచెందారు. అతనికి శనివారం నాడు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో ఎంపిడిఓ అనురాధ,ఎంపీవో విజయ్ కుమార్, ఏపిఓ లక్ష్మీదేవి హాజరైనారు. ఉపాధి హామీ శాఖ సిబ్బందితో కలిసి బాలయ్య పార్థివ దేహాన్ని సందర్శించి పుష్పాంజలులు సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్పు పలికారు. ప్రభుత్వం ద్వారా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ బాలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ అంత్యక్రియలకు మండల సూపర్డెంట్ అజయ్ కుమార్, ఉపాధి హామీ సిబ్బంది శ్రీరాములు, జగదీశ్వర్, భాస్కర్, వాణి, పెంటేష్ తోటి సిబ్బంది సహచరులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## నిజాయతీ అందరి జీవన విధానం కావాలి

అందరిలో చైతన్యంతోనే అవినీతికి అడ్డుకట్ట
బిహెచ్ఇఎల్ విజిలెన్స్ వారత్సవంలో
హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవస్థల పట్ల, వాటి పని తీరుతో పాటు పౌరుల హక్కులకు సంబంధించి అందరిలోనూ అవగాహన ఉన్నప్పుడు అవినీతి నిర్మూలన సాధ్యమౌతుందని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. చట్టాలపైన అవగాహన కల్పించడంతో పాటు, అనుసరించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వాటిని అమలు చేసేవారిపై ఉందన్నారు. గొలుసు కట్టు చెరువుల ప్రాధాన్యత, నాలాల అవశ్యక త, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల పరిరక్షణ వల్ల కలి గే ప్రయోజనాలను ప్రజలందరికీ తెలిసేలా హైడ్రా చర్యలు తీసుకుందన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బిహెచ్ఈఎల్ నిర్వహించిన కార్యక్రమంలో రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైడ్రా రాక ముందు చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ పట్ల చాలా మందిలో అవగాహన లేదని, ఇ ప్పుడు దాదాపుగా అందరికీ తెలిసేలా చేశామన్నారు. ఎన్ఆర్ఎస్‌సి (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) తెలిపిన వివరాల ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయయని, ఇదే కొనసాగితే వచ్చే 15 ఏళ్లలో మొత్తం చెరువులు మా యం అవుతాయన్నారు. అందుకే చెరువులతో పాటు నాలాల పరిరక్షణకు హైడ్రా నడుం బిగించిందన్నారు. విజిలెన్స్ వారోత్సవాలను పాఠశాలల్లో నిర్వహించామని బిహెచ్ఈఎల్ హైదరాబాద్ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి రాజా తెలిపారు. విద్యార్థి దశలోనే అవగాహన తీసుకువస్తే మంచి పౌరులుగా మారుతారన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన ఉద్యోగులతో పాటు విద్యార్థులకు అవార్డులను హైడ్రా కమిషనర్‌రంగనాథ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిహెచ్ఈఎల్‌లోని వివిధ విభాగాల్లోని అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చినా ఆగని కబ్జాలు

పరికి చెరువు పరిరక్షణ కమిటీ



**ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్ :** హైడ్రా కూల్చిన కబ్జాలు మాత్రం ఆగడంలేదని పరికి చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడతూ కుత్బుల్లాపూర్ మండలంలోని జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ, కూకట్‌పల్లిలోని ఆల్విన్‌కాలనీలో విస్తరించి ఉన్న పరికి చెరువును రక్షించాలని కోరుతూ గత కొద్ది సంవత్సరాల నుండి చెరువు పరిరక్షణ కమిటీ పేరుతో ఉద్యమించి, కబ్జాలపై హైడ్రాలో వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఈ ఫిర్యాదుతో స్పందించిన అధికారులు గత ఫిబ్రవరి నెల లో హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చడం జరిగిందన్నారు. హైడ్రా కూల్చిన కబ్జాలు మాత్రం ఆగడంలేదని, కూల్చిన చోట మళ్లీ నిర్మాణా లు జరగడమే కాకుండా మరింత విస్తరించడంతో పరికి చెరువు ఆనవాళ్లు లే కుండా పోయే ప్రమాదం ఉందన్నారు. హైడ్రా అధికారులు మరొక్కసారి దృష్టిపెట్టి అక్రమంగా ఏర్పడ్డ నిర్మాణాలను కూల్చివేసి పరికి చెరువు పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అక్రమంగా కబ్జా చేస్తూ స్థలాన్ని అమ్ముతున్న కబ్జాదారుడిపై పిడి యాక్ట్ అమలు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరికి చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉమామహేష్, సభ్యులు సాయి పంతులు, పవన్, ప్రవీణ్, బాబు, సహదేవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గొల్ల కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
స్థానిక ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** గొల్ల కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఎ బీర్ల ఐలయ్య అన్నారు. తాండూరు పట్టణ పరిధి బైపాస్ రోడ్డు సమీపంలో శ్రీ బీరప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవం, రూ. 50లక్షలతో నిర్మించే కుర్వ భవన్‌కు స్థానిక ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డితో కలసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అందరి వాడుగా నిలుస్తున్నారని అన్నారు. తాండూరు నియోజకవర్గంలో పదేళ్ళ కాలంలో జరగని అభివృద్ధిని ఏడాదిన్నర కాలంలో ఎంఎల్ఎ చేసి చూపించాడని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంతో పరిగి ప్రాంతం నుండి తాండూరులో నిలబెట్టి మీకు సేవ చేసే అవకాశం కల్పించాడని కొనియాడారు. మున్ముందు మరిన్ని మంచి పదవులు వరించాలన్నారు. ఇప్పుడు ఎప్పుడు మనమందరం ఎంఎల్ఎకు అండగా ఉండాలని అన్నారు. బిసి రిజర్వేషన్ల కోసం అందరం కలసి పనిచేద్దామన్నారు. వెనుకబడిన మన గొల్ల కురుమలు విద్య, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. తన వంతుగా కురమ భవన్ నిర్మాణానికి రూ.5లక్షల నిధులు అందజేస్తానని అన్నారు.

**ఎన్నికల్లో మాటిచ్చా...నెరవేర్చాం....**

అసెంబ్లీ ఎన్నికల్లో మాటిచ్చాం...నెరవేర్చామని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. కుర్వలకు మోసం చేయడం, అబద్దాలు చెప్పడం రాదని, పాడిపరిశ్రమను నమ్ముకొని జీవనం సాగించే వారన్నారు. ధర్మం, న్యాయం ఎటువైపు ఉంటే అటు వైపు నిలబడే జాతి మన గొల్ల కురమ జాతి అన్నారు. ఎన్నికల సమయంలో తనపై నమ్మకంతో గెలిపించారని అన్నారు. వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎసి కుర్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం,గొల్ల కుర్వ సంఘం నాయకులు, కుర్వ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## 12 లోపు సిఎంఆర్ అందజేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** రైస్ మిల్లర్ల వద్ద ఉన్న సిఎంఆర్‌ను నవంబర్ 12లోపు అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఖరీఫ్‌కు సంబంధించిన సిఎంఆర్ బ్యాంక్ గ్యారెంటీలు , అగ్రిమెట్లు, తదితర అంశాలపై రైస్ మిల్లర్లు , పౌరసరఫరాల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు అందరూ బ్యాంక్ గ్యారంటీలతో పాటు అగ్రిమెట్లు అందజేయాలన్నారు. 2024–25సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్ సిఎంఆర్‌ను నవంబర్ 12లోపు తప్పనిసారిగా పూర్తి చేయాలని అయన తెలిపారు. జిల్లాలో ధాన్యం అంచనాలకు అనుగుణంగా ఏర్పాట్లు సమకుర్చుకోవాలని తెలిపారు. త్వరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుదర్శన్ , మోహన్‌కృష్ణ తదితరులు పాల్గోన్నారు.

**జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**ధారూర్ :** జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. ధారూర్ జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి అయన మాట్లాడుతూ ధారూర్ జాతర నవంబర్ 11నుండి 16వరకు జరుగుతుందన్నారు. జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు రావడం జరుగుతుందని దానికి అనుగుణంగా సదుపాయాలు ఏర్పాటు చేయాలని అయన తెలిపారు. 24గంటలు సంబంధించి శాఖలు అధికారులు విధుల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అయన తెలిపారు. అధికారులు సమన్వయంతో , పని చేస్తు జాతర సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అయన సూచించారు.ఈ కార్యక్రమం లో డిఎండబ్ల్యు రాజేశ్వరి ,సదానందం ,పంచాయతీరాజ్ ఉమేష్ , ఎంపిడిఒ నరసంహులు జతర నిర్వహకులు కార్యవర్గ సభ్యులు సంజయ్ కుమార్ , డి.రాజు తదితరులు పాల్గోన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తా

- 87 సొసైటీలకు పక్కా భవానాలను నిర్మించుటకు కృషి చేస్తా : ఈటల



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమానికి తనవంతు సహయ సహకారాలు అందిస్తానని, తెలంగాణ రాష్ట్రంలో చేపలను అమ్ముకుని కోట్లాది మంది ప్రజలు జీవనం గడుపుతున్నారని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం శామీర్‌పేట పెద్ద చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 7.20 లక్షల ఉచిత చేప పిల్లలకు గాను 2.50 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మత్స్యకారుల జనాభా ఉందని వీరందరు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. సొంత చెరువులపై మత్స్యకారులు తమ హక్కులను కోల్పోయి దళారుల బారిన పడుతున్నారని అన్నారు. తెలంగాణలో చాల ప్రాజెక్టులు, చెరువులు పెద్ద ఎత్తున జలసంపద ఉందని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉన్న చెరువులను నమ్ముకుని ప్రభుత్వం ఇచ్చిన ఉచిత చేప పిల్లలను పెంచుకుని వాటిని అమ్ముకుంటున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మత్స్యకారులకు సైకిల్ మోటార్ల పంపిణి, ఆటోలు, ఐస్ ఫ్యాక్టరీల నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్ ద్వార ఉచిత చేప పిల్లలను పంపిణీ మొదలు పెట్టారని అన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చిన ప్రజలకు ఉపయోగపడే స్కీములు కొనసాగించాల్సిన బాధ్యత ఉంటుందని వివరించారు. శామీర్‌పేట పెద్ద చెరువు చాల గొప్ప చెరువు అని ఈ చెరువులో కలుషితమైన, డ్రైనేజి నీళ్లు చేరి చేపలు చనిపోతున్నాయని ఆవేదన చెందారు. ఈ చెరువును కలుషితం కాకుండా తానే స్వయంగా బాధ్యత తీసుకుంటానని హామి ఇచ్చారు. అలనాటి కాకతీయులు, నిజాంలు కట్టించిన చెరువులు ఇప్పటివరకు చెక్కు చెదరలేదని ఈ చెరువులో ఎప్పుడు నీళ్ల తగ్గడం తాను చూడలేదన్నారు. మేడ్చల్ జిల్లాలో 87 సొసైటిలు ఉన్నాయని ఆ సొసైటి స భ్యులు ముందుకు వస్తే భవనాలను నిర్మించుట కు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేప ల్లో చాల విటమిన్‌లు ఉంటాయని చేపలను తిన డం వలన ఏలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అదికారి సుకీర్తి, జిల్లా మత్స్యశాఖ సంఘం అద్యక్షులు మన్నె రాజు, వైస్ ప్రసిడెంట్ మోహన్‌కృష్ణ, డైరక్టర్‌లు వెంకటేష్, దేవేందర్, శామీర్‌పేట మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు రాజు, ఉప్పర్‌పల్లి రాము, నాయకులు బుద్ది శ్రీనివాస్, కొర్వి కృష్ణ, కైర యాదగిరి, సుదర్శన్, మైసయ్య, పవన్‌గౌడ్, శామీర్‌పేట, పూడూర్, తుర్కపల్లి, తదితర గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.





## అభివృద్ధి పేరుతో కెబిఆర్ పార్కు వద్ద కూల్చివేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెబిఆర్ పార్కు వద్ద అభివృద్ధి పేరుతో ప్రభుత్వం కూల్చివేతలకు పాల్పడానికి చర్యలు చేపట్టడం అనాలోచిత చర్య అని బాధితులు వివి శాస్త్రీ, శ్రీధర్, డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ మల్టీ జంక్షన్ ప్రాజెక్టు పే రుతో గతేడాది కెబిఆర్ పార్కు వద్ద అగ్రసేన్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెకోపోస్టు వరకు తమ ఇండ్లు, వ్యాపార వాణిజ్య కేంద్రాల స్థలాన్ని సేకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన జారీ చేసిందన్నారు. అంతేకాకుండా నోటీసులు జారీ చేసి కూల్చివేతల కు మార్కింగ్ సైతం చేశారన్నారు. జాతీయ పార్కు ఉన్న స్థలం చుట్టూ అభివృద్ధి చేపట్టాలన్నా, అక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్న వారి స్థలాన్ని సేకరించాలన్న డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారితో ఎక్స్‌ఫర్ట్ కమిటీ వేసి దాని నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, కాని ప్ర భుత్వం అలాంటివేమి చేపట్టకుండానే నేరుగా తమ ఇండ్లు, వ్యాపార సముదాయాలను కూల్చివేసేందుకు సిద్ధమైందన్నారు. హైకోర్టు సైతం ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించిందని, అయినా తాజాగా మళ్లీ తమ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. అందుకు సెక్షన్ 10ఏను సాకుగా చూపిస్తుందన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలన్నా అనేక అ నుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల ప్రకృతికి నష్టం జరుగుతుందన్నారు. ఎలాంటి కూల్చివేతలకు పాల్పడకుండా ఇక్కడ వన్ వే ట్రాఫిక్‌ను ఏర్పాటు చేయవచ్చని, కానీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా తమను నిర్వాసితులను చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ చర్యలను తాము న్యాయ స్థానం ద్వారా అడ్డుకుంటామన్నారు.

## కె.వి.ఆర్ లేఔట్‌లో పార్కుల కబ్జాలపై చర్యలు తీసుకోవాలి : ఆకుల సతీష్



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలో మల్లంపేట్ కెవిఆర్ లేఔట్ లోని పార్కుల కబ్జాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు ఆకుల సతీష్ అన్నారు అనంతరం వారు మాట్లాడుతూ, 54 ఎకరాల వెంచర్ 2004 వేయడం జరిగిందనీ, కానీ టిఆర్ఎస్ పాలనలో మరియు స్థానిక ఎమ్మెల్సీ రాజు తమ్ముడు అండదండలతో నరేష్ అతని మిత్రులు కలిసి దాదాపు పది పార్కు స్థలాలు కబ్జా చేయడమే కాకుండా దాదాపు 100 కోట్ల విలువైన పార్క్ ఆస్తికి తప్పుడు పత్రాలు సృష్టించి మరియు వెంచర్ వేసిన కెవి. రామరాజు పేరు మీద సంతకం ఫోర్జరీ చేసి హైకోర్టు నుండి ఉత్తర్వులు పేరుతో పార్కులు రిజిస్ట్రేషన్లు చేయడంపై గతంలోనే ఫిర్యాదు చేసిన నామ మాత్రం కూల్చివేశారు. కానీ మున్సిపల్ అధికారులు కేసును నమోదు చేయలేదనీ పేర్కొన్నారు. చివరికి 2024 సూరారంలో అక్రమ గన్‌తో నరేష్ కాల్పులు జరపడం తర్వాత పోలీస్ అధికారులు కె.వి రామరాజు ఇచ్చిన పార్క్ స్థలాల కబ్జాపై ఫిర్యాదు ఆధారంగా నరేష్ వారి మిత్రులపై (737/2024) దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ముగించారనీ అసలు అండదండలు సాకారం అందించిన ఎమ్మెల్సీ రాజు మరియు కౌన్సిలర్ కృష్ణ పాత్ర పై విచారణ జరపలేదనీ చివరికి ప్రస్తుతం కె.వి.ఆర్ లేఔట్‌లో అప్పట్లో కూల్చివేసిన పార్క్ స్థలాలు ప్రస్తుతం అధికార పార్టీ నేతతో నరేష్ అనే వ్యక్తి మళ్లీ చేతులు కలిపి మళ్లీ అమ్మకాలు చేయడంపై తక్షణమే కెవిఆర్ లేఔట్ లో పార్కు స్థలాల్లో ఆక్రమించుకున్న అన్ని నిర్మాణాలను కూల్చివేసి, పార్కులను పరిరక్షించడానికి ఫన్సింగ్ వేసి రక్షించడమే కాకుండా నరేష్ మిత్రులు , ఎమ్మెల్సీరాజు వాళ్ళ తమ్ముడు కృష్ణ పాత్రపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అని మున్సిపల్ అధికారులకి ఫిర్యాదు చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో అరు ణ్ రావు, ఈశ్వర్ రెడ్డి ,శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కార్తీకమాసం పురస్కరించుకుని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఉద్దెమర్రిలోని అతి పురాతణమైన అక్కన్న మాదన్నలు నిర్మించిన శ్రీ విష్ణు శివాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దేవస్థాన కమిటి చైర్మన్ ఆడెపు ఉమామాహేశ్వరి ఆధ్వర్యంలో వేద పండితుడు త్రిగుళ్ల వెంకటేశ్వరశర్మ సత్యనారాయణ స్వామి వ్రతాలను చేయించారు. తెల్లవారు జామున అ ష్టలక్ష్మి పూజాది క్రతువులు, సామూహిక కుంకుమార్చన, కలశ స్థాపన, గణపతి పూజ, నవ గ్రహ పూజలు, వేద పండితుల మంత్రోచ్ఛరనలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలతో ఆలయ ప్రాంగణం భక్తి నామాలతో మారు మ్రోగింది. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వార్ల తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తాండూరు ఎంఎల్ఎ బుయ్యన మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా తాండూరు మండలానికి చెందిన మహిళ సంఘాల సభ్యులకు 950యూనిట్ల నాటు కోడి పిల్లలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలసి అందజేశారు.అనంతరం పెద్దేముల్ మండలానికి చెందిన 21మంది లబ్ది దారులకు రూ. 21,02.436విలువ గల కల్యాణ లక్ష్మి , షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎసి ఎగ్గే మల్లేశం, స్థానిక నాయకులు, అధికారులు పాల్గోన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ సద్వినియోగం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వం ఎస్.సి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం ప్రారంభించబడిందని, ఎస్సి విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందించబడుతుందని రంగారెడ్డి జిల్లా ఎస్సి అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ జె రామారావు తెలిపారు.అర్హత ప్రమాణాలకు సంబందించిన 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000 లోపు ఉండాలన్నారు. విద్యార్థికి కనీసం 75 శాతం హాజరు ఉండాలని,విద్యార్థి ఎస్. సి వర్గానికి చెందివుండాలన్నారు.ధరఖాస్తు చేసుకున్న అర్హులైన విద్యార్థులకు రూ.3,000 స్కాలర్‌షిప్‌గా అందజేయబడుతుందని తెలిపారు.దరఖాస్తు చేసుకునేవారు తమ ఆధార్,కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు పత్రాలతో పాటు అవసరమైన పత్రాలను ఆన్‌లైన్‌లో అవసరమైన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసి దరఖాస్తు సమర్పించండి.వివరాలు నమోదు చేయల ని ఆయన పేర్కొన్నారు.ఇట్టి అవకాశాన్ని ఎస్సి విద్యార్థు ల తల్లిదండ్రులు తప్పనిసరిగా దరఖాస్తు చేయాలని,మన పిల్లల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సి అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ జె రామారావు పేర్కొన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి




**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని 1200 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో జెఎసి కన్వీనర్ డా. పరుశురాం, కో కన్వీనర్ డా. విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ 12 వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ అమలు చేస్తామని గత ఏప్రిల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఆరు నెలలవుతున్నా తమ హామీలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 4న ఓయూ ఆర్ట్స్ కాలేజ్ నుండి పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీ కి ముఖ్యఅతిథులుగా టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హర గోపాల్ లు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జెఎసి నేతలు డా. కరుణాకర్ రావు, డా. భూమయ్య, డా. రామకృష్ణయ్య, డా విజయ్, డా. సీ.హెచ్ వెంకటేశ్వర్లు, డా. తిరుపతి, డా. రమేష్, డా. పాండయ్య, డా. శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా 'శర్నిత' కూచిపూడి రంగప్రవేశం




**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** గురు డాక్టర్ భావన పెదప్రోలు దీవెనలతో, తల్లిదండ్రులు రచ్చ హరివినోద్, రచ్చ నారీనా దేవి ఆశీస్సులతో ఏడేళ్ల చిన్నారి రచ్చ శర్నిత కూచిపూడి రంగ ప్రవేశం అట్టహాసంగా జరిగింది. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా శారద కళాక్షేత్ర భావన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో శర్నిత కూచిపూడి నాట్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకొన్నది. చిన్నారి శర్నిత అద్భుతమైన నాట్యం చేసి జూనియర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు సంపాదించుకొన్నది. ఈ సందర్భంగా సభికులు శర్నితను అభినందనలతో ముంచెత్తారు.

## వెల్లివిరిసిన సృజనాత్మకత




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలన్న ప్రధాన ఉద్దేశం అని శ్రీ కృష్ణ విద్యా క్షేత్ర పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ రెడ్డి అన్నారు.రంగారెడ్డి జిల్లా ఉప్పర్‌పల్లి లోని శ్రీకృష్ణ విద్యా క్షేత్ర పాఠశాలలో విద్యా మేళా శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ మేళాకు సమన్వయకర్త రాజ్యలక్ష్మి సమన్వయంతో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ప్రిన్సిపాల్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా మేళా ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడం,వారు తమ పాఠ్యాంశాల్లో నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రాయోగికంగా ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పించడం తోపాటు పిల్లల్లో ప్రాయోగిక విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థులు తమ ప్రాజెక్టులు,నమూనాలు,సైన్స్ ప్రయోగాలు,కళాత్మక ప్రదర్శనలు,టెక్నాలజీ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రతి స్టాల్‌లో పిల్లలు తమ ఆలోచనలను, సృజనాత్మకతను అద్భుతంగా చూపించారు. మేళాకు హాజరైన తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పిల్లలు నేర్చుకున్న విషయాలను ప్రాయోగికంగా చూపించిన విధానాన్ని చూసి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.'ఇలాంటి విద్యా మేళాలు విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి, జ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే సాధనంగా నిలుస్తాయి,అని పేర్కొన్నారు.

## కొండకల్‌లో ఘనంగా శోభయాత్ర



**ప్రజాపక్షం/శంకర్పలిపల్లి:** మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమల్లన్న,బీరప్ప.కొండ పోచమ్మ దేవాలయం ప్రతిష్ఠాపన కార్యక్రమం మూడవరోజు అంగరంగ వైభవంగా జరిగింది. మూడవరోజు సందర్భంగా నూతన దేవాలయాల విగ్రహాలను వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నూతన దేవాలయం నుండి గ్రామమంతా శోభయాత్ర నిర్వహించారు.ఒగ్గుడోలు సప్పుడు వాయిద్యాల మధ్యలో ఘనంగా శోభయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు స్వామివారికి గ్రామంలోనిది పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

# అక్రమ నిర్మాణాలపై మరోసారి హైడ్రా పంజా


**అమీన్‌పూర్, చందానగర్ ప్రాంతాలలో కూల్చివేతలు**

**మణికొండ మునిసిపాలిటీలో రూ.300 కోట్ల విలువైన భూమిని కాపాడిన అధికారులు**

**వెంకటేశ్వరకాలనీలో 1600 గజాల స్థలానికి కబ్జాదారుల నుండి రక్షణ**

**తిరుమలహిల్స్‌లో 6150 గజాల స్థలాన్ని కాపాడింది**




**ప్రజాపక్షం/రంగారెడ్డి/మియాపూర్:** అక్రమ నిర్మాణాలపై హైడ్రా మరోసారి పంజా విసురుతోంది.ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేస్తోంది. సంగారెడ్డి జిల్లా ఆమీన్ పూర్ మున్సిపల్ పరిధి లోని పిజెఆర్ కాలనీ,మియాపూర్ సరిహద్దు ప్రాంతంలోని అమీన్‌పూర్,చందానగర్ ప్రాంతలలో భారీ కూల్చివేతలు చేపట్టింది.ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన హైడ్రా బృందం మియాపూర్ లోని 101 సర్వే నెంబర్‌లో సర్వే నంబర్ మార్చి భారీ అక్రమ నిర్మాణం చేపట్టినట్లు గుర్తించింది.అమీన్ పూర్ సర్వే నంబర్ 337,338 లలో హుడా అప్రూవ్డ్ లే అవుట్ లో 400 గజాల ప్లాట్ కొని,ఆ పక్కనే మియాపూర్ సర్వే నంబర్101లోని ప్రభుత్వ స్థలంలోకి చొరబడి 126/D, 126 part,126/Cగా ప్లాట్లు సృష్టించిన దాదాపు 473 గజాలు కలుపుకొని భాను కన్‌స్ట్రక్షన్స్ యజమానులు 5 అంతస్తు భవనం నిర్మించారు.విచారణ చేసిన అక్రమ నిర్మాణంగాతేలడంతోహైడ్రాఅధికారులు కూల్చివేశారు. అవాంఛనీ ఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు భారీగా మోహరించారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పడిన హైడ్రా అక్టోబర్ 31పోచారంలో రూ. 30 కోట్ల విలువై ప్రభుత్వ స్థలాన్ని కాపాడింది. అదే విధంగా పోచారం ము న్సిపాలిటీ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో 4 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురైనట్లు హైడ్రకు స్థానికులు ఫిర్యాదు చేశా రు. పార్కు స్థలంలో లేఔట్ వేసినవారే కబ్జాకు పాల్పడినట్లు హైడ్రా గుర్తించింది. తప్పు దు డాక్యుమెంట్స్ తో ఆముదాల రమేష్ అనే వ్యక్తి 4 వేల గజాలను 800 గజాల చొప్పున 5 ప్లాట్లుగా కులకర్ణి అనే వ్యక్తికి అమ్మి నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో రంగంలోకి దిగి హైడ్రా ఆక్రమణల కూల్చివేతలు చేపట్టింది.పోలీస్ బందోబస్తు మధ్యహైడ్రా అధికారులు.కూల్చివేతలు చేపట్టారు.

### మణికొండ మున్సిపాలిటీలో..రూ.300 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

మణికొండ మున్సిపాలిటీలో దశాబ్దాలుగా కబ్జాల చెరలో చిక్కుకుపోయిని ప్రభుత్వ భూమితో పాటు పార్కులకు శనివారంహైడ్రా విముక్తి కల్పించింది.దాదాపు రూ.300 కోట్ల విలువైన భూమిని కాపాడింది. ఇం దులో ఒక ఎకరం ప్రభుత్వ భూమి కాగా..7650 గజాల పార్కు స్థలాలున్నాయి.వీటికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.మణికొండలోని పంచవటి కాలనీలో వెస్టర్న్ ప్లాజాకు చేరువలో ఉన్న 1 ఎకరా భూమికి ఎలాంటి పత్రాలు లేకుండా తమ పూర్వీకులదని చెప్పి కబ్జా చేసిన వారిని హైడ్రా శనివారం ఖాళీ చేయించింది. ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు తిష్ట వేసారంటూ వెస్టర్న్ ప్లాజాకు చెందిన వారు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఎవి రంగనాథ్‌గారి ఆదేశాలతో హైడ్రా అధికారులు చర్యలు తీసుకున్నారు. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో పరిశీలించి ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నారు.శనివారం ఆక్రమణలను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు. దీని విలువ దాదాపు రూ.155 లక్షలుఉంటుందనిస్థానిక అధికారులు అంచనా వేశారు.

### రెండు పార్కులకు విముక్తి

మణికొండ మున్సిపాలిటీ లోనే వెంకటేశ్వర కాలనీలో 1600గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. 1992లో లే ఔట్ వేసినప్పుడు పార్కులు, ప్రజావసరాలకుఉద్దేశించి కేటాయించిన ఈ స్థలంలో అనుమతి లేని లే ఔట్ తో కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారు. పార్కు స్థలం లో బై నంబర్లు వేసుకుని కబ్జాలు చేశారంటూ హైడ్రా ప్రజావాణికి వెంకటేశ్వర కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. విచారణ చేయగా.. నెక్నాంపూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు 1996 లోనే పార్కు, ప్రజావసరాల స్థలాన్ని గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చినట్టు తేలింది. అయితే తర్వాత మున్సిపాలిటీ అయ్యాక 2019లో ఈ స్థలాలకు అనుమతులు ఇచ్చినట్టు స్థానికులు హైడ్రాకు తెలిపారు. ఇలా పలు వివాదాల్లో ఉన్న 1600ల గజాల స్థలాన్ని స్వా ధీనంచేసుకుని పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డు లు ఏర్పాటు చేసింది. దీని విలువ రూ. 25 కోట్లు ఉంటుందని అంచనా. ఇదే మున్సిపాలిటీలోని తిరుమల హిల్స్‌లో 6150 గజాల పార్కు స్థలం కూడా కబ్జాలకుగురైంది.ఇందులోతాత్కాలికంగావేసిన షెడ్డులు,కాంపౌండ్ వాల్‌ను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు. మార్కెట్లో ఈ భూమి విలువ రూ. 120 కోట్లు వరకూ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## విద్యాశాఖలో జిఒ 317 అక్రమ పోస్టింగ్స్‌పై విచారణ చేపట్టాలి

**రంగారెడ్డి జిల్లా సేవ్ టీచర్స్ సంఘం ఆధ్వర్యంలో నిరసన**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లా విద్యాశాఖలో జరిగిన జి ఒ 317 అక్రమ పోస్టింగ్స్ పైన విచారణ జరుపాలని డిమాండ్ చేస్తూ సేవ్ టీచర్స్ సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో జిఒ 317 కింద ఉపాధ్యాయుల కేటాయింపులలో అనేక అక్రమాలు జరిగాయని,జిల్లాకు కేటాయించబడిన క్యాడర్ స్ట్రెంగ్త్ ను మించి దాదాపు 500వరకు జిల్లాలోకి ఇతర జిల్లాల నుండి కేటాయింపులు జరిగాయని,ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో ఎలాంటి సం బంధం లేని నల్గొండ, యాదాద్రి, నాగర్ కర్నూల్,మంచిర్యాల వంటి అనేక జిల్లాల నుండి కూడా 317 జిఒ పేరు పెట్టుకొని బదిలీలు జరిగాయని,జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ అక్రమ బదిలీల కోసం జిల్లాలో మిగిలి ఉన్న క్యాడర్ స్ట్రెంగ్త్ వేకెన్సీపోషన్‌ను పూర్తిగా వాడుకున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 ప్రకారం స్థానిక హక్కుల రక్షణకు భంగం కలుగుతోంది.జీ ఒ 317 కేటాయింపులు జరిగిన తేది: 06/01/ 2022 నుండి 04/10/2023 నాటికి ఎస్ఏ మాథ్స్ లో ఉన్న 44 ఖాళీలలో కేవలం 03 మాత్రమే మిగిలాయని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా జిల్లాలో జరిగిన వివిధ అక్రమాలను వివరిస్తూ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె శ్రీనివాస్ కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సేవ్ టీచర్స్ సంఘం ప్రతినిధులు రాష్ట్ర గౌరవాధ్యక్షులు బొడ్డు రవి,రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల మధుకర్ రెడ్డి,తలారి సురేష్ కుమార్,రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి,సేవ్ రంగారెడ్డి నిరుద్యోగ జెఏసి ప్రతినిధి విజయంధర్ తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధికి నిధులివ్వండి

**కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి**



**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని బొమ్మలగూడి నుండి తట్టిఅన్నారం డబుల్ బెడ్ రూం, వరకు ప్రధాన రహదారికి అనుకొని వున్న దాదా పు 40 కాలనీల ప్రజా రవాణా సౌకర్యం కోసం రూ. 4 కోట్ల నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ ను కలిసి కార్పొరేట్ కొప్పుల నర్సింహారెడ్డి వినతిపత్రం అంద జేశారు.దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు ఈరోజు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ రమేష్ బాబు, డిఇ కనకయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,అధికారులు కలిసి రహదారి పరిస్థితిని పరిశీలించారు.కార్పొరేటర్ మాట్లాడుతూ బొమ్మలగూడి నుండి నాగోల్ వరకు ఉన్న రహదారి పునర్నిర్మాణానికి దాదాపు రూ. 4 కోట్ల నిధుల ప్రతిపాదనను జిహెచ్ఎంసికి సమర్పించామని తెలిపారు. ఈ రోడ్డు పూర్తి అయిన తర్వాత సుమారు 40 కాలనీల ప్రజలు సులభంగా ప్రజా రవాణా సదుపాయాన్ని పొందగలరు. రాబోయే రోజుల్లో ఈ రహదారి విస్తరణ, సుందరీకరణ పనులు ప్రారంభమవుతాయి అని తెలిపారు. కాలనీ సంక్షేమ సంగం నాయకులు మాధవ్ రెడ్డి మురళీధర్ రెడ్డి యాదగిరి యాదవ్ కొండల్ రెడ్డి నక్క రాజేష్ గౌడ్ శ్యామ్ సుందర్ రెడ్డి వెంకట్ రమణ పోట్లపెల్లి సాయి రామ్ గౌడ్ శ్రీధర్ గౌడ్ ప్రవీణ్ గౌడ్ వెంకట్ రామ గౌడ్ సంపత్ గౌడ్‌పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై మండిపడిన హిజ్రాలు

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** విద్యుత్ కోతలపై హిజ్రాలు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని సివిస్కే విల్లాల్లో ఉంటున్న హిజ్రాలు ఒక్కసారిగా పట్టణ విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిస్కే విల్లాల్లో ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు విధిస్తే తాము ఎలా ఉండాలి..మేము కూడా మనుషులమే కదా..ఎందుకు విద్యుత్ కోతలు సృష్టిస్తున్నారని అధికారులపై హిజ్రాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సివిస్కే ఫేస్2లో నిరంతర విద్యుత్ సమస్యలు వస్తున్నాయని, సంబంధిత శాఖ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని, దాంతో విసుగు చెందే తాము ముట్టడి చేసేందుకు వచ్చామని వివరించారు. హిజ్రాల బృందం నాయకురాలు సంగీత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హిజ్రాలు పట్టణ ట్రాన్స్‌కో కార్యాలయానికి చేరుకొని ఆందోళనలు చేశారు. వివిస్కే విల్లాలో ఎందుకు పూర్తి స్థాయిలో విద్యుత్ లైన్లు వేయలేదని, కోతలకు సమయపాలన అనేది లేకుండా ఇష్టారాజ్యంగా తీసివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సివిస్కే వెంచర్ యజమాని సురేష్ ఆగర్వాల్‌తో మీకు ఎలాంటి సమస్య ఉన్నా మీరు చూసుకోవాలి..కానీ మాకు ఇబ్బందులు కలిగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇరువురి విభేదాల కారణాల వల్ల ఇప్పుడు కోతలు విధించడం విడ్డూరంగా ఉందని, కోతలు లేకుండా విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిజ్రాలు తిట్టె మాటలకు విద్యుత్ అధికారులు తలలు పట్టుకున్నారు. కోతలు లేకుండా విద్యుత్ అంధించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో అక్కడి నుండి హిజ్రాలు వెళ్ళిపోయారు.

## బాధిత కుటుంబానికి అండ

**ప్రజాపక్షం/తాండూరు:**పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి గ్రామానికి చెందిన రైతు ఒగ్గు సాతయ్యకు చెందిన 50గొర్రెలు మూడు రోజుల క్రితం కుక్కల దాడిలో మరణించిన విషయం తెలిసిందే. స్థానిక ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలసి ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మంత్రి వాకటి శ్రీహరి దృష్టికి పోన్ ద్వారా జరిగిన సంఘటనకు సంబంధించిన విషయాన్ని ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి వివరించారు. స్పందించిన మంత్రి సహాకారం అందజేస్తామని హామి ఇచ్చారు. అనంతరంబాధితకుటుంబానికి సహాయంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రూ.10వేలు, ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. త్వరలోనే కురువ సంఘం తరపున మరో రూ. 50 వేలు అందించే విధంగా చూస్తామని ప్రభుత్వ విప్ ఐలయ్య హామిచ్చారు.

## ఆరోగ్యం పట్ల అవగాహన ఉండాలి



**ప్రజాపక్షం/మియాపూర్:**ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు దోహదపడతాయని కార్పొరేటర్ శ్రీకాంత్ అన్నారు.శనివారం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గ్రేస్ క్యాన్సర్ పౌండేషన్,మాక్సిమస్‌లైన్స్ క్లబ్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ శిబిరంలో క్యాన్సర్ కు సంబంధించిన నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్,గర్భాశయ క్యాన్సర్ వంటి వివిధ రకాల క్యాన్సర్‌ల కోసం స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రేస్ క్యాన్సర్ పౌండేషన్,మాక్సిమస్ లైన్స్ క్లబ్ వారి సామాజిక సేవలను కొనియాడారు. వైద్యులు నిర్వాహకుల నిస్వార్థ సేవను ప్రశంసించారు.ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు దోహదపడతాయని అన్నారు.అనారోగ్యంగా ఉంటే,అశ్రద్ధ చేయకుండా,వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనలు, సలహాలు పాటించి, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. మనం తీసుకొనే ఆహారం సమయ పాలన పాటించాలని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య శిబిర నిర్వాహకులు లక్ష్మీ కుమారి,స్రవంతి,మయూరి నగర్ అసోసియేషన్ సభ్యులు కే వెంకటరామరాజు,కిషోర్, హరికృష్ణ,ప్రవీణ్ రెడ్డి,సోమేశ్వర్ రెడ్డి,నాగరాజు,రమణారెడ్డి,కృష్ణ కుమార్,భాష తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేయాలి

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభించేందుకు అవకాశం ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటికి వచ్చిన జెట్టింగ్, స్విపింగ్ నూతన వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ రెండు వాహనాల విలువ సుమారు రూ.55లక్షల ఉంటుందని, రోడ్లు శుభ్రం చేయడంతోపాటు డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా పనులు చేస్తాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే రెండు నూతన వాహనాలను అందుబాటులోకి తీ సుకువచ్చినట్లు వివరించారు. డ్రైనేజీ పనులు చేసే వాహనం విలువ రూ.50లక్షలు ఉంటుందని, రోడ్లు శుభ్రం చేసేందుకు రూ.5లక్షలతో మరో యంత్రం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. మున్సిపాలిటిలోని పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తేఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ప్రభుత్వం అంధిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడం తోపాటు అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలని సూచించారు.

**రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులకు ముందడుగు**

చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులకు ముందడుగు పడిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం ఉదయం రైల్వే శాఖ అధికారులతో పాటు ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల అధికారులు బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఎన్నో ఏళ్లకలగా మిగిలిపోయిందని, ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు సంవత్సరాల పాటు తిరుగాల్సి వచ్చిందని వివరించారు.స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ కృషితోనే రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందని మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ తెలిపారు. నిర్మాణంలో ఆస్తులు కొల్పోతున్న బాధితులకు నష్టపరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని సహాకరించాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమీషనర్ సునీత, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, కొందుర్గు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు యాదగిరి యాదవ్,రాజేందర్‌రెడ్డి,లింగారెడ్డిగూడఅశోక్,గడ్డమీది రమేష్, నీరటి వాసు, ముబారక్, ఖదీర్, కత్తి చంద్రశేఖర్ అప్ప, చందు, శ్రీనివాస్, శేఖర్, నల్లమోని శ్రీధర్‌లు పాల్గొన్నారు.

## రోగుల వివరాలు నమోదు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆసుపత్రికి వచ్చే రోగు ల వివరాలను అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఐసిటిసి సెంటర్‌లో, జనరల్ పేషెంట్ల పరీక్ష రిజిస్టర్, గర్భిణీ స్త్రీలకు నిర్వహించే పరీక్షల రిజిస్టర్‌ను, క్షయవ్యాధి ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షల రిజిస్టర్‌ను పరిశీలించి రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డాక్టర్ పాపారావు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అంధించడంతోపాటు మందులను ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగి ఏ వైద్యం కోసం వస్తున్నారో అనే విషయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఉన్నతాదికారులకు క్లియర్‌గా తెలిసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారా..లేదా అనే విషయాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీలో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు. ఐసిటిసి కౌన్సిలర్ శ్యాంసుందర్, క్షయ వ్యాధి సూపర్ వైజర్లు షఫీ, రవికుమార్, ల్యాబ్ టెక్నిషియన్ సలాంఖాన్, స్టాఫ్ నర్సు వినీత, రవికుమార్‌తోపాటు ఆశా కార్యకర్తలు ఉన్నారు.




# 'నేను రెడీ'కి మిక్కీ జె మేయర్ సంగీతం



నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ఆకట్టుకున్న యంగ్ హీరో హవీష్, సినిమా చూపిస్తా మామా, నేను లోకల్, ధమాకా, మజాకా వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను అందించిన త్రినాధ రావు నక్కిన కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'నేను రెడీ'. హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్ నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. మెలోడీ స్పెషలిస్ట్ మిక్కీ జె మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. మాస్ డైరెక్టర్ త్రినాధ రావు నక్కిన, మెలోడీ కంపోజర్ మిక్కీ జె మేయర్ కలిసి పని చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే విడుదలైన నేను రెడీ అనే టైటిల్ మంచి రెస్పాన్స్‌తో ఈ చిత్రంపై భారీ అంచనాలను నెలకొల్పింది.

# 'వసుదేవసుతం' టైటిల్ సాంగ్ రిలీజ్



మాస్టర్ మహేంద్రన్ హీరోగా బేబీ చైత్ర శ్రీ బాదర్ల, మాస్టర్ యువ్వాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మి బాదర్ల నిర్మాతగా వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. రెయిన్‌బో సినిమాస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ మూవీకి సంబంధించిన పోస్టర్లు, మోషన్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి టైటిల్ సాంగ్‌ను హీరో ఆకాష్ జగన్నాథ్ రిలీజ్ చేశారు. వసుదేవసుతం దేవం' అంటూ సాగే ఈ పాటను ఆకాష్ జగన్నాథ్ విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ అందించిన సాహిత్యం, పవన్‌శృతిక సముద్రాల గాత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఇక మెలోడీ బ్రహ్మ మణిశర్మ మరో చార్ట్ బస్టర్ సాంగ్ ఇచ్చినట్టుగా కనిపిస్తోంది. ఈ లిరికల్ వీడియోలో హీరో హీరోయిన్ జంట చూడముచ్చటగా ఉంది. ఊరి వాతావరణం, గుడిలో చిత్రీకరించిన ఈ పాట అందరినీ కట్టి పడేసేలా ఉంది. ఇక తెర అంతా కూడా కలర్ ఫుల్గా కనిపిస్తోంది. కొరియోగ్రాఫీ కూడా ఎంతో చక్కగా కుదిరినట్టు కనిపిస్తోంది.పాటను రిలీజ్ చేసిన అనంతరం ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ.. 'వసుదేవసుతం' మూవీలోని 'వసుదేవసుతం దేవం' అనే పాట చాలా బాగుంది. టీం అంతా వచ్చి నన్ను కలిసింది. ఈ పాటను నేను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. చైతన్య ప్రసాద్ గారి సాహిత్యం, మణిశర్మ గారి సంగీతం బాగుంది. మహేంద్రన్ అద్భుతమైన నటుడు. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

# పెద్దిలో.. జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మకంగా సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం నుండి ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ , వర్కింగ్ స్టిల్స్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈరోజు, మేకర్స్ రెండు డిఫరెంట్ పోస్టర్ల ద్వారా అచ్చియ్యమ్మగా జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్లో జాన్వీ కపూర్ అద్భుతంగా కనిపించింది. రస్టిక్ ప్రింటెడ్ చీర, సంప్రదాయ నగలు, సన్నా సెస్తో స్టైలిష్గా మైక్ ముందు ధైర్యంగా నిలబడి ఉన్న ఆమె లుక్ చూసి ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. పోస్టర్ పండుగ వాతావరణాన్ని క్రియేట్ చేసింది. రెండో పోస్టర్ బ్లూ చీరలో జీప్పై నిలబడి, ధైర్యంగా అభివాదం చేస్తూ కనిపిస్తుంది. ఇది ఆమె పాత్రలోని సోషల్ ఇంపాక్ట్, ఆత్మవిశ్వాసాన్ని చక్కగా ప్రజెంట్ చేసింది. ఫియర్స్ అండ్ ఫియర్లెస్ అనే టైటిల్‌కి తగినట్లుగా ఈ పోస్టర్లలో జాన్వీ పూర్తిగా మాసీ లుక్‌తో ఆకట్టుకుంటోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ ఈ చిత్రంలో ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు.






# 'ఛాంపియన్' టీజర్ రిలీజ్

యంగ్ హీరో రోషన్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన రోషన్, అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్ మంచి హైప్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఫుట్‌బాలర్‌గా రోషన్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించాడు. హైదరాబాదీ యాసలో హిందీ మిక్స్ చేసిన అతని డైలాగ్ డెలివరీ చాలా న్యాచురల్గా, క్యారెక్టర్కి తగినట్టుగా ఉంది. యాక్షన్ సన్నివేశాల్లో ఎనర్జీ, రొమాంటిక్ సీన్స్‌లో ఫినెస్, ఆత్మవిశ్వాసంతో కూడిన అటిట్యూడ్‌తో రోషన్ ఆకట్టుకున్నాడు. అనస్వర రాజన్ అందంగా కనిపించింది. ఇద్దరి కెమిస్ట్రీ మనసుకు హత్తుకునేలా ఉంది. ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి ప్రీఇండిపెండెన్స్ కాలాన్ని అద్భుతంగా రీక్రియేట్ చేశారు.

# సుడిగాలి సుధీర్ షూటింగ్ పూర్తి

జైశ్నవ్ ప్రొడక్షన్, మాహాతేజ క్రియేషన్స్‌లో అద్భుతం, వంటి అద్భుతమైన చిత్రాలని నిర్మించిన మొగుళ్ళ చంద్రశేఖర్ గారి నిర్మాణంలో... క్రికెట్ నేపథ్యంలోనే కామెడీ ప్రధాన అంశంగా సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా గోట్ మూవీ షూటింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకి చేరుకున్నాయని చంద్రశేఖర్ తెలియజేశారు. త్వరలోనే టీజర్, పాటలు రిలీజ్ చేయనున్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, మొట్ట రాజేంద్రన్, సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, పృథ్వి, అడుకులం నరైన్, ఆనందరామరాజు, పమ్మి సాయి, చమ్మక్ చంద్ర, నవీన్ నేని నటిస్తున్నారు.






# 'చిన్ని గుండెలో' పాట రిలీజ్

రామ్ పోతినేని హీరోగా, భాగ్యశ్రీ భోర్సే హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. నవంబర్ 28న థియేటర్లలో విడుదల కానుంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర సూపర్‌సార్‌గా కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. వివేక్ , మెర్విన్ స్వరపరిచిన మొదటి రెండు పాటలు చార్ట్ బస్టర్ హిట్స్ అయ్యాయి. మేకర్స్ థర్డ్ సింగిల్ 'చిన్ని గుండెలో'ను విడుదల చేశారు. ఒక సినిమాలోని ప్రతి పాటకు ప్రత్యేకమైన కథ ఉంటుంది. రామ్ అద్భుతంగా పాడిన మొదటి పాట ఒక గ్రామం నేపథ్యంలో సెట్ చేయబడిన ప్రేమకథను వివరిస్తుంది. రెండో పాటలో రామ్ తన వాయిస్‌తో అభిమానుల క్రేజ్, ఫ్యాన్ వార్స్, ఫస్ట్ ఫస్ట్ షో ఉత్సాహాన్ని అద్భుతంగా చూపించారు. ఇప్పుడు విడుదలైన మూడో పాట కూడా అంతే మ్యాజికల్‌గా వుంది.

# హరీష్ శంకర్‌కు పార్థిపన్ బహుమతి

తెలుగు సినిమా దర్శకుడు హరీష్ శంకర్‌కు తమిళ నటుడు పార్థిపన్ బహుమతి ఇచ్చారు. పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ గబ్బర్ సింగ్ సినిమాలో పార్థిపన్ నటించారు. ఈ సినిమాలో పార్థిపన్ అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. తనకు ఇంతమంచి క్యారెక్టర్ ఇచ్చినందుకు గానూ హరీష్ శంకర్‌పై ఉన్న అభిమానంతో మంచి బహుమతి ఇచ్చారు. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ చివరి రోజున ఈ బహుమతి ఇచ్చారు. కెమెరా, రీల్ ఉన్న బహుమతి అందజేశారు.



# స్టాలిన్ బాబు సేవలు చిరస్మరణీయం

## ఆయన నిబద్ధత, క్రమశిక్షణ స్ఫూర్తిదాయకం
## ఆత్మీయ నివాళి సభలో పలువురు వ్యక్తులు






**గుంటూరు కలెక్టరేట్ :** కమ్యూనిస్టుగా, విద్యార్థి, యువజనోద్యమ నేతగా, ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ నాయకుడిగా స్టాలిన్ బాబు అందించిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకష్ణ అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, ఆల్ ఇండియా ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ బొప్పూడి స్టాలిన్ బాబు ఆత్మీయ నివాళి సభ గుంటూరు శ్యామలనగర్‌లోని మెట్టు మల్లారెడ్డి కన్వెన్షన్ హాలులో శనివారం జరిగింది. అవగాహన సంస్థ కార్యదర్శి కొండ శివరామిరెడ్డి అతిథులను వేదిక పైకి ఆహ్వానించగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన రామకష్ణ మాట్లాడుతూ స్టాలిన్ బాబు ఉపన్యాసం సుదీర్ఘంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. మరికొంతకాలం ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగి ఉంటే సురవరం సుధాకర్ రెడ్డి తర్వాత అంతటి స్థాయికి ఎదిగి ఉండేవారని అన్నారు. విలువలు అనేవే లేకుండాపోతున్న ప్రస్తుత సమాజంలో ఇంతమంది శ్రేయోభిలాషులు, మిత్రులను సంపాదించుకున్న స్టాలిన్ బాబు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన యుక్త వయస్సులో ఉండగా ఏసి ద్ధాంతం... ఏ విలువలు కోసం పని చేశారో వాటిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిజం భావాలు చెరిపివేయడం ఎవ్వరి తరం కాదని, అభ్యుదయ, కమ్యూనిజం భావాలు కలిగిన వారికి స్టాలిన్ బాబు ప్రేరణగా నిలుస్తారని అన్నారు. క్రియాశీల రాజకీయాల నుంచి స్టాలిన్ బాబు రిటైర్ అయి 50 సంవత్సరాలు అయినప్పటికీ నేటికి ఆయన గురించి చెప్పుకోవడం ఆయన వీరోచిత పోరాట మనస్తత్వాన్ని, భావజాలాన్ని తెలియజేస్తోందన్నారు. సిపిఐ తెలంగాణ పార్టీ తరపున స్టాలిన్ బాబుకు నివాళులర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 'స్టాలిన్' అనే పేరు ఒక స్ఫూర్తి అని, అటువంటి పేరు పెట్టుకున్న స్టాలిన్ బాబు వందలాది మంది ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు తయారుకావడానికి కారకుడయ్యారని అన్నారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే ఒ క మహత్తర పోరాటంలో స్టాలిన్ బాబు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశా రు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ స్టాలిన్ బాబుది ఆదర్శవంతమైన జీవితమని అన్నారు. గుంటూరు చరిత్రలో ఆయనది కూడా ఒక శకమని తెలిపారు. ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ స్టాలిన్ బాబుతో తనకు ఏర్పడిన పరిచయాన్ని వివరించారు. కమ్యూనిస్టు కార్యకర్తలను తయారు చేయడంలో స్టాలిన్ బాబు కషి ఎనలేనిదన్నారు. నేటితరం కమ్యూనిస్టులు ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు.

సిపిఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్టాలిన్ బాబు పార్టీ పట్ల అంకితభావం కలిగిన నాయకుడని, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకువెళ్లడంలో విశేష కషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు జంగాల అజయ్ కుమార్, ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ సుంకర రామచంద్ర ప్రసాద్, స్టాలిన్ బాబు సతీమణి మరుధ్వతి, కుటుంబ సభ్యులు మద్దుకూరి శివశంకరరావు, మధు భారతి, నల్లూరి వెంకట సుబ్బయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.




# నివేదికలు పంపండి

**(మొదటి పేజీ తరువాయి)**

అరవింద్ కుమార్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 24 జిల్లాలు ఈ మొంథా తుఫాన్‌కు ప్రభావితమయ్యాయని తెలిపారు. జిల్లాలలో జరిగిన పంట నష్టంతో పాటు, రహదారులు, నీటి వనరులు, పశువులు, ప్రాణ నష్టంతో పాటు ఇతర ప్రాథమిక వివరాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో ఏ విధమైన సూచనలు లేకుండా 25 నుండి 30 సెంటీ మీటర్ల వర్షపాతం ఆకస్మికంగా కురుస్తోందని, ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాల వారీగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని సిఎస్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో వివిధ జిల్లాలలో దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, నీటి వనరులకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎక్కడైనా అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల భవనాలు ధ్వంసం అయితే వాటి పునరుద్ధరణకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్టు సిఎస్ తెలిపారు. అదే విధంగా తరచుగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. నష్టపరిహారం అందించేందుకు వీలుగా నష్టం వివరాలను సోమవారం వరకు పంపించాలని కోరారు. ఎలాంటి అలసత్వం లేకుండా పునరావాస చర్యలు తీసుకోవాలని కోరారు.

# మానవ హక్కుల ఉల్లంఘనలు ఆపండి

## పాక్‌కు భారత్ హితవు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వేదికగా పాకిస్థాన్‌కు మరోసారి భంగపాటు ఎదురైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజల బహిరంగ తిరుగుబాటును అక్కడి దళాలు అణచివేస్తున్నాయని, అక్కడ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను వెంటనే ఆపాలని భారత్ డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో చర్చ సందర్భంగా భారత్ దౌత్యవేత్త భవిక మంగళా నందన్ మాట్లాడుతూ పాక్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పీవోకేలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలుకొనసాగుతున్నాయన్నారు. వీటిని ఆపాలని ఆమె డిమాండ్ చేశారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com